www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

VIGNAN'S
FOUNDATION FOR SCIENCE, TECHNOLOGY & RESEARCH
NAAC A+
ABET
NIRF RANK 72nd
వీశాట్ ర్యాంకులు, జేఈఈ మెయిన్స్, ఇంటర్ మార్కుల ఆధారంగా
ఏప్రిల్ 16 నుంచి 20 వరకు కౌన్సిలింగ్
Guntur | Hyderabad. Mobile : 7799 427 427

మంగళవారం | 15-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 360 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: విదియ ఉ.10:56 తదియ, నక్షత్రం: విశాఖ తె.3:10 అనూరాధ. వర్జ్యం: ఉ.6:30-8:18, దుర్ముహూర్తం: ఉ.8:31-9:21, రా.10:15-రా.10:59, అమృతఘడియలు: సా.5:17-7:04, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విజ్ఞాన్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ

48 years of Academic Excellence

ఆర్థిక మాంద్యం ముంచుకొస్తున్నా..
ప్రపంచ దేశాల్లో క్లిష్ట పరిస్థితులున్నా..
దేశీయ మార్కెట్ నెమ్మదించినప్పటికీ..

మన యువత
గొప్ప గొప్ప ఉద్యోగాలు సాధించాలి..
దిగువ, మధ్యతరగతి కుటుంబాలు
పైస్థాయికి ఎదగాలి...

– అదే ధ్యేయం.. అదే లక్ష్యంతో...

నాలుగు సంవత్సరాల క్రితం అడ్మిషన్స్‌కి యూనివర్సిటీలో చేరిన విద్యార్థులలో **80-85%** మందికి ఉద్యోగాలు కల్పిస్తామని దృఢంగా చెప్పాము. దీనికి అనుగుణంగా ఇప్పుడు నాలుగో సంవత్సరం విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించారు. ప్రతిభావంతులే కాకుండా సాధారణ స్థాయి విద్యార్థులు కూడా ఉన్నత ఉద్యోగాలు సాధించారని తెలియజేయుటకు ఆనందిస్తున్నాము.

COURSES OFFERED IN GUNTUR

Undergraduate Programs
- Agricultural Engineering
- Biotechnology
- Bioinformatics
- Biomedical Engineering
- Chemical Engineering
- Civil Engineering
- Computer Science Engineering
- CSE - Artificial Intelligence & Machine Learning
- CSE - Cyber Security
- CSE - Computer Science & Business Systems
- CSE - Data Science
- CSE - Internet of Things (IoT)
- Electronics and Communication Engg.
- Electronics and Communication Engg. - VLSI
- Electrical and Electronics Engineering
- Food Technology
- Information Technology
- Mechanical Engg
- Robotics & Automation
- Textile Technology / Technical Textile
- BBA
- BCA
- B.Sc (MSCs)
- B.Sc (Hons) Agriculture
- B.Sc (Actuarial Science | Data Science | Psychology)
- B.Pharmacy
- Pharm.D
- BA LLB (Hons)
- BBA LLB (Hons)
- Diploma - CSE | ECE | EEE | MECH

Post-Graduate Programs
- M.Tech (VLSI | Power Electronics and Drives | CSE | Electric Vehicle Technology | Food Processing Technology | Machine Design | Farm Machinery | Structural Engineering | Biotechnology | Internet of Things)
- MBA
- MCA
- BBA+MBA (5 yrs Integrated Course)
- M.A. - English
- M.Sc - Data Science
- M.Sc - Chemistry
- M.Sc - Organic Chemistry
- M.Sc - Psychology
- M. Pharmacy

Ph.D. in Engineering, Science & Humanities, Management and Pharmacy.

COURSES OFFERED IN HYDERABAD

Undergraduate Programs
- Biotechnology
- Bioinformatics
- Computer Science Engineering
- CSE - Artificial Intelligence & Machine Learning
- CSE - Cyber Security
- CSE - Data Science
- ECE
- Information Technology
- BBA
- BCA
- B.Com
- B.Sc (Psychology)
- B.Pharmacy

Post-Graduate Programs
- M.Tech (CSE | VLSI | Embedded System | EV Technology)
- MBA
- MCA
- M.Sc - Data Science
- M.Sc - Psychology
- M.Sc - Pharmaceutical Chemistry

Ph.D
(CSE | ECE | Management | Chemistry | Physics | Biotechnology)

ఈ లక్ష్యాలను సాధించడానికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు...

- విద్యార్థుల ప్రణాళికలో ప్రాజెక్ట్ ఆధారిత పాఠ్యాంశాలను మాత్రమే కాకుండా ఇప్పుడున్న ఐటీ ఉద్యోగాలు అందుకోవడానికి అన్ని కోర్సుల్లో కంప్యూటర్స్‌కు సంబంధించిన అనేక అంశాలను **30% నుంచి 40%** వరకు చేర్చటం.
- బహుళజాతి సంస్థలకు అవసరమైన టీమ్ స్పిరిట్‌ను పెంపొందించడానికి ప్రతి కోర్సులో ప్రాజెక్టులను విద్యార్థులు కలిసి నిర్వహించేలా చూడటం.
- ప్రాక్టికల్ ఓరియెంటెడ్ టెక్నికల్ శిక్షణ.
- కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచటానికి కేంబ్రిడ్జి యూనివర్సిటీతో ఒప్పందం.
- విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌తోపాటు ఇతర కాంపిటీటివ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ.
- శారీరక దృఢత్వానికి (ఫిజికల్ ఫిట్‌నెస్) అత్యంత ప్రాధాన్యతనిచ్చి వాటికి మార్కులను కేటాయించి, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండేలా చూడటం.
- ఈ ప్రయత్నాలన్నింటి వలనే ప్రతి విద్యార్థి విషయపరిజ్ఞానంతో పాటు స్పష్టమైన భావప్రకటన, టీమ్‌స్పిరిట్, సృజనాత్మకతతో కూడిన పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణం జరిగి అనేక మల్టీనేషనల్ కంపెనీల్లో పెద్ద పెద్ద ఉద్యోగాలు సాధించగలిగారు.

వీశాట్ ర్యాంకులు, జేఈఈ మెయిన్స్, ఇంటర్ మార్కుల ఆధారంగా
ఏప్రిల్ 16 నుంచి 20 వరకు కౌన్సిలింగ్

మెరిట్ ఆధారంగా B.Tech/B.Pharmacy/Pharm-D B.Sc (Hons) Agriculture స్కాలర్‌షిప్‌లు

Scholarships*		75%	50%	25%	10%
V-SAT (Rank)		-	1 - 50	51 - 200	201 - 2000
JEE Mains (Percentile)*		Above 95	89 - 94.9	80 - 88.9	70 - 79.9
EAPCET (Rank) (AP & TS)	MPC	Below 10000	10001-20000	20001-35000	35001-40000
	BiPC	Below 4000	4001-10000	10001-25000	25001-35000
NEET (State Rank)		Below 10000	10001-15000	15001-25000	25001-35000
CBSE + 2		-	Above 450	425 - 449	375-424
AP / TS (Inter Marks)		-	Above 970	950 - 969	920-949

గమనిక : ఇంటర్‌లో 60% కి పైగా సాధించిన విద్యార్థులు మాత్రమే అడ్మిషన్‌కు అర్హులు

రెండు తెలుగు రాష్ట్రాలలో
ABET (అమెరికా) అక్రిడిటేషన్
సాధించిన మొట్టమొదటి యూనివర్సిటీ

85-90 శాతం ఉద్యోగాలు*
10-15 శాతం ఉన్నత చదువులు

ప్రతిభకు ప్రోత్సాహం (స్కాలర్‌షిప్పులు)
- జేఈఈ, ఎంసెట్, వీశాట్, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్పులు.
- ప్రతి ఏడాది రూ. 16 కోట్ల నుంచి రూ. 20 కోట్లకు పైగా స్కాలర్‌షిప్పులు.

విజ్ఞాన్స్
Foundation for Science, Technology & Research
(డీమ్డ్ టు బీ యూనివర్సిటీ)
(Estd u/s 3 of UGC Act of 1956)
GUNTUR | HYDERABAD

ABET (CSE, EEE, ECE, MECH, BT) | NAAC GRADE A+ | NIRF RANK 72nd

వడ్లమూడి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్
Cell : 7799 427 427, 79819 89595
99499 83666, 95815 08798

రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర, దేశ్‌ముఖి, హైదరాబాద్
Cell : 93984 40311, 98661 81233

విజయవాడ, పశ్చిమ గోదావరి - 88855 59373, 99515 26483 గుంటూరు, నెల్లూరు, ఒంగోలు - 83286 66589 వైజాగ్, తూర్పు గోదావరి - 91004 68711, 98855 58433 ఖమ్మం - 93942 44999 రాయలసీమ - 80999 16859 రంగారెడ్డి - 63005 86164, 63028 27990 వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ - 96767 06159 నల్గొండ, మిర్యాలగూడ - 63011 44266

నేటి మ్యాచ్	వేదిక చండీగఢ్
పంజాబ్ x కోల్‌కతా	రా.7.30 నుంచి

సలీమాకే పగ్గాలు

ఆసీస్ టూర్‌కు భారత మహిళల హాకీ జట్టు



సలీమా టెటే

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో పర్యటించే భారత మహిళల హాకీ జట్టులో ఐదు కొత్తముఖాలకు చోటు దక్కింది. మిడ్‌ఫీల్డర్ సలీమా టెటే సారథ్యంలోని 26 మంది సభ్యుల జట్టును హాకీ ఇండియా సోమవారం ప్రకటించింది. జ్యోతి సింగ్, సుజాత కుజుర్, అజ్మీనా కుజుర్, పూజా యాదవ్, సలీమా సోదరి మహిమ టెటే తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి మే 4 వరకు జరిగే పర్యటనలో ఆతిథ్య ఆసీస్‌తో భారత్ ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఆసీస్-ఎతో రెండు మ్యాచ్‌లు, సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌ల్లో మనమ్మాయిలు తలపడనున్నారు.

రుతురాజ్ స్థానంలో మాత్రే

జంపా బదులు స్మరణ్



న్యూఢిల్లీ: గాయపడిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ఆయుష్ మాత్రేను జట్టులోకి తీసుకొన్నట్టు ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పిన్నర్ ఆడమ్ జంపా కూడా గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని స్మరణ్ రవిచంద్రన్‌తో భర్తీ చేశారు. ముంబై తరపున దేశవాళీ క్రికెట్ ఆడుతున్న మాత్రేతో రూ. 30 లక్షలకు చెన్నై ఒప్పందం చేసుకొంది. 9 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయుష్ 962 పరుగులు చేశాడు. కర్నాటకకు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్ స్మరణ్‌ను సన్‌రైజర్స్ రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది.

ఆర్చరీ కమిటీ చైర్మన్‌గా చెరుకూరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఆర్చరీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చెరుకూరి సత్యనారాయణ నియమితులయ్యారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విలుకాండ్లను గుర్తించి..వారిని అంతర్జాతీయ ఆర్చర్లుగా తీర్చిదిద్దడం ఈ కమిటీ బాధ్యత. చైర్మన్‌గా సత్యనారాయణ, కన్వీనర్‌గా సుమంత చంద్ర మొహంతి, సభ్యులుగా పుట్టా శంకరయ్య (తెలంగాణ), జమ్యాంగ్ సెరింగ్, దేవానంద్ సింగ్‌తోపాటు సంజీవ సింగ్, పూర్ణిమ, జీవన్‌జ్యోత్ సింగ్ (ఈ ముగ్గురూ ద్రోణాచార్య అవార్డీలు)కు కమిటీలో చోటు లభించింది.

ధీరజ్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు ఆటగాడు బొమ్మదేవర ధీరజ్ కాంస్యం సాధించాడు. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ముగిసిన ఈ ఈవెంట్‌లో భారత్ ఓ స్వర్ణం సహా నాలుగు పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో ధీరజ్ 6-4 పాయింట్ల తేడాతో ఆండ్రెస్ టెమినో (స్పెయిన్)ను ఓడించాడు. ఆరంభంలోనే 2-4తో వెనుకబడిన ధీరజ్.. తీవ్ర ఒత్తిడి మధ్య అద్భుత ప్రదర్శనతో కంచు పతకం సొంతం చేసుకొన్నాడు.

అక్షర్ పటేల్‌కు రూ.12 లక్షల జరిమానా


న్యూఢిల్లీ: స్లో ఓవర్ రేట్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో డీసీ నిర్ణీత సమయంలో ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ముంబై 12 రన్స్ తేడాతో నెగ్గిన విషయం తెలిసిందే.

డిస్కస్ త్రోలో ప్రపంచ రికార్డు



రమోనా (యూఎస్): డిస్కస్‌త్రోలో లిథువేనియా అథ్లెట్ మైకొలాస్ అలెక్‌నా చరిత్ర సృష్టించాడు. పురుషుల డిస్కస్ త్రోలో తొలిసారి 75 మీటర్లు విసిరి నయా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఓక్లహామా త్రోస్ సిరీస్ వరల్డ్ ఇన్విటేషనల్ పోటీల్లో 22 ఏళ్ల మైకొలాస్ ఒక్క రోజే రెండుసార్లు ప్రపంచ రికార్డు త్రోలు విసరడం విశేషం. తొలి త్రోలోనే మైకొలాస్ రికార్డుస్థాయిలో 74.89 మీటర్ల దూరం విసిరాడు. రెండో త్రోలో డిస్కస్‌ను 75.56 మీటర్ల దూరం విసిరి తన రికార్డును తానే బద్దలుకొట్టుకొన్నాడు.

ధోనీ పనైపోయిందని అనుకోవద్దు



న్యూఢిల్లీ: వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకొంది. అయితే, మెగా లీగ్‌లో చెన్నై ఇప్పటికీ గట్టిపోటీదారు అని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్వాసం వ్యక్తం చేశాడు. చెన్నై కష్టాల్లో ఉన్నా ధోనీ సారథ్యంలో పుంజుకొనే అవకాశాలున్నాయన్నాడు. వయసు పైబడడం అనేది మహీకి వర్తించదన్నాడు. ఢిల్లీ, ముంబై, చెన్నై, సన్‌రైజర్స్ జట్లు బలంగా ఉన్నాయని తాను విశ్వసిస్తున్నట్టు చెప్పాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	6	4	2	0	8	1.081
ఢిల్లీ	5	4	1	0	8	1.006
బెంగళూరు	6	4	2	0	8	0.672
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	6	3	3	0	6	0.803
పంజాబ్	5	3	2	0	6	0.065
ముంబై	6	2	4	0	4	0.027
రాజస్థాన్	6	2	4	0	4	-0.838
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

చెన్నై గెలిచిందోచ్..

- సత్తా చాటిన బౌలర్లు
- ఆదుకున్న దూబే, ధోనీ
- 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ ఓటమి



షేక్ రషీద్ (27)



శివమ్ దూబే (43 నాటౌట్)

లఖ్‌నవూ: ఒకటా.. రెండా.. వరుసగా ఐదు ఓటములతో నిరుత్సాహపర్చిన చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. సీజన్‌లో తొలిసారిగా బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చగా.. అటు బ్యాటింగ్‌లో శివమ్ దూబే (43 నాటౌట్) నిలకడ, ఎంఎస్ ధోనీ (11 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 నాటౌట్) మెరుపు ఆటతీరుతో చివరి ఓవర్‌లో చెన్నై గట్టెక్కింది. మరోవైపు హ్యాట్రిక్ విజయాల జోష్‌లో ఉన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో ఓడాల్సి వచ్చింది. ఇక మూడేళ్లగా చెన్నై జట్టుతోనే ఉంటున్న ఆంధ్ర క్రికెటర్ షేక్ రషీద్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 27) అరంగేట్రంలోనే రాణించాడు. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. రిషబ్ పంత్ (63), మిచెల్ మార్ష్ (30) రాణించారు. జడేజా, పథిరనలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసి గెలిచింది. రచిన్ (37) ఆకట్టుకున్నాడు. బిష్ణోయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ధోనీ నిలిచాడు.

రషీద్-రచిన్ శుభారంభంతో..: ఓ మాదిరి ఛేదనలో చెన్నైకి అదిరే ఆరంభం లభించింది. తొలి ఐపీఎల్ మ్యాచ్‌లోనే షేక్ రషీద్ ఓపెనర్‌గా బరిలోకి దిగి బెదురులేకుండా ఆడాడు. చూడముచ్చటైన షాట్లతో జట్టుకు తనపై నమ్మకం కుదిరేలా ఆకట్టుకున్నాడు. తొలి ఓవర్‌లో మరో ఓపెనర్ రచిన్ రెండు ఫోర్లు బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో రషీద్ మూడు ఫోర్లు బాది వహ్వా అనిపించాడు. అంతేకాకుండా శార్దూల్ వేసిన ఓవర్‌లోనూ మరో మూడు ఫోర్లతో 14 రన్స్ అందించాడు. అయితే ఆత్మవిశ్వాసంతో కనిపించిన అతడు భారీ షాట్‌కు యత్నించి అవేశ్‌కు చిక్కాడు. రషీద్ 27 పరుగుల్లో ఆరు ఫోర్లు ఉండడం విశేషం. అతని జోరుతో పవర్‌ప్లేలో చెన్నై 59/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు హవా చూపడంతో ఒక్కసారిగా తడబడింది. స్కోరు నెమ్మదించడంతో పాటు స్వల్ప వ్యవధిలోనే రచిన్, త్రిపాఠి (9), జడేజా (7), విజయ్ శంకర్ (9)ల వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 111/5. ఈ స్థితిలో ప్రేక్షకుల హోరు మధ్య అడుగుపెట్టిన ధోనీ 16వ ఓవర్‌లో రెండు ఫోర్లు, తర్వాత శార్దూల్ ఓవర్‌లో భారీ సిక్సర్‌తో ఒత్తిడి తగ్గించాడు. ఇక 19వ ఓవర్‌లో దూబే 4,6.. ఎంఎస్ 4తో 19 రన్స్ రావడంతో ఎల్ఎస్‌జీ ఆశలు వదులుకుంది. ఆరు బంతుల్లో ఐదు రన్స్ కావాల్సిన వేళ దూబే 4తో మరో మూడు బంతులుండగా చెన్నైకి విజయం దక్కింది.

పంత్ పోరాటం: సీజన్‌లో తొలిసారిగా చెన్నై బౌలర్లు క్రమశిక్షణాయుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. మధ్య ఓవర్లలో మరింత కట్టుదిట్టం చేయడంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ పరుగుల కోసం చెమటోడ్చింది. ముఖ్యంగా స్పిన్నర్ నూర్ అహ్మద్ తన మ్యాజిక్ బంతులతో వణికించాడు. అయితే పంత్ మాత్రం తొలిసారి బ్యాట్ ఝుళిపించాడు. చివరి మూడు ఓవర్లలో అతడి ఎదురుదాడికి లఖ్‌నవూ 44 రన్స్‌తో గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ మార్‌క్రమ్ (6)ను ఖలీల్ అవుట్ చేశాడు. కవర్ పాయింట్‌లోకి కొట్టిన బంతి గాల్లోకి లేవగా త్రిపాఠి వేగంగా పరిగెత్తుతూ డైవింగ్ క్యాచ్ అందుకున్నాడు. అలాగే నాలుగో ఓవర్‌లోనే ప్రమాదకర పూరన్ (8)ను అన్షుల్ కాంబోజ్ ఎల్బీ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 42/2 స్కోరుతో నిలిచింది. క్రీజులో మార్ష్, పంత్ ఉన్నా బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో భారీ షాట్లకు ఇబ్బందిపడ్డారు. మూడో వికెట్‌కు 50 పరుగులు చేరిన వెంటనే మార్ష్‌ను జడేజా బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత 12వ ఓవర్‌లో బదోని (22) రెండు వరుస సిక్సర్లతో కాస్త కదలిక తెచ్చాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే తను క్యాచ్ అవుటైనా అది నోబ్‌గా తేలింది. అలాగే 14వ ఓవర్ తొలి బంతికి అంపైర్ ఎల్బీ ఇచ్చినా రివ్యూలో బతికిపోయాడు. కానీ నాలుగో బంతికి ధోనీ స్టంప్ చేయడంతో వెనుదిరగక తప్పలేదు. మరోవైపు 14-17 ఓవర్ల మధ్య చెన్నై బౌలర్లు 18 పరుగులే ఇవ్వడంతో 150 స్కోరు కూడా కష్టమే అనిపించింది. ఈ దశలో పంత్ రెండు సిక్సర్లతో 18వ ఓవర్‌లో 18 రన్స్ రాబట్టాడు. అలాగే ఐపీఎల్‌లో 19 ఇన్నింగ్స్ తర్వాత తను అర్ధసెంచరీ కూడా పూర్తి చేశాడు. తర్వాతి ఓవర్‌లోనూ పంత్, సమద్‌ల సిక్సర్లతో 16 రన్స్ సమకూరాయి. ఇక చివరి ఓవర్‌లో పంత్, శార్దూల్ (6)ల వికెట్లను పథిరన తీయగా సమద్ రనౌటయ్యాడు. అయితే 10 రన్స్‌తో ఎల్ఎస్‌జీ 160 స్కోరు దాటగలిగింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) త్రిపాఠి (బి) ఖలీల్ 6; మార్ష్ (బి) జడేజా 30; పూరన్ (ఎల్బీ) కాంబోజ్ 8; పంత్ (సి) ధోనీ (బి) పథిరన 63; బదోని (స్టంప్) ధోనీ (బి) జడేజా 22; సమద్ (రనౌట్) 20; మిల్లర్ (నాటౌట్) 0; శార్దూల్ (సి) రషీద్ (బి) పథిరన 6; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 166/7. వికెట్ల పతనం:** 1-6, 2-23, 3-73, 4-105, 5-158, 6-158, 7-166; **బౌలింగ్:** ఖలీల్ 4-0-38-1; కాంబోజ్ 3-0-20-1; ఒవర్టన్ 2-0-24-0; జడేజా 3-0-24-2; నూర్ అహ్మద్ 4-0-13-0; పథిరన 4-0-45-2.

చెన్నై: రషీద్ (సి) పూరన్ (బి) అవేశ్ 27; రచిన్ (ఎల్బీ) మార్‌క్రమ్ 37; త్రిపాఠి (సి అండ్ బి) బిష్ణోయ్ 9; జడేజా (సి) మార్‌క్రమ్ (బి) బిష్ణోయ్ 7; దూబే (నాటౌట్) 43; విజయ్ శంకర్ (సి) అవేశ్ (బి) దిగ్వేష్ 9; ధోనీ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 19.3 ఓవర్లలో 168/5. వికెట్ల పతనం:** 1-52, 2-74, 3-76, 4-96, 5-111; **బౌలింగ్:** శార్దూల్ 4-0-56-0; ఆకాశ్ 1-0-13-0; దిగ్వేష్ 4-0-23-1; అవేశ్ 3.3-0-32-1; బిష్ణోయ్ 3-0-18-2; మార్‌క్రమ్ 4-0-25-1.

చెన్నై కాదు.. లఖ్‌నవూనే



ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. సొంత గడ్డపైనే కాదు.. దేశంలో ఏ వేదికపై ఆడినా అభిమానులకు కొదవుండదు. తాజాగా వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై లఖ్‌నవూకు వచ్చినప్పటికీ.. సీఎస్‌కేపై తమ ప్రేమను చాటుకుంటూ స్టేడియం మొత్తం పసుపుమయమైంది. దీనికంతటికీ కారణం ఎంఎస్ ధోనీయేనని వేరే చెప్పనవసరం లేదు. స్థానిక జట్టు అభిమానులకన్నా రెండింతలు ఎంఎస్ నెంబర్ 7 జెర్సీలతోనే ఫ్యాన్స్ కనిపించడంతో మ్యాచ్ జరుగుతోంది చెపాక్‌లోనా? ఏక్‌నా స్టేడియంలోనా? అనే సందేహం కలిగింది.

రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్

ఎస్‌బీఐ రెపో అనుసంధానిత రుణ రేటు 0.25 శాతం తగ్గింపు

- అదే బాటలో బీఓఎం, బీఓఐ, ఐఓబీ
- నేటి నుంచి కొత్త రేట్లు అమలులోకి..

న్యూఢిల్లీ: రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)ను 0.25 శాతం తగ్గిస్తున్నట్లు దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ సోమవారం ప్రకటించింది. దాంతో బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 8.50 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గనుంది. తద్వారా బ్యాంక్ నుంచి కొత్తగా రుణం తీసుకోబోయే వారికి కాస్త చౌకగా రుణం లభించనుండటంతో పాటు ఇప్పటికే రుణం తీసుకున్నవారిపై నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల భారం కూడా తగ్గనుంది. కాగా, బహిరంగ మార్కెట్ ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను సైతం పావు శాతం తగ్గించి 8.65 శాతానికి కుదిస్తున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. సవరించిన రేట్లు ఈ నెల 15 (మంగళవారం) నుంచి అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నెల 9న ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. దాంతో బ్యాంకులు కూడా రెపో తగ్గింపు ప్రయోజనాన్ని తమ కస్టమర్లకు బదిలీ చేస్తున్నాయి.

- ఎస్‌బీఐతో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) కూడా రుణాలపై వడ్డీ రేట్లను మంగళవారం నుంచి అమలులోకి వచ్చేలా తగ్గించాయి.
- కొత్త, పాత కస్టమర్లకు ప్రయోజనం కలిగేలా గృహ రుణాల వడ్డీ రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు బీఓఐ ప్రకటించింది. దాంతో బ్యాంక్ గృహ రుణ రేటు 7.90 శాతానికి తగ్గింది. హోమ్ లోన్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ రుణాల (వాహన, వ్యక్తిగత, విద్య, తనఖా రుణాలు) పైనా వడ్డీ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్లు బీఓఐ స్పష్టం చేసింది.
- ఆర్ఎల్ఎల్ఆర్‌ను 0.25 శాతం తగ్గిస్తున్నట్లు బీఓఎం తెలిపింది. దాంతో బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 9.05 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గింది. ఐఓబీ సైతం పావు శాతం తగ్గించడంతో పాటు బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 9.10 శాతం నుంచి 8.85 శాతానికి దిగివచ్చింది.

డిపాజిట్ రేట్లకూ కోత



ఆర్‌బీఐ రెపో తగ్గింపు నేపథ్యంలో బ్యాంకులు రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లతో పాటు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటునూ తగ్గిస్తున్నాయి. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను 0.10- 0.25 శాతం వరకు తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. అలాగే, 444 రోజుల కాలపరిమితితో కూడిన అమృత వృష్టి పథకం రేటును సైతం 7.05 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు (60-80 ఏళ్ల వారు) ఈ డిపాజిట్‌పై 7.55 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు (80 ఏళ్ల పైబడిన వారు) 7.65 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. కాగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తన 400 రోజుల స్పెషల్ టర్మ్ డిపాజిట్‌ను ఉపసంహరించుకుంది. ఈ డిపాజిట్‌పై బ్యాంక్ 7.30 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేసింది.

పొదుపు ఖాతాపై వడ్డీ 2.75 శాతానికి తగ్గింపు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పొదుపు ఖాతాపై చెల్లించే వార్షిక వడ్డీ రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దాంతో బ్యాంక్ సేవింగ్ డిపాజిట్ రేటు 2.75 శాతానికి తగ్గింది. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో సేవింగ్ ఖాతాపై ఆఫర్ చేస్తున్న అతి తక్కువ వడ్డీ రేటు ఇదే. రూ.50 లక్షలకు పైగా డిపాజిట్‌పై వడ్డీ రేటును సైతం 3.50 శాతం నుంచి 3.25 శాతానికి తగ్గించినట్లు, ఈ నెల 12 నుంచే కొత్త రేట్లు అమలులోకి వచ్చినట్లు బ్యాంక్ తెలిపింది.

రూ.40,000 కోట్లకు నెలవారీ సిప్!

- వచ్చే 18-24 నెలల్లో చేరుకోవచ్చు..
- యూనియన్ ఏఎంసీ సీఈఓ మధు నాయర్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే 18-24 నెలల్లో దేశీయ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి వచ్చే నెలవారీ క్రమానుగత పెట్టుబడులు (సిప్) రూ.40,000 కోట్ల స్థాయికి పెరగవచ్చని యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) సీఈఓ మధు నాయర్ అంచనా వేశారు. భారతీయ కుటుంబాల ఆదాయంతో పాటు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులపై అవగాహన కూడా పెరుగుతుండటం ఇందుకు దోహదపడనుందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్చిలో ఫండ్ పథకాల్లోకి 'సిప్'లు రూ.25,925 కోట్లుగా నమోదయ్యాయి. అయితే, స్టాక్ మార్కెట్లో తీవ్ర ఒడుదుడుకుల కారణంగా గత నాలుగు నెలలుగా క్రమానుగత పెట్టుబడులు తగ్గుతూ వచ్చాయి. అయితే, ఇది తాత్కాలిక పరిణామమేనని.. సిప్‌లు మళ్లీ పుంజుకోనున్నాయని ఫండ్ మార్కెట్ వర్గాలు అంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నెలవారీ సిప్ సగటు రూ.24,113 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇది రూ.16,602 కోట్లుగా నమోదైంది.

బిజినెస్

రూ.11.30 లక్షల కోట్లు పోయే..

- ట్రంప్ సుంకాలు ప్రకటించినప్పటి నుంచి మదుపరులు కోల్పోయిన సంపద ఇది..

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు బీఎస్ఈ సెన్సెక్స్ 1,460.18 పాయింట్లు (1.90 శాతం) క్షీణించింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11.30 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి ప్రస్తుతం రూ.401.67 లక్షల కోట్లకు పడిపోయింది. ఈ నెల 2న ట్రంప్ భారత్ సహా 60కి పైగా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించారు. ఈ నెల 9 నుంచి అమలులోకి రావాల్సిన సుంకాలను మళ్లీ 90 రోజుల పాటు వాయిదా వేశారు. చైనాపైన మాత్రం సుంకాలను 145 శాతానికి పెంచి మరీ అమలు చేశారు. అందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికాపై సుంకాలను 125 శాతానికి పెంచింది.

'కొలువుల కోత' నిజం కాదు

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్



ముంబై: తమ కంపెనీలో ఉద్యోగుల తీసివేతలు జరగబోతున్నాయన్న వార్తలను ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తోసిపుచ్చింది. ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని కంపెనీ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. వ్యయాల తగ్గింపులో భాగంగా ఉద్యోగుల జీతాల ఖర్చులు 25 శాతం తగ్గించుకునేందుకు కంపెనీ సిద్ధమైనట్టు అభిజ్ఞ వర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఇందులో భాగంగా కొన్ని విభాగాల్లో వార్షిక జీతం రూ.కోటి మించిన 50-55 సంవత్సరాల మధ్య వయసు ఉన్న సీనియర్ ఉద్యోగులను రాజీనామా చేయమని కోరినట్టు పేర్కొంది. దీంతో డాక్టర్ రెడ్డీస్‌కు ఏటా రూ.1,200 కోట్ల నుంచి రూ.1,300 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని ఆ పత్రిక పేర్కొంది. అయితే ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని కంపెనీ స్పష్టం చేయడంతో ఈ పుకార్లకు తెరపడింది. కంపెనీ ఉద్యోగులూ ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది మార్చి నాటికి ప్రపంచవ్యాప్తంగా కంపెనీలో 26,343 మంది పనిచేస్తుంటే, వారిలో 21,757 మంది పర్మినెంట్ ఉద్యోగులు. కాగా ఉద్యోగుల జీతభత్యాల కోసం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.5,030 కోట్లు ఖర్చు చేసింది.

40 వేల టన్నుల రొయ్యల ఎగుమతులకు సన్నాహాలు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేసిన నేపథ్యంలో దేశానికి చెందిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులు 35 వేల నుంచి 40 వేల టన్నుల రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల ప్రభావంతో కొద్ది కాలం క్రితం నిలిపివేసిన రొయ్యల ప్రాసెసింగ్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్టు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం సెక్రటరీ జనరల్ కేఎన్ రాఘవన్ తెలిపారు. ట్రంప్ తాజా నిర్ణయం ఫలితంగా గతంలో నిలిపివేసిన రెండు వేల కంటైనర్లను ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం భారత రొయ్యలపై అమెరికా 17.7% సుంకాలు విధిస్తోంది. 5.7% కౌంటర్ వీలింగ్ సుంకం, 1.8% యాంటీ డంపింగ్ సుంకం కూడా అందులో భాగంగా ఉన్నాయి. భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా నుంచి ఆర్డర్లు ఏ మాత్రం తగ్గలేదని ఆ సంస్థ చెబుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 270 కోట్ల డాలర్ల విలువ గల రొయ్యలను ఎగుమతి చేసింది.

ఐటీ షేర్లకు దూరంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. డొనాల్డ్ ట్రంప్ చైనా మినహా మిగిలిన దేశాలపై సుంకాలను 90 రోజులకు వాయిదా వేయటంతో ఆర్థిక మాంద్య భయాలను పోగొట్టింది. అయితే చైనాపై సరఫరాలు ఆధారపడటం గమనించదగిన అంశం. ఈ వాణిజ్య యుద్ధంతో భారత్‌కు మేలు జరిగే అవకాశం ఉండటంతో కొన్ని రంగాల షేర్లలో మూమెంటమ్ పెరగొచ్చు. ట్రంప్ వ్యాఖ్యలు, జియో పొలిటికల్ సమీకరణాలను బట్టి మార్కెట్ గమనం ఉంటుంది. గతవారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, పీఎస్ఈయూ, చమురు కంపెనీల షేర్లు పెరిగాయి. ఈ వారం ఐటీ షేర్లకు దూరంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

పవర్‌గ్రిడ్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం మూమెంటమ్ అందుకుంది. కీలకమైన రూ.250 స్థాయిలో మద్దతు తీసుకుని టర్న్ అరౌండ్ అయ్యాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.304 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.322/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.292 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

గుజరాత్ గ్యాస్ లిమిటెడ్: గత ఏడాది ఆరంభం నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి బేస్ ఏర్పడుతోంది. రూ.380 స్థాయిలో స్థిరంగా కొనసాగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.428 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.410/420 శ్రేణిలో ప్రవేశించి రూ.490 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.400 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

పతంజలి ఫుడ్స్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. కొన్ని నెలలుగా రూ.1,800 స్థాయిలో డార్వాస్ బాక్స్ ప్యాటర్న్‌లో చలిస్తోంది. గత శుక్రవారం రూ.1,886 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,850 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,810 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: కొన్ని నెలలుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం గరిష్ఠ స్థాయి వద్ద రేంజ్‌బౌండ్‌లో కదలాడుతోంది. షార్ట్‌టర్మ్ మూమెంటమ్ బాగుంది. సగటు వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.605 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.585 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటాన్ని బట్టి చూస్తే పతనం ఆగే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.530/540 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.610 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.520 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	130
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	93
కర్నూలు	125	నెల్లూరు	98
విశాఖపట్నం	124	అనంతపురం	98
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	420
వరంగల్	402	గోదావరి	405
చిత్తూరు	460	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,510 ▼	87,550 ▼	1,09,900 ▼
విజయవాడ	97,000 ▼	91,000 ▼	98,000 ▼
విశాఖపట్నం	94,010 ▲	86,180 ▲	94,650 ▲
రాజమండ్రి	95,510 ▼	87,550 ▼	97,600 ▲
ప్రొద్దుటూరు	93,200 ▲	85,740 ▲	97,500 ▲
ముంబై	93,353 ▲	85,511 ▲	92,929 ▲

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 15-4-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బెల్జియంలో మెహుల్ ఛోక్సీ అరెస్టు

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.14 వేల కోట్ల మేర కుచ్చుటోపీ
నీరవ్ మోదీ సహా ఛోక్సీపై కేసు.. 2018లో విదేశాలకు పరారీ
లండన్ జైలులో నీరవ్ మోదీ.. ఏడాదిగా బెల్జియంలోనే ఛోక్సీ
బ్లడ్ క్యాన్సర్‌కు చికిత్స!.. ఏడాది క్రితమే బెల్జియం పోలీసులకు భారత దర్యాప్తు సంస్థల సమాచారం
స్విట్జర్లాండ్‌కు పారిపోయే క్రమంలో అరెస్టు 9
ఛోక్సీని వెనక్కి రప్పిస్తాం.. కేంద్రం స్పష్టీకరణ



మైనింగ్ డాన్!

మొన్నటిదాకా చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ ఓనర్

నేడు గనుల శాఖలో రాజాధిరాజులా అజయ్

కన్ను పడిందంటే ఏదొక కంపెనీకి మూడినట్టే
ముందు విజిలెన్స్ దాడులు.. ఆపై సెటిల్‌మెంట్లు
కంపెనీలో వాటా.. లాభాల్లో వాటా.. మొత్తంగానే హస్తగతం.. వీటిలో ఏది కోరితే అది చేయాల్సిందే!
లేదంటే కంపెనీ మూసుకోవాల్సిందే
ఉత్తరాంధ్రలో పెద్దల పేరుతోనే నయా దందా
విషయం తెలిసి ముఖ్యమంత్రి సీరియస్
అయినా అదే దూకుడు.. వేరే దారిలో డీలింగ్స్


రేపు 64 కంపెనీలపై విజిలెన్స్ రివిజన్ కేసుల విచారణ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అజయ్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీని నడిపేవారు. ఉద్యోగాల పేరిట యువతకు ఎరవేసిన కేసుల్లో ఆయన నిందితుడు. ఎట్టకేలకు ఆ కేసుల్లో రాజీలు చేసుకుని, సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు మకాం మార్చారు. ఇక్కడకు రాగానే ఆయనను గనులు ఆకర్షించాయి. ప్రభుత్వంలోని పెద్ద మనుషుల పేరును దీనికోసం వాడుకోవడం మొదలుపెట్టారు. గనులశాఖలో కీలక, ముఖ్య వ్యక్తుల సహకారం, ప్రోద్బలంతో ఒక వెలుగు వెలిగిపోతున్నారు. గత ప్రభుత్వంలో భారీ పెనాల్టీకి గురయిన గ్రానైట్ కంపెనీ విషయంలో

మిగతా 12వ పేజీలో...

ఆయన ఓ మైనింగ్ డాన్! ఆయన కన్ను ఏ మైనింగ్‌లీజు, పరిశ్రమపై పడినా యజమానికి మూడినట్టే! మొదట గనులశాఖలో అత్యంత కీలకమైన ఓ వ్యక్తి సంబంధిత కంపెనీ ఎండీకి ఫోన్ చేస్తారు. ఆ వెంటనే మరో అధికారి ఫోన్ చేస్తారు. "సారుకు సంబంధిత మైనింగ్ లీజు, పరిశ్రమ కావాలి. మీరు అప్పగించండి. రివిజన్ కేసు మీకు అనుకూలంగా సెటిల్ అవుద్ది" అనేది ఈ ఫోన్ల సారాంశం. మాట విని మైనింగ్ డాన్ చెప్పినట్టు చేస్తే సరి. కంపెనీలో వాటా లేక లాభాల్లో వాటా లేదంటే మొత్తంగానే కంపెనీని అప్పగించేయడం.. ఇందులో డాన్ ఏది కోరితే అది చేయాల్సిందే!. లేదంటే విజిలెన్స్ దాడులు జరిగిపోతాయి. రూ.10కోట్ల నుంచి 100 కోట్ల మేర పెనాల్టీ వేస్తారు. అంతే....కంపెనీ మూత పడాల్సిందే!



ఓఎస్డీల ఓవరాక్షన్!

పదిమంది మంత్రుల ఓఎస్డీలపై సీఎంకు ఫిర్యాదుల వెల్లువ
బరి తెగించి దండుకుంటున్నారు.. మంత్రులకూ వారిపై అదుపు లేదు.. ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదికలు
పార్టీ నాయకుల నుంచీ ఉప్పు.. కొనసాగిస్తే చెడ్డపేరు తెస్తారని సీఎంకు మొర.. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం 10



తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లు పర్యటనలో ఓ బైక్ రిపేరు దుకాణానికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. మెకానిక్ ప్రవీణ్ దీనస్థితిని గమనించి చలించిపోయారు. అతని వద్ద ఉన్న పనిముట్లను పరిశీలించి.. విరిగిన రెంచీలు, ఇతర పనిముట్లు చూసి విస్తుపోయారు. ప్రవీణ్‌కు నైపుణ్య శిక్షణ ఇప్పించి, అధునాతన పనిముట్లతో గ్యారేజీ ఏర్పాటు చేయించాలని కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు.

కొత్త పనిముట్లు.. గ్యారేజీ

మళ్లీ అంబేడ్కర్ విదేశీ విద్య

ఎస్సీల పిల్లలకు అత్యున్నత విద్యే లక్ష్యం
పేదరికం లేని సమాజాన్ని నిర్మిస్తాం
రాజకీయమంటే మభ్యపెట్టడంకాదు..
దారి చూపడమని పది నెలల్లో చూపాం
ఒక్క కుటుంబాన్నైనా నాడు బాగు చేశారా?
ఇంకా కుటుంబాలను నాశనం చేశారు
వైసీపీ నాయకులపై చంద్రబాబు ధ్వజం
పొన్నెకల్లులో 369 కుటుంబాల దత్తత

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): "మీ జీవితంలో కనీసం ఒక్క కుటుంబాన్నైనా బాగుచేశారా? ఇంకా చెప్పాలంటే కుటుంబాలను నాశనం చేశారు. అలాంటి మీరా రాజకీయాల గురించి మాట్లాడేది?" అంటూ వైసీపీ నేతలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ప్రబోధించిన 'పే బ్యాక్ టూ ద సొసైటీ' స్ఫూర్తితోనే పీ4 కార్యక్రమం రాష్ట్రంలో ప్రారంభించామని తెలిపారు. ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో చదవాలన్న కలను మళ్లీ నిజం చేస్తామని, అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెనను తిరిగి ప్రారంభిస్తున్నామని

మిగతా 11వ పేజీలో...

మంత్రులూ.. కాస్త పట్టించుకోండి

అతీగతీ లేని 'ఉపాధి' పనుల బకాయిలు
2014-19లో పనులు చేస్తే నేటికీ పెండింగ్
టీడీపీ మద్దతుదారులని చెల్లించని గత సర్కారు
సుమారు రూ.1000 కోట్ల బకాయిలు
కూటమి వచ్చాక సీఎం చంద్రబాబు ఆదేశించినా
చెల్లింపులపై దృష్టి పెట్టని ఇన్‌చార్జి మంత్రులు
ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా తీరని కష్టాలు
ఎన్టీఆర్ హౌసింగ్ బకాయిలు మరో 960 కోట్లు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2014-19 మధ్య టీడీపీ హయాంలో అప్పటి సర్పంచులు, టీడీపీ మద్దతుదారులు చాలా చోట్ల అప్పులు చేసి ఉపాధి హామీ పనులు చేశారు. బిల్లుల బకాయిలు సుమారు రూ.1000 కోట్ల వరకు ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక.. టీడీపీకి చెందిన వారనే సాకుతో బిల్లులు నిలిపివేశారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలను రూ.2 వడ్డీతో చెల్లిస్తామని

మిగతా 10వ పేజీలో...



మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారి.. విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న రాజ్ కసిరెడ్డి కోసం సిట్ ముమ్మరంగా గాలిస్తోంది. హైదరాబాద్‌లోని ఆయన ఇళ్లు, ఆఫీసుతో పాటు భార్య డైరెక్టర్‌గా ఉన్న ఆస్పత్రి, అత్త ఇల్లు.. మొత్తం 15 చోట్ల సోదాలు చేసింది. మంగళవారం కూడా కొనసాగించనుంది.

కసిరెడ్డి కోసం వేట

లిక్కర్ స్కామ్‌లో 'సిట్' దూకుడు

కింగ్ పిన్ రాజ్ కసిరెడ్డి 'మద్యం సొమ్ము'తో సినిమాలు, ఆస్పత్రుల్లో పెట్టుబడులు

మొత్తం కూపీ లాగుతున్న అధికారులు
హైదరాబాద్‌లోని ఇళ్లు, కార్యాలయంలో సోదాలు
భార్య డైరెక్టర్‌గా ఉన్న ఆస్పత్రి, అత్త ఇంట్లోనూ
బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ.. మొత్తం 15 చోట్ల
3 సార్లు విచారణకు సిట్ పిలుపు.. సహకరించాలన్న కోర్టు
కోర్టు సూచన, సిట్ నోటీసుల్ని లెక్క చేయని జగన్ బంధువు

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఉచ్చు బిగిస్తోంది. ఈ క్రమంలో దూకుడు పెంచిన సిట్.. ఈ స్కామ్‌లో కింగ్ పిన్‌గా భావిస్తున్న జగన్ బంధువు.. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి) కోసం విస్తృతంగా గాలిస్తోంది. ఈ కేసులో తవ్వేకొద్దీ సంచలన విషయాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో కోట్లాది రూపాయలు వసూలు చేసిన రాజ్ కసిరెడ్డి ఆ సొమ్మును సినిమాలు, ఆస్పత్రుల్లో పెట్టుబడులుగా పెట్టినట్టు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిర్ధారించారు. ఆయన అక్రమాలపై సిట్ అధికారులు మరింతగా కూపీ లాగుతున్నారు. లిక్కర్ స్కామ్

మిగతా 12వ పేజీలో...



కొద్దిరోజుల క్రితం గర్భిణిగా ఉన్న అనూషతో జ్ఞానేశ్వర్(ఫైల్)

భార్యనూ.. కడుపులోని బిడ్డనూ చిదిమేశాడు!

మరికొద్ది గంటల్లో ప్రసవం కానున్న భార్య
గొంతుకు చున్నీ బిగించి చంపిన ఉన్మాది 12
రెండేళ్ల క్రితం ప్రేమ పెళ్లి.. విశాఖలో రహస్య కాపురం
బిడ్డను కంటే ఇంట్లోవాళ్లకు తెలిసిపోతుందనే ఘాతుకం

గుజరాత్ తీరంలో రూ.1,800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం 9

'ఆటో' సుంకాల తాత్కాలిక నిలిపివేత!

సంకేతాలిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
తమ కార్ల కంపెనీలకు ఊరటనిచ్చేందుకే..
చైనా ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఫోన్లపై 20% సుంకాలు కొనసాగుతాయని స్పష్టీకరణ

అమెరికాకు చైనా భారీ ఝలక్

అరుదైన లోహాల ఎగుమతులు నిలిపివేత
డ్రాగన్ పోర్టుల్లోనే ఆగిపోయిన స్టాక్



కొత్త జంటలకు వీసా.. అగ్ని పరీక్ష!

అమెరికా వెళ్లడం ఈజీ కాదు
అమెరికన్‌ను పెళ్లాడినా అక్కడికెళ్లడం కష్టమే!
ముగిసిన 'బైడెన్' వెసులుబాట్లు
ట్రంప్ నేతృత్వంలో వీసాలకు కఠిన టెస్ట్.. నిశిత పరిశీలన

ట్రంప్‌ను హత్య చేస్తా.. డబ్బులివ్వండి

అమెరికాలో తల్లిదండ్రులను అడిగిన 17 ఏళ్ల బాలుడు
ఇవ్వకపోవడంతో వారి హత్య

వాషింగ్టన్, ఏప్రిల్ 14: తాను విధించిన ప్రతీకార సుంకాల నుంచి ఆటోమొబైల్ రంగాన్ని తాత్కాలికంగా మినహాయించే ఆలోచనలో ఉన్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. కార్ల తయారీ కంపెనీలు తమ సప్లై చైన్లను సరిచేసుకోవడానికి కావలసిన సమయం ఇచ్చేందుకే ఈ దిశగా ఆలోచిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. "కెనడా, మెక్సికో, ఇతర దేశాల నుంచి తమ ఉత్పత్తిని (అమెరికాకు) తరలించడానికి వారికి కొంత సమయం కావాలి. వారు వాటిని ఇక్కడే తయారుచేయబోతున్నారు" అని ట్రంప్ సోమవారం వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాకు దిగుమతి చేసుకునే విదేశీ కార్లు, ఆటో విడిభాగాలపై 25 శాతం

మిగతా 9వ పేజీలో...



బగ్ పెట్టి బురిడీ!

బెట్టింగ్ యాప్‌ల తయారీలోనే బగ్ ఏర్పాటు
ఎవరెవరు ఎక్కడున్నారో తెలిసేలా నిఘా
ఎవరు పరిధి దాటినా ప్రధాన బుకీలు అప్రమత్తం
పోలీసులకు చిక్కకపోవడానికి ఇదే కారణమా..?
అనుమానం వ్యక్తంచేస్తున్న దర్యాప్తు బృందాలు
బగ్ పెట్టే అవకాశాలున్నాయంటున్న సైబర్ నిపుణులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఒక సినిమాలో హీరోకి బుల్లెట్ గాయమవుతుంది. అతడికి ఆపరేషన్ చేసే సమయంలో వైద్యుల సాయంతో విలన్.. హీరోకి తెలియకుండా అతడి శరీరంలో ఒక బగ్‌ను అమరుస్తాడు. తర్వాత నుంచి హీరో ఎవరితో మాట్లాడినా.. ఆ సమాచారం మొత్తం విలన్‌కు తెలిసిపోతుంది. అయితే.. ఇదంతా సినిమా..! దేశమంతా ఐపీఎల్ ఫీవర్ కొనసాగుతున్న వేళ ఇప్పుడు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ప్రధాన బుకీలు కూడా ఇలాగే 'బగ్' విధానాన్ని అనుసరిస్తున్నారనే

మిగతా 10వ పేజీలో...

ఐదేళ్లూ అక్రమాలే

తిరుమలను భ్రష్టుపట్టించారు

గోవుల మరణాలను దాచేశారు
జీవాలకు పురుగుల దాణా పెట్టారు
టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారు
విజిలెన్స్ అధికారులను రానివ్వలేదు
నెయ్యి సహా పాలనూ కల్తీ చేసేశారు
సేంద్రియ ఉత్పత్తుల్లో దండుకున్నారు
ఐటీ విభాగాన్ని దళారులకు ఇచ్చేశారు
అర్హతలేని వ్యక్తికి జీఎం పదవి
నాటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి
ప్రస్తుతం గోవుల మరణాలను తగ్గిస్తున్నాం
ఫార్ములా 'హెచ్ఎన్' పౌడర్ వాడుతున్నాం
వాస్తవాలను భూమన వక్రీకరిస్తున్నారు
టీటీడీ ఈవో శ్యామలరావు మండిపాటు



గతంలో లెక్కలో లేకుండా మృతి చెందిన గోవుల ఫొటోను విజిలెన్స్ విచారణ నివేదిక ఆధారంగా చూపుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లూ తిరుమలలో అక్రమాలు, అవినీతే రాజ్యమేలాయని టీటీడీ ఈవో జె.శ్యామలరావు నిప్పులు చెరిగారు. తిరుమలను భ్రష్టుపట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారికి నివేదించే ప్రసాదాల నుంచి భక్తులకు అందించే అన్న ప్రసాదాల వరకూ కల్తీకి పాల్పడ్డారన్నారు. ఇక, గోశాల గురించి ఎంత చెప్పినా తక్కువేనని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలోనే తిరుపతిలోని గోశాలలో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయని

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్తవచనం

మత సామరస్యాన్ని, మైనారిటీ మతస్థుల శ్రేయస్సును కోరుకుంటున్న భారత పౌరులు ఏ ప్రాంతం వారైనా, ఏ మతం వారైనా బెంగాల్ ఘటనలకు వ్యాకులపడుతున్నారు. వక్ఫ్ చట్టంపై నిరసనలు, ఆందోళనలు, ప్రభుత్వ ఆస్తులపై దాడులు, భిన్న సామాజికవర్గాల పరస్పర దాడులతో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా అట్టుడికిపోతోంది. గత మంగళవారం నాడు ప్రారంభమైన ఈ అరాచకకాండ ఇప్పటికీ తగ్గుముఖం పట్టలేదు.

కొత్త వక్ఫ్ చట్టంపై ప్రజల్లో నెలకొన్న గందరగోళమే ఈ అలజడికి దారి తీసిందని చెప్పవచ్చు. చట్టాన్ని తీసుకువచ్చిన జాతీయ పాలక పక్షం వారుగానీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగానీ ప్రజల్లో ఆ చట్టంపై ఒక స్పష్టమైన అవగాహన కల్పించేందుకు శ్రద్ధ చూపక పోగా పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిస్థితులు దిగజారి పోయేందుకు ఆస్కారమేర్పడింది. రాజకీయ అవకాశవాదానికి పాలనా యంత్రాంగ వైఫల్యాలు తోడవడంతో ముర్షిదాబాద్ జిల్లాలోను, బెంగాల్‌లోని ఇతర ప్రాంతాలలోను తీవ్ర అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయి. హిందువులు ముస్లింలు ఇరువర్గాలూ ఈ ఆందోళనలు, హింసాకాండకు బాధితులవుతున్నారు. ఏ ఒక్క మత సమూహాన్ని ఈ చర్యలకు పూర్తి బాధ్యులుగా చేయడం సత్యాన్ని గౌరవించడమవదు.

స్వతంత్ర భారతదేశంలో మున్నెన్నడూ లేని విధంగా ముస్లిం పౌరులు సమస్త విషయాలలోను వివక్షకు గురవుతున్న తరుణంలో ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం–2025ను తీసుకువచ్చింది. పార్లమెంటు ఉభయ సభలలో ఆ బిల్లును హడావుడిగా ఆమోదింపచేసింది. రాజ్యాంగ పరిభాషలో ఉన్న ఈ సవరణ చట్టం వాస్తవంగా ముస్లింలను ఆర్థికంగా దెబ్బతీసే చట్టం; మతపరంగా వారిని అగౌరవపరిచే చట్టం అనడంలో సందేహం లేదు. ముస్లింలను అణచివేసేందుకు ఉద్దేశించిన చట్టం. మత ధర్మం ప్రకారం విశాల సమాజం శ్రేయస్సుకై దానం చేసిన ఆస్తి వక్ఫ్. మరి ఆ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన బోర్డులో ఆ మతానికి చెందినవారే ఉండడం న్యాయం కదా. ఇతర మతస్థులకు అందులో భాగస్వామ్యం కల్పించడంలో ఔచిత్యమేమిటి? ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను కబ్జాదారులకు అప్పగించేందుకు ఈ కొత్త చట్టం దోహదం చేయడం లేదూ? రాజ్యాంగ నైతికత ఏమయినట్టు? మరి మెజారిటీ మతస్థుల ఆస్తుల నిర్వహణకు కూడా ఇటువంటి నిబంధనను నిర్దేశిస్తారా? సమ న్యాయాన్ని పాటించి మత స్వేచ్ఛకు తోడ్పడే చట్టం మాత్రమే భారత రాజ్యాంగ విహితమైనది. ఒక విజ్ఞుడు అన్నట్టు ఈ దేశ చరిత్రలో ముస్లింల స్థానం పాదసూచిక ప్రాయమైనది ఎంత మాత్రం కాదు, మన సమున్నత చరిత్రకు వారు సహ రచయితలు. మరి కొత్తవక్ఫ్ చట్టం వారికి న్యాయం చేస్తుందా? చేయనప్పుడు అది ముస్లింలకు అన్యాయం చేయడమే కాదూ? సహమతస్థులు, తోటి పౌరులకు వాటిల్లిన అన్యాయం విశాల సమాజం శ్రేయస్సునూ దెబ్బ తీయదూ? బహుళ మతాలు వర్ధిల్లుతున్న సమాజంలో ప్రభుత్వాలు చేసే చట్టాలు కేవలం అధిక సంఖ్యాక మతస్థుల అభిప్రాయాలను మాత్రమే ప్రతిబింబించినా లేదా ఇతర మతస్థుల మనోభావాలను మన్నించక, వారి ప్రయోజనాలను దెబ్బతీయడానికి ప్రయత్నించినా ఎవరికీ శ్రేయస్సు నివ్వదు. కొత్త వక్ఫ్ చట్టం ఇటువంటి అవాంఛనీయ పరిస్థితినే కల్పించింది. మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సంవత్సరంలో ఇటువంటి చట్టాన్ని తీసుకురావడమేమిటి? ఒకనాడు కవి తిలక్ బాధాతప్త హృదయంతో ప్రశ్నించినట్టు 'ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి?'

బెంగాల్ అసెంబ్లీకి మరో ఏడాది కాలంలో ఎన్నికలు జరగనుండడంతో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు తాపత్రయపడుతున్న తృణమూల్ కాంగ్రెస్, బెంగాల్‌లో అధికారాన్ని కైవసం చేసుకోవడాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ సంకుచిత రాజకీయాలకు పాల్పడుతున్నాయి. ఎన్నికల తరుణంలో ఈ తరహా ఆరోపణలు సహజమే అయినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వాధినేతగా రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా శాంతిభద్రతలను పరిరక్షించడమనేది ముఖ్యమంత్రి విద్యుక్త ధర్మం. ఈ నైతిక కర్తవ్య పాలనలోనే తనకూ, భారత ప్రజాస్వామ్యానికి శుభం సమకూరుతుందనే సత్యాన్ని మమతా దీదీ మరచిపోకూడదు.

రంగోద్దీపన మాంత్రికుడు

నాటకరంగం, నటన పట్ల అపారమైన అవగాహన, ఆరాధన, నటనలో ప్రతిభ కలిగివుండీ, రంగోద్దీపన (లైటింగ్) రంగంలో రాణించిన అరుదైన కళాకారుడు దూసి శ్రీరామమూర్తి. విశాఖపట్టణంలో ఒకనాటి నాటకరంగ నిపుణులు, ఎందరినో నటులుగా తీర్చిదిద్దిన కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు, కుప్పిలి వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు, వై.ఎస్ రాజు, అడిగర్ల వెంకటరావు, కొండవలస లక్ష్మణరావు వంటి వారితో చాలా నాటక, నాటికలలో నటన, నిర్వహణ, సాంకేతిక సహకారం వంటి బాధ్యతలు నిర్వహించారు. కానీ, అత్యధిక కాలం ఎ.యు థియేటర్ ఆర్ట్ డైరెక్టర్, నటులు, రచయిత, దర్శకులు అయిన డా. అత్తిలి కృష్ణారావుతో దశాబ్దాల పాటు అనుబంధం కొనసాగించారు. ఎ.యు థియేటర్ ఆర్ట్స్‌లో ఒక్క సంవత్సరమే నటనలో డిప్లొమా చేసి మానేశారు. తర్వాత డా. అత్తిలి కృష్ణారావు నాటక సంస్థ 'నాట్యభారతి' (అంగర సూర్యారావు గారు స్థాపకులు) ప్రదర్శించిన 'నిజం', 'తూర్పు రేఖలు', 'పిపీలికం', 'అయోమయో పాఖ్యానం', 'జోగు జాతర, 'సంధ్యా ఛాయ' వంటి నాటకాలకు రంగోద్దీపన చేసి పలువురు నిపుణుల ప్రశంసలందుకున్నారు. 'తూర్పురేఖలు', 'పిపీలికం' వంటివి సౌత్ జోన్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు.



సాధారణంగా వృత్తి సాంకేతిక నిపుణులే నిర్వహించే క్లిష్టమైన రంగోద్దీపన బాధ్యతలను ఔత్సాహిక సాంకేతిక నిపుణుడు నిర్వహించడం కత్తిమీద సామే. నాటకరంగంలో మంచి అభినివేశం ఉన్న దూసి శ్రీరామమూర్తిలో మంచి కవి, రచయిత కూడా ఉన్నారు. ఎన్నో పదునైన కవితలు రచించిన ఆయన, పలు కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. దాదాపు నలభై కథలు రచించారు.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో నిర్వహించిన, శిక్షణా శిబిరాల్లో రంగోద్దీపనకు సంబంధించి శిక్షణ పొందారు. తమిళనాడుకు చెందిన వి.రామమూర్తి, డోల్ గోవింద్ రథో (భువనేశ్వర్ యూనివర్సిటీ రంగోద్దీపన శాఖ ఆచార్యులు) శిక్షణ ఆయనకెంతో అవగాహన పెంచింది. నాటక, సినీ నటులు స్వర్గీయ కొండవలస లక్ష్మణరావు నాటక సంస్థ 'యువ కళానికేతన్'కు అనేక సంవత్సరాలు నేతృత్వం వహించారు. అనేక ఉత్తమ ప్రదర్శనలిచ్చేందుకు దోహదపడిన కార్యశీలి శ్రీరామమూర్తి.

డా. చాట్ల శ్రీరాములు వంటి నాటక రంగ నిష్ణాతులు, తనను, 'దీపశిల్పి దూసి పంతులు గారు' అని ప్రశంసించడం, తనకొక గొప్ప పురస్కారంగా భావిస్తాను అంటారు శ్రీరామమూర్తి. భళ్ళమూడి రామమూర్తి దర్శకత్వంలో గురజాడ కళామందిరం, విశాఖలో నలభై రోజుల పాటు ప్రదర్శించిన భక్తిరస ప్రధానమైన 'మణికంఠ విలాసం' (రంగాభట్ల గున్నేశ్వరశర్మ రచన) నాటకానికి రంగోద్దీపన సహకారమందించారు.

1967లో నిర్మించిన 'ఇల్లాలు' చలనచిత్రంలో హీరోగా నటించిన కె.వి. నాగేశ్వరరావు (ఖరగ్‌పూర్) ఆ తర్వాత విశాఖ వచ్చేశారు. యువ కళానికేతన్ సంస్థ ద్వారా 'ప్రభంజనం' నాటకం ప్రదర్శించి పదివేల రూపాయలు సేకరించి నాగేశ్వరరావు కిచ్చి మళ్ళీ మద్రాసు పంపించారు. 'చిట్టి తమ్ముడు' చిత్రంలో నటించిన కె.వి, మళ్ళీ అవకాశాలు రాక విశాఖ వచ్చి కొన్ని నాటకాలలో నటించారు. నాగేశ్వరరావు నట జీవన స్థితిగతులు చెబుతూ, దూసి శ్రీరామమూర్తి కన్నీటి పర్యంతమయ్యారు.

తన పన్నెండవ ఏట, చింతామణి నాటకంలో 'చిత్ర' పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. 'అనంతం', 'భజంత్రీలు', 'దంత వేదాంతం', 'పులిస్వారీ', త్యాగ భూమి (స్త్రీ పాత్ర) వంటి కొన్ని నాటకాల్లో పాత్రలు ధరించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ) ఆధ్వర్యంలో, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 90 రోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఆ శిబిరంలో శిక్షణ పొందిన నటీనటులతో కలిసి, 'కింగ్ ఇడిపస్', 'ముద్రారాక్షసం' వంటి నాటకాల్లో నటించారు. దాంతోపాటు ఆధునిక రంగోద్దీపన నిర్వహణలో మెళకువలు నేర్చుకున్నారు. 'ఋతురాగం' డ్యాన్స్ బ్యాలేకి, ఎ.యు ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో లైటింగ్ నిర్వహణకు గాను డా. కె.వి.గోపాలస్వామి నుంచి ప్రశంసలందుకున్నారు శ్రీరామమూర్తి.

శ్రీకాకుళం జిల్లాలో వివిధ రంగాల కళాకారులకు జన్మనిచ్చిన 'దూసి' వారి కుటుంబంలో ఏప్రిల్ 15, 1945న జన్మించారు. మేనమామ మండపాక వీరభద్రరావు కుటుంబంతో కలిసి 1955లో విశాఖపట్నం వచ్చేశారు. అక్కడే పాఠశాల, కళాశాల విద్య పూర్తి చేసుకున్నారు. 1967లో విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ఉద్యోగం లభించింది. ఒకనాటి విశాఖలో సాహితీ, నాటక కార్యకలాపాలకు పేరెన్నికగన్న, విశాఖ సాహితి, విశాఖ నాట కళాపరిషత్‌లలో సభ్యునిగా, కార్యవర్గ సభ్యునిగా వ్యవహరించారు.

నాటకరంగంలో మంచి అభినివేశం ఉన్న దూసి శ్రీరామమూర్తిలో మంచి కవి, రచయిత కూడా ఉన్నారు. ఎన్నో పదునైన కవితలు రచించిన ఆయన, పలు కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. దాదాపు నలభై కథలు రచించారు. పలు పోటీలలో తన కథలకు బహుమతులు గెల్చుకున్నారు.

నాటకరంగంలో లైటింగ్ నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి, తన వంతు సహకారమందించినా, ఎక్కువగా నటించకపోవడం కొంచెం అసంతృప్తిని మిగిల్చిందంటారు ఆయన. ఎంత గొప్ప సాంకేతిక నిపుణుడయినా, రంగస్థలం పైన తన ప్రతిభ ప్రదర్శించే నటీనటులకున్న గుర్తింపు ఎక్కువ.

సాధారణంగా వృత్తి సాంకేతిక నిపుణులే నిర్వహించే క్లిష్టమైన రంగోద్దీపన బాధ్యతలు ఔత్సాహిక సాంకేతిక నిపుణుడు నిర్వహించడం కత్తిమీద సామే. అనేక ప్రదర్శనలు రక్తి కట్టడానికి రంగోద్దీపన వెన్నెముక అనడం అతిశయోక్తి కాదు. అలాంటి వందలాది ప్రదర్శనలకు నాటకారాధనతో సేవలందించిన దూసి శ్రీరామమూర్తి లాంటివారు తెలుగు రాష్ట్రాలలోనే అరుదు. నాటక యజ్ఞంలో తన బాధ్యతలు నిర్వహించి, గత మధురానుభూతులతో ఎనభై వసంతాలు పూర్తి చేసుకున్న ధన్యజీవి.

○ బి.వి. అప్పారావు

పాలకులు–మావోయిస్టులు, మధ్య రాజ్యాంగం!

రెండు దేశాలు ఆయుధాలతో తలపడితే యుద్ధం. ప్రభుత్వం తన ప్రజల మీద ఆయుధాలతో తలపడితే అంతర్యుద్ధం. ఛత్తీస్‌గఢ్, దంతేవాడలో ఇప్పుడు ఒక భీకర అంతర్యుద్ధం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం భారీగా సైన్యాన్ని దింపి అక్కడ మావోయిస్టుల అణచివేత కార్యక్రమాన్ని చేపట్టింది. యుద్ధానికయినా అంతర్యుద్ధానికయినా లక్ష్యం మార్కెట్టే అని తెలిసినపుడు ఈ నక్సల్స్ ఏరివేత కార్యక్రమం ఎవరికోసమో ఊహించడం ఎవరికీ పెద్ద కష్టం ఏమీ కాదు.

రక్షణ వ్యవహారాలను బహిరంగపరచరు కాబట్టి, ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఎంత సైన్యాన్ని దించిందో, ఎన్నిరకాల ఆధునిక ఆయుధాలను వినియోగిస్తున్నదో ఆ వివరాలు అందుబాటులో లేవు. దాదాపు లక్షమంది పారామిలటరీ దళాలను బస్తర్‌లో దించారని ఒక అంచనా. దీని కోసం కేటాయించిన బడ్జెట్ విషయంలోనూ నమ్మశక్యంకాని అంకెలు వినిపిస్తున్నాయి.

కొన్నేళ్ళుగా సాగుతున్న ఈ అంతర్యుద్ధంలో ప్రస్తుతం కేంద్ర బలగాలదే పైచేయిగా ఉందని చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ ఉత్సాహంతోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చే చైత్ర నవరాత్రి (మార్చి 2026) నాటికి 'నక్సల్ ముక్త్ భారత్'ను సాకారం చేస్తాం అంటున్నారు. బస్తర్‌లో పారా మిలిటరీ దళాల దూకుడును చూస్తుంటే వచ్చే మార్చికన్నా ముందే వాళ్ళు ఆ లక్ష్యాన్ని సాధించనూ వచ్చు.

పీడన, అణచివేత కొనసాగుతున్నపుడు తిరుగుబాటు తప్పక వస్తుంది. ఏ సమాజానికైనా ఇది సహజ సూత్రం. కేంద్ర హోం మంత్రి ఆశిస్తున్నట్టు 'నక్సల్ ముక్త్ భారత్' ఏర్పడకపోయినా ఇప్పటికైతే 'నక్సల్ ముక్త్ బస్తర్' ఏర్పడవచ్చు. బస్తర్‌లో ఇంకో విచిత్రం జరుగుతోంది. అటు మావోయిస్టుల పైచేయి అయిన రోజైనా, ఇటు కేంద్ర సాయుధ బలగాల పైచేయి అయిన రోజైనా – ఇరువైపులా – చనిపోతున్నది ఆదివాసులే.

ఇదేమీ కొత్త కాదు. వందేళ్ళ క్రితం మన్యంలో సాగిన తిరుగుబాటును అణచివేయడానికి నాటి బ్రిటీష్ మిలటరీ అధికారి థామస్ జార్జ్ రూథర్ ఫోర్డ్ ఈ విధమైన వ్యూహాన్నే రచించాడు. ఇరువైపుల ఆదివాసులే చనిపోతుండడాన్ని చూసి తట్టుకోలేకే అల్లూరి శ్రీరామరాజు పోరాటాన్ని విరమించాలనే నిర్ణయం తీసుకున్నాడు.

ఆధునిక యంత్రీకరణ ప్రకృతిని ధ్వంసం చేస్తుంది. దాన్ని ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వాళ్ల పోరాటాల్లో 'జల్ జంగల్ జమీన్' అనేది ప్రాణప్రదమైన నినాదం. ప్రకృతిని విధ్వంసం చేయడాన్ని ఒకప్పుడు పాపకార్యంగా భావించేవారు ఇప్పుడది 'అభివృద్ధి' అని పేరు మార్చుకుని గొప్ప పుణ్యకార్యంగా చెలామణి అవుతోంది.

మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు, దాని ఆచరణల మీద నమ్మకం, అభిమానం లేనివాళ్లు సహితం ఇప్పుడు ఆదివాసుల గురించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అనేక పౌర సంఘాలు శాంతిచర్చలు నిర్వహించమని ఇటు మావోయిస్టుల్ని అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాయి. ఈ ప్రతిపాదనలకు మావోయిస్టు పార్టీ సానుకూలంగా స్పందించింది.



ఇప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీకి బౌద్ధిక సరోవరం ఆరెస్సెస్. అది మొదటి నుంచీ రాజ్యాంగాన్ని స్వదేశీ విలువలు, సాంప్రదాయాలకు వ్యతిరేకమైన విదేశీ భావన అంటూంది. మరోవైపు, మావోయిస్టులు సహితం రాజ్యాంగం పెట్టుబడీదారీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు పుట్టింది అని విమర్శిస్తుంటారు. చెరోవైపు నుంచీ చెరో విధంగా రాజ్యాంగాన్ని వ్యతిరేకించే శక్తులు రాజ్యాంగం ప్రాతిపదికగా శాంతి చర్చలు ఎలా సాగిస్తాయో చూడాలి.

ఇప్పుడు ప్రభుత్వం వంతు.

శాంతి చర్చల విషయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఊగిసలాటలో వుంది. దానికి ఒకవైపు, శాంతి చర్చలు జరిపి మావోయిస్టుల పీడ వదిలించుకోవాలనీ వుంది. మరోవైపు, ప్రస్తుతం వెనుకంజలో ఉన్న మావోయిస్టులు శాంతి చర్చల నెపంతో లభించే వెసులుబాటుతో మళ్ళీ పుంజుకుంటారనే భయాందోళనా వుంది.

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరుపుతుందా లేదా? అన్నది ఒక అంశం. అయితే, దానికి రాజ్యాంగం ప్రాతిపదికగా వుంటుందా లేదా? అన్నది మరో ఆసక్తికర పార్శ్వం.

ఇప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీకి బౌద్ధిక సరోవరం ఆరెస్సెస్. అది మొదటి నుంచీ రాజ్యాంగాన్ని స్వదేశీ విలువలు, సాంప్రదాయాలకు వ్యతిరేకమైన విదేశీ భావన అంటూంది. మరోవైపు, మావోయిస్టులు సహితం రాజ్యాంగం పెట్టుబడీదారీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు పుట్టింది అని విమర్శిస్తుంటారు. చెరో వైపు నుంచీ చెరో విధంగా రాజ్యాంగాన్ని వ్యతిరేకించే శక్తులు రాజ్యాంగం ప్రాతిపదికగా శాంతి చర్చలు ఎలా సాగిస్తాయో చూడాలి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టు పార్టీ కూడా ఇప్పుడు రాజ్యాంగం మీద నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నాయి. మావోయిస్టులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి అని ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ అంటున్నారు. ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది అని మావోయిస్టులు ఆరోపిస్తున్నారు. శాంతి చర్చలకు సుముఖత వ్యక్తం చేస్తూ మావోయిస్టులు ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగ విలువల ప్రస్తావన వుండడం ఒక విశేషం అనొచ్చు.

'కాల్పుల విరమణ' అనే గంభీరపు మాటల్ని పక్కన పెట్టి మావోయిస్టులే ఒక శాంతి కమిటీనో, ఒక రాయబారినో ప్రభుత్వం దగ్గరికి పంపించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అంటున్నది. అమిత్ షా అయితే, మావోయిస్టులు ఆయుధాలను దించే పక్షంలో వాళ్ళ కోసం ఒక ఆకర్షణీయమైన ప్యాకేజీని అందజేస్తామంటున్నారు. బస్తర్‌లో విద్యా వైద్య సదుపాయాలు, రోడ్లు, కరెంటు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించడమేగాక, ప్రతి కుటుంబానికి 60 కేజీల బియ్యం, కొంత నగదు, ఒక్కో గ్రామానికి కోటి రూపాయల మంజూరుతో పాటు ప్రముఖ మావోయిస్టుల తలల మీదున్న రివార్డుల్ని కూడా వారికే ఇస్తామంటున్నారు. ఇటీవల బస్తర్ పాండుం ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అమిత్ షా మావోయిస్టుల్ని 'సోదరులు' అని సంబోధించడం విశేషం. "మీ మరణం మాకేమీ ఆనందాన్ని ఇవ్వదు. ఆయుధాలు వదిలిపెట్టి దేశ అభివృద్ధికి తోడ్పడండి" అని ఆయన పిలుపిచ్చారు.

బస్తర్‌లోనికి మావోయిస్టులు ప్రవేశించిన తరువాత అక్కడ ఒకరకం సమసమాజం ఏర్పడిందనే ప్రచారం ఒకటి జరుగుతోంది. ఇదొక తప్పుడు అవగాహన. ఆదివాసీ సమూహాల్లో అనాదిగానే ఒకరకం కమ్యూనిస్టు సమాజం వుంటుంది. అంతేకాక, మాతృస్వామిక సమాజ లక్షణాలు కూడా వాళ్ళలో వుంటాయి. అక్కడికి బయటి సమాజం ప్రవేశించినపుడే కాలుష్యం మొదలవుతుంది.

ఈ సందర్భంగా, ఒక సైద్ధాంతిక సందేహం కూడా ముందుకు వస్తోంది. సీపీఐ– మావోయిస్టులు ప్రకటిత కార్యక్రమానికీ బస్తర్‌లో వాళ్ళు సాగిస్తున్న కార్యకలాపాలకూ పొంతన వుందా? బయటి ప్రపంచానికి తెలిసినంత వరకు, వ్యవసాయ విప్లవం – నూతన ప్రజాస్వామిక విప్లవం – అంతిమంగా సామ్యవాద సమాజ నిర్మాణం అనే మూడంచెల కార్యక్రమం మావోయిస్టులకు వుంది. ఇందులో మొదటిదైన వ్యవసాయ విప్లవానికి 'దున్నేవానిదే భూమి' అనేది ప్రధాన నినాదం. దానికి అద్భుతంగా అనువైన ప్రాంతం గోదావరి, కృష్ణా మండలాలు. అక్కడి నాలుగు జిల్లాల్లో 95శాతం కమతాల్ని కౌలు రైతులే దున్నుతారు. డెల్టా ప్రాంతంలో వ్యవసాయిక విప్లవానికి అంతటి అనువైన అవకాశాల్ని వదులుకుని అడవులకు వెళ్ళడం అంటే వాళ్ళు తమ ప్రకటిత కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వుండాలి.

మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో ఫాసిజం ప్రస్తావన వుంది. దానికి ప్రధాన బాధితులు ఆదివాసులు, మత మైనారిటీలు అనే అర్థం వచ్చే వాక్యాలూ వున్నాయి. కార్పొరేట్ మతతత్వ నియంతృత్వానికి బాధితులయిన ఆదివాసులు, మత మైనారిటీలు, తదితర పీడిత సమూహాల విముక్తి కోసం ఒక కొత్త విప్లవ కార్యక్రమాన్ని రూపొందించుకున్నట్టు వాళ్లు ప్రకటించవచ్చు. వాళ్లు ఆ పనీ చేయలేదు. ఈ సైద్ధాంతిక గందరగోళం నుండి బయటపడనంత వరకు మావోయిస్టుల మీద బస్తర్ బయటవున్న సామాన్య ప్రజలకు ఒక స్పష్టత రాదు.

1970లలో నక్సలైట్ల కేసులు విచారణకు వచ్చినపుడు ఒక వాదన బలంగా వినిపించేది. ఆయుధాలతో మాత్రమే ప్రజావ్యతిరేక వ్యవస్థను నిర్మూలించగలమనేది నక్సలైట్ల ప్రధాన సిద్ధాంతం. ప్రభుత్వం కత వేరు. రాజ్యాంగాన్ని అమలు చేస్తామని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారాన్ని చేపడుతాయి కనుక ప్రభుత్వాలు రాజ్యాంగానికే కట్టుబడి వుండి తీరాలి అనే భావన అప్పట్లో బలంగా వుండేది. ఆయుధాన్ని చేపట్టి నేరానికి పాల్పడిన వారిని మాత్రమే శిక్షించాలనీ, పీడక సమాజాన్ని ఆయుధాలతో కూల్చక తప్పదనే భావాలను శిక్షించరాదనీ అప్పట్లో న్యాయమూర్తులు సహితం బలంగా నమ్మేవారు. ఇప్పుడు ఆ భావన బలహీనపడింది. సమాజాన్ని మార్చడానికి హింస తప్పదని భావించేవారిని సహితం హింసతోనే అణచివేయాలనే భావన బలపడుతోంది.

'దేశ శత్రువులు సరిహద్దుకు ఆవల మాత్రమే వుండరు; దేశం లోపల కూడా ఉంటారు. ఆయుధాల్లోనే గాక ఆలోచనల్లోనూ దేశానికి ప్రమాదం పొంచివుంది' అనే ఒక కొత్త సిద్ధాంతాన్ని రక్షణ వ్యవహారాల సలహాదారు అజిత్ దొవ్వాల్ ముందుకు నెడుతున్నారు. దీనికి వారు పెట్టిన ముద్దు పేరు 'అర్బన్ నక్సల్స్'. ఆయుధాలను చేపట్టిన వారినేగాక, అలాంటి ఆలోచనలు కలిగిన వారిని సహితం శిక్షించాలనేది కొత్త సిద్ధాంతం. భావాలను సహితం శిక్షించాలనేది దీని సారాంశం. ఆలోచనాపరులు, పౌరసమాజం మీద విరుచుకుపడడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుంటోంది అనడానికి ఇది సంకేతం. ఆలోచనాపరులు, పౌరసమాజం దీన్ని తీవ్రంగా ఖండించాలి. లేకుంటే పూడ్చుకోలేని నష్టం జరిగిపోతుంది.

▪ డానీ
సమాజ విశ్లేషకులు



కన్నీళ్ల బాష్పోత్సేకం

వృక్షాలు విలవిల్లాడుతున్నాయి
పచ్చని ఆకులన్నీ కన్నీళ్లు రాలుస్తున్నాయి
తల్లి వేరు శోకాలు తీస్తున్నది
పర్యావరణం మౌనం దాల్చి నిలుచున్నది

విత్తనం వేసిన చెయ్యి నిలిచిపోయి
మొక్కలు పెంచిన జీవి ఆగిపోయింది
అడవి దుఃఖంతో అతలాకుతలమవుతున్నది
చెట్టు చేమా బాధతో తలవంచింది

కోట్ల మొక్కలకు ప్రాణం పోసిన
దరిపెల్లి రామయ్య తల వాల్చిండని
వనంలోని ఆకులన్నీ కన్నీళ్ల బాష్పోత్సేకం

– అన్నవరం దేవేందర్

దర్శనాల పేరుతో దోపిడీ ఆపాలి

1980 దశకంలో తిరుమలలో ఉచిత దర్శనాలే ఉండేవి. ఇప్పుడు ప్రత్యేక దర్శనాల పేరుతో భక్తులను దోపిడీ చేస్తున్నారు. అసలు దేవుణ్ణి చూడ్డానికి డబ్బులెందుకు? ఈ ప్రత్యేక దర్శనాల కోసం ఇతర రాష్ట్రాల మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా పోటీపడుతున్నారు. వీఐపీ దర్శనాల వల్ల సామాన్యుడు రోజుల కొద్దీ క్యూలలో గడపాల్సి వస్తోంది. 24 గంటలలో దేవుని స్నానానికి, నైవేద్యానికి, ఇతర అవసరాలకు, మరల రాత్రి నిద్రపోయే సమయంలోను దర్శనం ఆపేసి, మిగిలిన సమయాన్నంతా ఉచిత దర్శనాలకు కేటాయించాలి. దేవుని దృష్టిలో అందరూ సమానం అయినపుడు వేర్వేరు దర్శనాలు, వేరువేరు రేట్లు ఎందుకు? అందరికీ ఒకే దర్శనం కల్పించాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య

కూటమి హయాంలో వృద్ధి రేటులో ఎదిగిన ఏపీ

భారతదేశంలో ఏ రాష్ట్రానికీ సాధ్యం కాని వృద్ధిరేటు అతి తక్కువ సమయంలో ఆంధ్రప్రదేశ్‌కే ఏ విధంగా సాధ్యమైంది? కూటమి ప్రభుత్వం ఏర్పడిన సమయంలో నిరాశాజనకంగా ఉన్న వృద్ధిరేటు ఏ విధంగా పురోగమించింది? ప్రతికూల పరిస్థితుల్లోనూ అభివృద్ధి ఏ విధంగా సాధ్యమైంది? ప్రకృతి సహకరించని సమయంలో కూడా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని వృద్ధిరేటును పరుగులు పెట్టిస్తున్న వైనంపై సమగ్ర చర్చ జరగాలి.

రుతుపవనాలు నిరాశపర్చినప్పటికీ కూటమి ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో ఈ ఏడాది వృద్ధిరేటులో ఆంధ్రప్రదేశ్ ముందుంది. ప్రభుత్వ దృఢ సంకల్పంతో అధిక వృద్ధిరేటు సాధ్యమైంది. రాష్ట్రమంతటా ఒకే అభివృద్ధి నమూనాను అనుసరించకుండా జిల్లాల్లో స్థానిక వనరులు, అవకాశాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏయే రంగాన్ని ప్రోత్సహించాలో కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా ప్రభుత్వం అమలుచేస్తున్నది. రాష్ట్రంలో తొలిసారిగా లక్ష రూపాయల తలసరి ఆదాయం నమోదైంది. టీడీపీ హయాంలో 2014–19 మధ్య రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధిరేటు 13.5శాతం ఉంటే.. జగన్‌రెడ్డి అసమర్థ, అరాచక పాలన వల్ల 2019–24 మధ్య సరాసరి 10.32శాతంకు పడిపోయింది. గడిచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి బృందం దోపిడీ, దుబారాలతో రాష్ట్రంలో మునుపెన్నడూ లేని ఆర్థిక సంక్షోభం నెలకొంది. రాజధాని అమరావతిని భ్రష్టుపట్టించి, పోలవరాన్ని పాడుపెట్టి, బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు పారిపోయేలా చేశారు. సహజ వనరులను నిలువుదోపిడీ చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసే దుస్థితికి తెచ్చారు. దేశంలోనే అప్పుల భారం అధికంగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను ఒకటిగా తయారు చేసిన పాపం జగన్‌రెడ్డిదే. ఆయన పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ, సేవలు, పారిశ్రామిక రంగాలు అధ్వాన దశకు చేరుకున్నాయి. జగన్ హయాంలో 2023–24లో ఏపీ స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్డీపీ) స్థిర ధరల వద్ద రూ.7,99,400 కోట్లతో 6.19 శాతం వృద్ధి రేటు నమోదయింది.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఏడు నెలల్లో మళ్లీ వ్యవస్థలన్నీ గాడిన పడుతుండటంతో 2024–25లో జీఎస్‌డీపీ 8,65,013 కోట్లకు చేరి 8.21శాతం వృద్ధి రేటుతో దేశంలో రెండవ స్థానంలో నిలిచింది. ప్రస్తుత ధరల వద్ద గత ఏడాది కంటే 12.02 శాతం వృద్ధి రేటుతో దేశంలోనే ఐదవ స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్ పునరుత్పాదక విద్యుత్ రంగాలలో గణనీయమైన పెట్టుబడులతో పాటు వ్యవసాయం, తయారీ, సేవల రంగాలలో విస్తృత పునరుద్ధరణ ఈ పురోగతికి దోహదపడింది.

వృద్ధిరేటు రెండింతలు పెరిగితే దాంతో పాటు రాష్ట్ర సంపద, ప్రజల తలసరి ఆదాయం నాలుగు రెట్లు పెరుగుతాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.2,00,162 కంటే మెరుగ్గా, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,66,240గా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రాన్ని ఆర్థిక స్థిరత్వం, సమృద్ధి వైపు నడిపిస్తున్నారనడానికి కేంద్రం విడుదల చేసిన ఈ గణాంకాలే నిదర్శనం. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర తలసరి ఆదాయం సైతం గత ఏడాది కంటే 11.89శాతం వృద్ధితో దేశంలోనే మూడవ స్థానంలో నిలిచింది. 2024–25లో వ్యవసాయ అనుబంధ రంగాలు అద్భుతమైన ప్రగతితో 15.41శాతం వృద్ధిని సాధించాయి. వ్యవసాయ, ఉద్యాన అనుబంధ రంగాలు వరుసగా 22.98, 21.29శాతాల వృద్ధిని నమోదు చేసాయి. సేవా రంగం 11.82శాతం అద్భుతమైన ప్రగతితో, ఇతర సేవలు 12.15శాతంతో, వాణిజ్యం–హోటళ్లు–రెస్టారెంట్ల రంగం 11.58శాతం, స్థిరాస్తి–ఇళ్ల నిర్మాణ రంగం 11.22శాతం అద్భుత వృద్ధిని సాధించాయి. తీవ్ర ఆర్థిక సంక్లిష్టతల మధ్య ఒడుదుడుకులను ఎదుర్కొంటూ వృద్ధి రేటులో దేశంలో రెండవ స్థానానికి చేరడం సామాన్యమైన విషయం కాదు.

దూరదృష్టి గల చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సంక్షోభం నుంచి అభివృద్ధి, ఆత్మవిశ్వాసం దిశగా పయనిస్తోంది. ప్రతి ఏటా 7.50శాతం చొప్పున వృద్ధి సాధిస్తే... 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.78లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.13,18,795కి చేరుతుంది. ఈ ఏడాది 15శాతం వృద్ధిరేటు సాధించగలిగితే 2025–26లో జీఎస్‌డీపీ రూ.18.47 లక్షల కోట్లకు చేరుతుంది. వృద్ధిరేటు పెరగడం వల్ల అదనంగా రూ.20,645కోట్ల ఆదాయం వస్తుంది. అలాగే, 2029–30 నాటికి జీఎస్డీపీ రూ.32.30లక్షల కోట్లకు చేరితే, రూ.42,136 కోట్ల అదనపు ఆదాయం వస్తుంది. ప్రతి ఏటా 15శాతం వృద్ధి రేటుతో జీఎస్‌డీపీ రూ.347 లక్షల కోట్లకు అంటే 2.74 ట్రిలియన్ డాలర్లకు, తలసరి ఆదాయం రూ.58,14,916కి చేరే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తున్నది. ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం ఆనందంగా ఉండేలా వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ ధ్యేయంతో విజన్–2047 రూపొందించింది కూటమి ప్రభుత్వం.

తీవ్ర ఆర్థిక సంక్లిష్టతల మధ్య ఒడుదుడుకులను ఎదుర్కొంటూ దేశంలో అధిక వృద్ధిరేటు సాధించడం సామాన్యమైన విషయం కాదు. కూటమి ప్రభుత్వ దృఢ సంకల్పంతో అధిక వృద్ధిరేటు సాధ్యమైంది. రాష్ట్రమంతటా ఒకే అభివృద్ధి నమూనాను అనుసరించకుండా జిల్లాల్లో స్థానిక వనరులు, అవకాశాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏయే రంగాన్ని ప్రోత్సహించాలో కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా ప్రభుత్వం అమలుచేస్తున్నది.



ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి సాధించింది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో వ్యవసాయంలో 16.6శాతం, పారిశ్రామిక రంగంలో 11.9శాతం, సేవారంగంలో 11.9శాతం వృద్ధి నమోదయింది. 2019–24 మధ్య జగన్‌రెడ్డి ప్రభుత్వంలో అది వరుసగా 10.22శాతం, 11.33శాతం, 10.84శాతంకి పడిపోయింది. తిరిగి కూటమి ప్రభుత్వ పాలనలో 2024–25లో వ్యవసాయంలో 15.41శాతం, పారిశ్రామిక రంగంలో 6.41శాతం, సేవారంగంలో 11.82శాతం వృద్ధి నమోదైంది. జగన్ ప్రభుత్వ అరాచక విధానాల వల్ల పారిశ్రామికరంగం కుప్పకూలి వృద్ధి రేటు దారుణంగా పడిపోయింది. విధ్వంసమయిన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్దీ రోజుల్లోనే ఎన్నో అభివృద్ధికర ఆర్థిక విధానాలను రూపొందించింది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచి, రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేలా వివిధ ప్రోత్సాహకాలతో నూతన పారిశ్రామిక విధానం తెచ్చింది.

ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి విధానం 4.0, ప్లగ్ & ప్లేతో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ 4.0 వంటి పాలసీలతో ఇప్పటికే రాష్ట్రానికి రూ.నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆతిథ్య రంగంలో 50వేల హోటల్ గదుల్ని నిర్మించి సేవారంగంలో 20శాతం వృద్ధిరేటు సాధించడం కోసం ఆతిథ్య రంగానికి పారిశ్రామిక హోదా కల్పించింది కూటమి ప్రభుత్వం. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. బీపీసీఎల్ పెట్రోలియం రిఫైనరీ, రూ.లక్ష కోట్లతో ఆర్సెలార్ మిత్తల్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఉక్కుపరిశ్రమ వంటి వాటితో రాష్ట్రంలో పరిశ్రమల రంగం ఉపందుకోనుంది. రూ.50వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. రైల్వే ప్రాజెక్టులపై మరో రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. పోర్టులు, నౌకా నిర్మాణం, లాజిస్టిక్స్, రహదారుల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటుగా గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నది కూటమి ప్రభుత్వం. వికసిత్ భారత్ ప్రేరణతో స్వర్ణాంధ్ర@2047లో 15శాతం వృద్ధిరేటు నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నది. 2.4 ట్రిలియన్ డాలర్లతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యేలా, కుటుంబ ఆదాయం రూ.42 వేల డాలర్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంది.

ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుతిరిగి చూడకుండా ముందుకు సాగడమే పురోగమనం. తీవ్ర ఆర్థిక సంక్లిష్టతల మధ్య ఒడుదుడుకులను ఎదుర్కొంటూ దేశంలో అధిక వృద్ధి రేటు సాధించడం సామాన్యమైన విషయం కాదు.



• అనగాని సత్యప్రసాద్
ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



ఇంటర్ విద్యార్థుల విజయోత్సవ సభలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ తదితరులు

నారాయణలో ఇంటర్ విద్యార్థుల విజయోత్సవ సభ

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'మీ కలలను మా కలలుగా భావిస్తున్నాం. మీ ప్రతి కలనూ సాకారం చేస్తున్నాం' అని విద్యార్థులను ఉద్దేశించి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థల ఇంటర్మీడియెట్ విద్యార్థుల విజయోత్సవ సభను విజయవాడ బెంజిసర్కిల్‌లోని నారాయణ క్యాంపస్‌లో నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణపై నమ్మకం ఉంచి వారి పిల్లలను చేర్పిన తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బ్రాంచిల్లో అత్యుత్తమ మార్కులతోపాటు అత్యధిక పాస్ పర్సంటేజీని తమ సంస్థ సాధించిందని రమా నారాయణ పేర్కొన్నారు. ఇంటర్ విద్యకు నారాయణ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని నారాయణ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ పి.ప్రమీల చెప్పారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో 'కృష్ణా వాటా': సీఎంకు లక్ష్మీనారాయణ లేఖ

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో వాదనల నేపథ్యంలో కృష్ణా నదీ జలాల్లో రాష్ట్రం వాటా ప్రమాదంలో పడింది. తక్షణమే రాష్ట్రం తరఫున సమర్థవంతమైన వాదనుల వినిపించేలా న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేయాలి' అని నదీ జలాల నిపుణుడు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు ఓ లేఖ రాశారు. 'ఈ నెల 16, 17 తేదీలలో కృష్ణా జలాల వివాదంపై వాదనలు వినిపించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమర్థులైన న్యాయవాదుల బృందాన్ని నియమించాలి. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలి. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు రాజకీయ ఉద్దేశంతో న్యాయ పోరాటం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం నదీ జలాల విషయంలో మరింత పట్టుదలతో పోరాటం చేస్తోంది. కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ముందు తెలంగాణ రాష్ట్రం బలమైన వాదనలు వినిపించేందుకు న్యాయవాదుల బృందాన్ని 2024లో ఏర్పాటు చేసింది. జల వనరుల శాఖలో సుదీర్ఘ కాలం బాధ్యతలు నిర్వహించిన పూర్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నీటి పారుదల శాఖ సలహాదారుగా నియమించుకున్నారు. ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో వ్యాజ్యాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఇది రాష్ట్రానికి ఇబ్బందికరమే. ఈ ఏడాది జూలై చివరిలో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కాలపరిమితి ముగియనుంది. దీంతో కృష్ణా జల వివాదంపై విచారణను వేగవంతం చేస్తోంది' అని లక్ష్మీనారాయణ తన లేఖలో పేర్కొన్నారు.

'మన్యం'లో వ్యక్తిపై ఏనుగుల దాడి


శంకర్ పూజారి

భామిని, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం సింగిడి గ్రామంలో సోమవారం ఓ వ్యక్తిపై ఏనుగులు దాడి చేశాయి. సింగిడి గ్రామంలో సోమవారం సాయంత్రం నాలుగు గజరాజులు హల్‌చల్ చేశాయి. వాటిని చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు. అదే గ్రామానికి చెందిన శంకర్ పూజారి అనే వ్యక్తి ఏనుగులకు అరటి గెల ఇవ్వబోయాడు. అతన్ని ఏనుగులు పొలాల్లోకి ఈడ్చుకెళ్లగా ఆ ప్రాంతంలోని బురదలో చిక్కుకున్న శంకర్ అపస్మాకర స్థితికి చేరాడు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖకు చెందిన ట్రాకర్స్ ఆ ప్రాంతానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి ఏనుగులను ఆ ప్రదేశం నుంచి తరలించారు. వెంటనే శంకర్ వద్దకు చేరుకుని లేపగా.. స్పృహలోకి వచ్చాడు. హుటాహుటిన భామిని పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సీతంపేట సీహెచ్‌సీకి తరలించారు.

పట్టణాల్లో ఆధునిక అంగళ్లు

» ప్రత్యేక సౌకర్యాలతో 'స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు'

» ఇప్పటికే నెల్లూరులో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

అమరావతి-ఆంధ్రజ్యోతి


మోడల్ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు

రాష్ట్రంలోని పట్టణాల్లో వీధి వ్యాపారులకు కూటమి సర్కార్ ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయనుంది. పట్టణాల్లో రద్దీ తగ్గించేందుకు, పరిశుభ్రమైన వ్యాపార పద్ధతులు అలవాటు చేసేందుకు, డిజిటల్ టూల్స్ ఉపయోగించి వ్యాపారుల ఉత్పాదక పెంచేందుకు, మహిళలు, వారి కుటుంబ సభ్యుల వ్యాపారాల వృద్ధి కోసం, పర్యావరణ అనుకూలతతో పాటు సుస్థిర వసతుల కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీధి వ్యాపారులు స్థిరపడేందుకు, నిలకడైన వ్యాపారాలు చేసుకునేందుకు "స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు" అనే పేరుతో వారికి కంటైనర్ షాపులు నిర్మించి ఇవ్వనున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్(ఎన్‌యూఎల్ఎం) 2013లో స్మార్ట్ స్ట్రీట్ పథకం పథకం ప్రారంభించినప్పటికీ ఇప్పుడు ఈ పథకానికి మోక్షం లభించింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 200 షాపులు నిర్మించి వీధి వ్యాపారులకు అందించాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ భావించారు. అందులో భాగంగా మొదట నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించారు.

వీధి వ్యాపారులే లబ్ధిదారులు

పట్టణ స్థానిక సంస్థల్లో రిజిస్టర్ అయిన 18ఏళ్లు నిండిన వీధి వ్యాపారులు స్మార్ట్ స్ట్రీట్ పథకానికి అర్హులు. పట్టణ వ్యాపారుల కమిటీ సిఫారసులతో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ప్రజల్లో ఈ పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తారు. లబ్ధిదారుల ఎంపికలో తుది నిర్ణయం ప్రజల సమక్షంలో సోషల్ ఆడిట్ నిర్వహించి తీసుకుంటారు. లాటరీ విధానంలో షాపులు కేటాయిస్తారు. బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించేందుకు ఒక గ్రూపు ఏర్పాటు చేస్తారు. ఆయా పట్టణ స్థానిక సంస్థల కమిషనర్ పర్యవేక్షణలో కంటైనర్ మోడల్ షాపులు నిర్మిస్తారు. మే 31 లోపు ఈ కంటైనర్ షాపుల నిర్మాణాల పైలట్ ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించారు. నెల్లూరులో ఇప్పటికే కంటైనర్ షాపులు ఏర్పాటుకు ప్లాట్‌ఫాంలు నిర్మించారు. రూఫ్‌టాప్ సీటింగ్‌తో కంటైనర్లను ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. ఉచిత వైఫై జోన్ ఏర్పాటు చేయడంతో పాటు అడ్వర్టైజింగ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తారు.

నైపుణ్య, మార్కెటింగ్ శిక్షణ..

శుచి, శుభ్రమైన ఆహారపదార్థాలు తయారుచేసేందుకు నైపుణ్య శిక్షణతో పాటు మార్కెటింగ్‌లోనూ శిక్షణ అందిస్తారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి ద్వారా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందించి వారిని వడ్డీ వ్యాపారుల బెడద నుంచి తప్పించేందుకు చర్యలు ప్రారంభించింది. డిజిటల్ చెల్లింపులకు సాంకేతిక సహకారం అందిస్తారు. మొదట ఈ ప్రాజెక్టుకు రూ.7 కోట్లు నుంచి రూ.9 కోట్లు ఖర్చు చేస్తారు. పట్టణ స్థానికసంస్థల సహకారంతో రూ.3 కోట్లతో స్థలం, వసతులు, సోలార్ విద్యుత్ ఏర్పాటు, నిర్వహణ చేపడతారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.3 కోట్లు అందిస్తారు. మెప్మా ద్వారా రూ.1.25 కోట్ల నిధులను, ఎన్‌యూఎల్ఎం శిక్షణ, మెంటార్‌షిప్ నిధుల నుంచి ఖర్చు చేస్తారు. స్థానికంగాను, విస్తరించేందుకు స్విగ్గీ, జొమాటోతో ఈ కామర్స్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తారు. ఈ వీధివ్యాపారుల జాబితాను పట్టణ స్థానికసంస్థలు, మెప్మా వెబ్‌సైట్‌లో ఉంచుతారు. నెల్లూరులో పైలట్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మిగతా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు.

అతి వేగం ఖరీదు.. మూడు ప్రాణాలు!


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

» ఒంటిమిట్ట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

» ఎలక్ట్రిక్ బస్సు, రక్షక్ వాహనాన్ని ఢీకొన్న స్కార్పియో

» మృతులు నంద్యాల జిల్లా వాసులు, ఒకరి పరిస్థితి విషమం


మృతులు వినోద్, ధర్మారెడ్డి, తేజనాయుడు
సునీల్‌నాయుడు

ఒంటిమిట్ట/నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై ప్రధాన రహదారిలోని ఒంటిమిట్ట సమీపంలో సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా బస్సు, స్కార్పియో ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఐటీఐ విద్యార్థి తేజనాయుడు(21), సునీల్‌నాయుడు (మహానంది కోర్టు కానిస్టేబుల్) సమీప బంధువులు. వీరి చిన్నాన్న హరినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సునీల్‌నాయుడు తన స్నేహితులైన చాగలమర్రి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బత్తూరు ధర్మారెడ్డి (27), బండి ఆత్మకూరు మండలం సోమరాజులపల్లి గ్రామానికి చెందిన వినోద్ (29)తో కలిసి హరినాయుడును ఈ నెల 13న కారులో తిరుపతి తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పించాడు. తిరుగు ప్రయాణంలో వారి వాహనం కడప జిల్లా ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఎలక్ట్రిక్ బస్సును, పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధర్మారెడ్డి, వినోద్, తేజనాయుడు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ సునీల్‌నాయుడును కడప రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలిసింది. సమాచారం అందుకున్న సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో అదుపు తప్పిన రక్షక్ వాహనం రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కానిస్టేబుల్ రఘునాథరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చక్రస్నానం నిర్వహించిన అర్చకులు

ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన సోమవారం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ సమీపంలోని పుష్కరణిలో చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపన తిరుమంజనం, చక్రత్తల్వార్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం కంకణభట్టార్ రాజేశ్ కుమార్ వేదమంత్రోచ్చారణల మధ్య చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించి గరుడ పటాన్ని అవనతం చేయడంతో కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

సీపీఎస్‌పై తుది నిర్ణయం తీసుకోండి

» ప్రభుత్వానికి ఏపీ సీపీఎస్ఈఏ విజ్ఞప్తి

విజయవాడ(విద్యాధరపురం), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల విషయమై మంగళవారం జరగనున్న మంత్రి మండలి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీపీఎస్ఈఏ) నాయకులు కోరారు. 20 ఏళ్లుగా సీపీఎస్ ఉద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసి వారి ఆకాంక్షలు నెరవేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్, కడిమి రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తాము గెలిచి అధికారంలోకి వస్తే ఏడాది లోపల 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని కూటమి పార్టీలు హామీలు ఇచ్చాయని వారు గుర్తు చేశారు. ఏడాది గడిచిపోయిందని గుర్తుచేస్తూ ఇప్పటికైనా తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మంత్రి రామానాయుడు శ్రమదానం


చింతపర్రులో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో శ్రమదానం చేస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతీ పేటలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో పాల్గొని శ్రమదానం చేశారు.

అందం | చందం



చక్కని రూపం కోసం...

సురక్షిత చికిత్సలు

ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకేలా ఉండనట్టే, ఏ ఇద్దరి శరీరాలూ ఒకేలా ఉండవు. అలాగే కొవ్వు పేరుకునే అవయవాలు, చర్మం సాగిపోయే స్వభావాలు కూడా వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి. పెరిగే వయసుతో పాటు మారిపోతూ ఉంటాయి. ఈ ఇబ్బందులను సరిదిద్దుకోగలిగే సౌందర్య చికిత్సలెన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి అసౌకర్యాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఈ చికిత్సలను ఆశ్రయించడం అవసరమేనని అంటున్నారు వైద్యులు.

15 నుంచి 60 ఏళ్ల మధ్య మహిళల శరీరాలు పలు రకాల మార్పులకు లోనవుతూ ఉంటాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులు, శరీరంలో కొవ్వు పేరుకుపోయే తత్వాలు, ముఖంలో చోటుచేసుకునే వృద్ధాప్య లక్షణాల వల్ల ఆకర్షణ తగ్గిన మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడంతో పాటు, శారీరక అసౌకర్యాలకు కూడా లోనవుతూ ఉంటారు. అయితే అవగాహన లోపంతో, అశ్రద్ధతో ఈ అసౌకర్యాలను నిర్లక్ష్యం చేసే మహిళలే ఎక్కువ. కానీ నిజానికి మనసుకూ, శరీరానికీ ఇబ్బందిగా తోచే ఏ ఒక్క మార్పునూ నిర్లక్ష్యం చేయవలసిన అవసరం లేదు. అందుబాటులో ఉన్న సౌందర్య చికిత్సలతో వాటిని సరిదిద్దుకుని ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసుకోవచ్చు. అనుభవజ్ఞులైన వైద్యుల సహాయంతో, చిన్న కోతలతో, దుష్ప్రభావాలు లేని చికిత్సలతో చక్కని ఫలితాన్ని రాబట్టుకుని, జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చు.

పెద్ద రొమ్ముల సమస్య

ప్రస్తుతం పెళ్లీడు యువతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 'జైగాంటియో మాస్టియా'! చిన్న వయసులోనే తొలి నెలసరి మొదలు కావడం, పెద్ద రొమ్ముల కుటుంబ చరిత్రను కలిగి ఉండడం వల్ల, కొందరు యువతుల్లో రొమ్ముల పరిమాణం పెరిగిపోయి, మెడ నొప్పి, వెన్ను నొప్పి వేధిస్తూ ఉంటాయి. ఈ సమస్యను బయటకు చెప్పుకోలేక రకరకాల బ్రాసరీలను ప్రయత్నించే అమ్మాయిలు ఉంటారు. నలుగురిలో కలవలేక, ఉద్యోగాలు మానుకుని ఇళ్లకే పరిమితమైపోయే అమ్మాయిలూ ఉంటారు. ఇలాంటి యువతుల రొమ్ముల సమస్యకు రెండు కారణాలుంటాయి.

లేజర్ లైపోసక్షన్: పెద్ద పరిమాణానికి కారణం కొవ్వు మాత్రమే అయితే, నాలుగు మిల్లీమీటర్ల రంధ్రం ద్వారా, లేజర్, పవర్ అసిస్టెడ్, వేజర్ లైపోసక్షన్‌లతో కొవ్వును కరిగించి తొలగించవచ్చు. కానీ ఈ సర్జరీతో సాగిన రొమ్ములను సరి చేసే వీలుండదు.

సర్జరీతో: ఒకవేళ పెద్ద రొమ్ములకు, కొవ్వుతో పాటు గ్రంథులు కూడా కారణమైన పక్షంలో, సర్జరీతో రెండు రొమ్ముల్లోని అదనపు కొవ్వు, గ్రంథులనూ తొలగించవలసి వస్తుంది. ఈ సర్జరీతో కిందకు జారిన రొమ్ములను పైకి సరిచేసే వీలు కూడా ఉంటుంది. మూడు గంటల నిడివి ఉండే ఈ సర్జరీ చేయించుకున్న రోజు సాయంత్రమే ఇంటికి వెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచి స్నానం చేయొచ్చు, డెస్క్ జాబ్స్ చేసుకోవచ్చు. సర్జరీ చిన్న కోతతో పూర్తవుతుంది. కాబట్టి గాయం మానిపోయిన తర్వాత స్కార్ క్రీమ్స్ వాడుకుంటే, మచ్చ ఎబ్బెట్టుగా కనిపించకుండా చర్మంలో కలిసిపోతుంది. ఇక నొప్పి విషయానికొస్తే, సర్జరీ చేసే సమయంలోనే నర్వ్ బ్లాక్స్ ఇంజెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది కాబట్టి సర్జరీ తర్వాత 16 గంటల వరకూ నొప్పి పూర్తిగా అదుపులోకి వచ్చేస్తుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి కొన్ని మందులు వాడుకుంటే సరిపోతుంది. ఇలా రొమ్ముల్లోని కొవ్వును తొలగించే క్రమంలో కొన్ని పాల గ్రంథులు దెబ్బతింటాయి. కాబట్టి పెళ్లై, తల్లైన తర్వాత బిడ్డకు సరిపడా పాలు తయారు అవకపోవచ్చు. సాధారణ మహిళలతో పోలిస్తే, ఇలా రొమ్ము సర్జరీ చేయించుకున్న వారిలో చనుపాల ఉత్పత్తి 40 నుంచి 50% మేరకు తగ్గుతుంది.



పెళ్లీడు యువతుల్లో...



అవాంఛిత రోమాలు, రొమ్ముల్లో లోపాలు పెళ్లీడు యువతులను వేధిస్తూ ఉంటాయి. వీటికి లేజర్ చికిత్సలతో పాటు, ఇంప్లాంట్స్, బ్రెస్ట్ రిడక్షన్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆకర్షణీయంగా కనిపించడం కోసం స్కిన్ బూస్టర్స్, లేజర్ టోనింగ్‌లను ఆశ్రయించవచ్చు. కొందరు యువతులకు శరీరంలోని కొన్ని ప్రదేశాల్లోనే కొవ్వు పేరుకుపోతూ ఉంటుంది. కొందరికి చేతుల్లో, పిరుదుల్లో, పొట్టలో, రొమ్ముల్లో ఎక్కువ కొవ్వు పేరుకుంటూ ఉంటుంది. ఈ కొవ్వును తొలగించుకోవడం కోసం లేజర్ లైపోసక్షన్‌ను ఆశ్రయించవచ్చు. లేజర్స్‌తో పాటు అల్ట్రాసౌండ్ లైపోసక్షన్‌లో భాగంగా 'వేజర్స్' కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. జనరల్ అనస్థీషియాలో, ఈ సర్జరీలతో ఆయా శరీర భాగాల్లోని అదనపు కొవ్వును తొలగించి, చక్కని ఆకృతిలోకి మలుచుకోవచ్చు.

ముక్కులోలోపాలు



పుట్టుకతోనే సంక్రమించిన వంకర ముక్కు, చట్టి ముక్కు, బండ ముక్కులను సరిదిద్దే రైనోప్లాస్టీ చికిత్సలు కూడా ఉన్నాయి. శ్వాసలో సమస్యలు, ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్‌లకు కారణమయ్యే నాశికా లోపాలను సరిచేసే చికిత్సలతో పాటు ఆకారాన్ని సరిదిద్ది ఆకర్షణీయంగా మలిచే సర్జరీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ సర్జరీలకు, సమస్య తీవ్రతను బట్టి గంటన్నర నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. ఇలాంటి రైనోప్లాస్టీ సర్జరీల్లో కూడా మూడు రకాలుంటాయి.

లిక్విడ్ రైనోప్లాస్టీ

ముక్కు మీద గుంటలున్నప్పుడు సర్జరీతో పని లేని లిక్విడ్ రైనోప్లాస్టీతో జెల్‌తో అవకారాలను సరిదిద్దే వీలుంటుంది. కానీ ఈ ప్రభావం ఏడాదికి మించి ఉండదు.

ఇంప్లాంట్స్

ముక్కు ఎత్తు పెంచడానికి సిలికాన్ ఇంప్లాంట్స్‌ను వాడుకోవచ్చు.

సర్జికల్ రైనోప్లాస్టీ

ముక్కు మొత్తాన్నీ తెరిచి, లోపాన్ని సమూలంగా సరిదిద్దే సర్జరీ ఇది. దీన్లో ముక్కులోని ఎముక, మృదులాస్థిలను పునర్నిర్మిస్తారు.

డొప్ప చెవుల కోసం



కొంతమందికి పుట్టుకతోనే గబ్బిలం చెవుల్లా చెవులు విప్పారి ఉంటాయి. చెవుల్లోని మృదులాస్థిలో ముడతలు ఏర్పడని సందర్భాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి వాళ్లకు చెవి వెనక కోత పెట్టి మృదులాస్థిని మడత పెట్టడం జరుగుతుంది. దాంతో చెవులు వెనక్కి వెళ్లిపోతాయి. లోకల్ అనస్థీషియాతో చేసే ఈ సర్జరీ పూర్తయిన తర్వాత, రెండు గంటల్లో ఇంటికి వెళ్లిపోవచ్చు.

బిగుతును పెంచే 'వెజైనోప్లాస్టీ'

సాధారణ ప్రసవంతో వెజైనా చుట్టూరా ఉన్న కండరాలన్నీ వదులైపోతాయి. ఫలితంగా కొందర్లో మూత్రం మీద నియంత్రణ తప్పుతుంది. దాంతో దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవుతూ ఉంటుంది. ఈ సమస్య తీవ్రత తక్కువగా, మొదటి రెండు దశలకే పరిమితమై ఉన్నప్పుడు వెజైనోప్లాస్టీ సర్జరీని ఎంచుకోవచ్చు. సమస్య మొదటి దశలో ఉన్న వాళ్లకు లేజర్ వెజైనోప్లాస్టీ సరిపోతుంది. ఈ సర్జరీ తర్వాత లైంగిక కలయిక కోసం ఆరు వారాలు ఆగవలసి ఉంటుంది. వదులు మరీ ఎక్కువగా ఉన్నప్పుడు సర్జరీ తప్పదు. అలాగే వరుస ప్రసవాల వల్ల లేబియా వ్యాకోచించి, చమటతో, పిగ్మెంటేషన్‌తో బాధపడే మహిళలు కూడా ఉంటారు. ఇలాంటివారికి 'లేబియోప్లాస్టీ' సర్జరీ అందుబాటులో ఉంది.

అమ్మలకు... మమ్మీ మేకోవర్



పిల్లలను కన్న తర్వాత మహిళల శరీరాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. పైబడే వయసుతో ముఖంలో మార్పు రావచ్చు. రొమ్ములు జారిపోవచ్చు. పొట్టలో కొవ్వు పేరుకుపోవచ్చు.

రొమ్ముల్లో మార్పులు: రొమ్ములు బిగుతు సడలి, గాలి తీసిన బెలూన్లలా కిందకు జారిపోతాయి. కొందరికి పరిమాణం పెరిగి మెడ నొప్పి, వెన్ను నొప్పి వేధిస్తాయి. వీళ్లకు కొవ్వు తగ్గించే బ్రెస్ట్ రిడక్షన్, బిగుతును పెంచే బ్రెస్ట్ ఎన్‌హ్యాన్స్‌మెంట్, పైకి లేపే బ్రెస్ట్ లిఫ్ట్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ఎత్తు పొత్తికడుపు: వరుస ప్రసవాల వల్ల పొట్టలోని కండరాలు వదులై, కిందకు జారడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. టమ్మీ టక్ చికిత్సతో ఈ సమస్యను సరిదిద్దే వీలుంది. పిరుదులు, నడుము, పొట్ట చుట్టూరా లైపోసక్షన్ చేసి, కండరాల బిగుతును పెంచి, అదనపు చర్మాన్ని తొలగించే సర్జరీ ఇది.



డాక్టర్ గురు కర్ణ వేముల
డైరెక్టర్, పెర్సోనిక్స్ కాస్మెటిక్ అండ్
ప్లాస్టిక్ సర్జరీ సెంటర్, మణికొండ, హైదరాబాద్.

ఆహారంలో | ఆరోగ్యం

రోజూ పెరుగు తిందాం

వేసవిలో చల్లదనం కోసం తప్పనిసరిగా పెరుగు తింటూ ఉండాలని అంటూ ఉంటారు. ఇదెంత వరకూ నిజమో తెలుసుకుందాం!

పెరుగులో నీటి శాతం ఎక్కువ. అలాగే దీన్లోని ప్రొబయాటిక్ పరిమాణం పొట్టను చల్లగా ఉంచుతుంది. అలాగని పెరుగుతో, వేసవిలో పెరిగే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోతుందనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలూ లేవు. అయితే మధ్యాహ్న భోజనం తర్వాత పెరుగు తీసుకోవడం వల్ల, జీర్ణశక్తి పెరుగుతుంది. పేగుల ఆరోగ్యం, పోషకాల శోషణ పెరుగుతాయి. అయితే ల్యాక్టోజ్ ఇంటాలరెన్స్ సమస్య ఉన్నవారు ప్రతి రోజూ పెరుగు తీసుకోవడం వల్ల కడుపుబ్బరం, డయేరియా బారిన పడే అవకాశం ఉంటుంది. అలాగే పరిమితికి మించి పెరుగు తిన్నా, జీర్ణాశయ సమస్యలు తప్పవు. బరువు కూడా పెరుగుతారు. అలాగే పెరుగు ద్వారా అందే అదనపు క్యాల్షియం వల్ల ఐరన్, జింక్ పోషకాల శోషణ కుంటుపడే అవకాశం ఉంటుంది. కాబట్టి పెరుగు ప్రయోజనాలను పొందాలంటే, పరిమితంగానే తినాలి. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా సరిపడా పెరుగు తింటూ ఉండాలి.



ఇదీ | నిజం

తీపి తడాఖా తగ్గేలా...

బరువు తగ్గే ప్రయత్నంలో భాగంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు, తీపి విషయంలో కూడా అదే సూత్రాన్ని అనుసరిస్తూ ఉంటారు. కానీ ఇలా మనసు చంపుకోవలసిన అవసరం లేకుండా, సంతృప్తి పొందేలా తీపి తినేయాలని సూచిస్తున్నారు ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్ రుజుత దివేకర్. ఆమె ఏమంటున్నారంటే...

సాధారణంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు మైదాకు బదులుగా బాదం పిండి, లేదా తృణధాన్యాలతో తయారైన కేకులు, బిస్కెట్లు ఎంచుకుంటూ ఉంటారు. కానీ నేనైతే మైదా, చక్కెర, నెయ్యి దట్టించి తయారుచేసిన పిండి వంటలనే ఎంచుకుంటాను. తినే ప్రతి పదార్థాన్నీ పిండిపదార్థాలు, కొవ్వులు, క్యాలరీల్లో లెక్కించుకుంటూ ఉంటే, తినడంలో ఉండే సంతోషాన్ని కోల్పోతాం! దాంతో తినే పదార్థాలన్నీ రుచిని కోల్పోయి, అసంతృప్తిని విఙగులుస్తాయి. కాబట్టి ఈ లోటు తెలియకుండా ఉండాలంటే పాలు తాగాలనుకుంటే వెన్న తీయని పాలే ఎంచుకోవాలి. గుడ్డు తింటే పచ్చసొనతో సహా మొత్తం గుడ్డు తినేయాలి. ఇలా తినగలిగితే తర్వాత అసంతృప్తి వేధించదు, తినాలనే యావ పెరగదు. పరివిఙత ఆహారం తీసుకునేవారు అప్పుడప్పుడూ తీపి తినడం వల్ల ఒరిగే నష్టం పెద్దగా ఉండదు. తీపి తినాలనుకుంటే, షుగర్ లేదని చెప్పుకునే చాక్లెట్లకు బదులుగా నచ్చిన స్వీటును తినేయాలి. ఇలా తినడం వల్ల మానసిక సంతృప్తి దక్కి, తీపి మీద యావ




పోతుంది. అలాగే తీపితో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి కాబట్టి తీపిని ఖాళీ కడుపుతో కాకుండా, భోజనం తర్వాత తినాలి. ఇలా తినడం వల్ల భోజన పదార్థాల్లోని పోషకాలు, తీపి పదార్థం లోని చక్కెరల శోషణను క్షీణింపచేస్తాయి. ఫలితంగా శరీరం మీద తీపి ప్రభావం తగ్గుతుంది.

మీకు | తెలుసా?

మూత్రవిసర్జన ఆపుకుంటే?

అత్యవసర సమావేశంలో ఉన్నప్పుడు లేదా వాష్‌రూమ్స్ అందుబాటులో లేనప్పుడు మూత్రవిసర్జనను నియంత్రించుకుంటూ ఉంటాం. అయితే ఇదే అలవాటుగా మారితే మూత్రాశయం, మూత్రపిండాల సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మూత్రవిసర్జనను బలవంతంగా ఆపుకున్నప్పుడు, మూత్రాశయం దాని సహజసిద్ధ సామర్థ్యానికి మించి సాగుతుంది. ఇదే పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగితే, కండరాలు బలహీనమవుతాయి. ఫలితంగా మూత్రాశయం పూర్తిగా ఖాళీ అవక, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో మూత్రాశయ పనితీరు దెబ్బతింటుంది. కొందర్లో మూత్రాన్ని ఆపుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. అలాగే ప్రోస్టేట్ గ్లాండ్ పెరిగిన వాళ్లకు రెట్టింపు ముప్పు పొంచి ఉంటుంది. మూత్రాశయంలో మూత్రం ఎక్కువ సమయం పాటు నిల్వ ఉండిపోయినప్పుడు, మూత్రంలోని బ్యాక్టీరియా విస్తృతి చెందే వాతావరణం నెలకొంటుంది. దాంతో ఇన్‌ఫెక్షన్ పెరిగి తరచూ మూత్రవిసర్జన చేయవలసి రావడం, మూత్రవిసర్జన సమయంలో మంట, నొప్పి, పొత్తికడుపు నొప్పి, జ్వరం లాంటివి వేధిస్తాయి. అలాగే మూత్రవిసర్జనను నియంత్రించుకోవడం వల్ల మూత్రపిండాల మీద భారం పెరిగి, వాటి పనితీరు దెబ్బతింటుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశాలు కూడా పెరుగుతాయి. కాబట్టి శరీర సంకేతాలకు సకాలంలో స్పందిస్తూ, మూత్రాశయాన్ని ఖాళీ చేస్తూ ఉండాలి. మూత్రవిసర్జనను నియంత్రించుకునే పరిస్థితులకు దూరంగా ఉండాలి. సరిపడా నీళ్లు తాగుతూ, పరిశుభ్రత పాటిస్తూ ఉండాలి.



అవగాహన



50 ఏళ్లు దాటితే షింజిల్స్ షురూ

చికెన్‌పాక్స్ వైరల్ ఇన్‌ఫెక్షన్ అనే విషయం మనందరికీ తెలిసిందే! ఇదే వైరస్ 'షింజిల్స్' అనే తీవ్రమైన చర్మ సమస్యకు కూడా కారణమవుతుంది. 50 ఏళ్లు పైబడిన వాళ్లను వేధించే ఈ సమస్య గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

షింజిల్స్ ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్ కాదు. కానీ అది జీవితాన్ని మార్చేస్తుంది. ఈ ఏడాది మన దేశంలో చేపట్టిన ఇండియా షింజిల్స్ అవగాహన సర్వేలో 50 ఏళ్లు పైబడిన 56.6% మంది పెద్దలకు షింజిల్స్ గురించి ఏమాత్రం అవగాహన లేదనే విషయం తేలింది. కానీ ఈ సమస్య గురించి పూర్తి అవగాహన ఏర్పరుచుకోగలిగితే, మరింత మెరుగ్గా దాన్ని ఎదుర్కోగలుగుతాం!

వ్యాధి కాదు, వైరస్ వ్యాపిస్తుంది

చికెన్‌పాక్స్‌కు కారణమయ్యే వైరస్ వల్లే షింజిల్స్ సోకుతుంది. అయితే షింజిల్స్ సోకిన వ్యక్తుల నుంచి ఆ వ్యాధి ఇతరులకు వ్యాపించదు. కానీ షింజిల్స్‌కు కారణమైన వైరస్ ఇతరులకు వ్యాపిస్తుంది. అప్పటివరకూ చికెన్‌పాక్స్ బారిన పడని వ్యక్తులు షింజిల్స్ సోకిన వ్యక్తులకు బహిర్గతమైతే, వారికి షింజిల్స్ సోకడానికి బదులుగా, చికెన్‌పాక్స్ సోకుతుంది. ఈ ఇన్‌ఫెక్షన్ తగ్గిపోయిన తర్వాత కూడా సదరు వైరస్ శరీరంలో నిద్రాణంగా ఉండిపోయి, తర్వాతి కాలంలో 50 ఏళ్లు పైబడిన తర్వాత షింజిల్స్ రూపంలో వేధిస్తుంది.

పొరపాటు పడకూడదు

దురదలతో కూడిన షింజిల్స్‌ను, ఎగ్జిమ అనే చర్మ వ్యాధిగా పొరపాటు పడేవాళ్లు ఉంటారు. దాంతో షింజిల్స్ చికిత్స ఆలస్యమైపోతుంది. ఫలితంగా వైరస్ మరింత అభివృద్ధి చెంది, దీర్ఘకాలిక సమస్యలు తెచ్చిపెడుతుంది. ఎగ్జిమాకు భిన్నమైన షింజిల్స్‌లో నొప్పి, మంట, తిమ్మిర్లు ఉంటాయి. ఆ తర్వాత శరీరం మీద పుండ్లు ఏర్పడతాయి.

ఏళ్ల తరబడి నొప్పి

షింజిల్స్ సోకిన కొందర్లో పుండ్లు మానిన వెంటనే నొప్పి తగ్గదు. షింజిల్స్‌తో నాడుల చివర్లు దెబ్బతిని, పోస్‌థెరపిటిక్ న్యురాల్జియా అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిలో నాడులు అవసరానికి మించిన నొప్పి సంకేతాలను చర్మం నుంచి మెదడుకు సరఫరా చేస్తూ ఉంటాయి. దాంతో తట్టుకోలేనంత బాధ వేధిస్తుంది. ఈ నొప్పి నెలలు, సంవత్సరాల పాటు కొనసాగుతుంది. దాంతో నిద్రాభంగం కలగడం, రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడడం, జీవన నాణ్యత దెబ్బతినడం జరుగుతుంది. వయసు ఎంత ఎక్కువగా ఉంటే, ఈ నొప్పి అంత ఎక్కువగా ఉంటుంది.

ఇతర అవయవాలు కూడా...

షింజిల్స్ చర్మంతో పాటు, కీలక అవయవాలను కూడా ప్రభావితం చేస్తాయి. కంటి చుట్టూరా తలెత్తిన షింజిల్స్‌తో కళ్లు దెబ్బతిని, కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అరుదైన సందర్భాల్లో మెదడు ఇన్‌ఫ్లమేషన్, ముఖ పక్షవాతం, వినికిడి, సంతులన సమస్యలు తలెత్తుతాయి. బలహీనమైన వ్యాధినిరోధకశక్తి కలిగిన వారిలో ఈ సమస్యలు అత్యధికం.

షింజిల్స్ పలుసార్లు

షింజిల్స్ ఒక్కసారే సోకుతుందన్నది అపోహ. ఎక్కువ శాతం మంది జీవితంలో ఒక్కసారే షింజిల్స్ బారిన పడితే, అంతకంటే ఎక్కువ సార్లు ఈ ఇన్‌ఫెక్షన్ సోకిన వాళ్లు కూడా లేకపోలేదు. అయితే రెండోసారి షింజిల్స్ సోకినప్పుడు, మొదటిసారి పుండ్లు ఏర్పడిన అదే ప్రదేశంలో పుండ్లు ఏర్పడవు.


చికిత్స ఇలా...

- **యాంటీవైరల్:** వైరస్ తీవ్రత, వ్యవధిని తగ్గించడం కోసం మరీ ముఖ్యంగా ప్రారంభంలో ఈ మందులు వాడుకోవచ్చు.
- **నొప్పి నివారణ:** వైద్యులు సూచించే నొప్పిని తగ్గించే మందులు వాడుకోవచ్చు
- **ఉపశమనం:** ఉపశమనం కోసం పుండ్లను, దురదను తగ్గించే జెల్స్, క్రీమ్స్ వాడుకోవచ్చు.

భారతదేశంలో 50 ఏళ్లకు పైబడిన 90% మంది ఈ వైరస్‌ను శరీరాల్లో కలిగి ఉన్నారు కాబట్టి ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని, నివారణ చర్యలు పాటించాలి. అందుకోసం షింజిల్స్ గురించి వైద్యులతో చర్చించి, టీకాలతో నివారణ చర్యలు చేపట్టాలి. అలాగే క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం, బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధకశక్తిని దృఢంగా ఉంచుకోవాలి.



డాక్టర్ మేక సత్యన్నారాయణ
సీనియర్ కన్సల్టెంట్
ఫ్యామిలీ ఫిజీషియన్,
అశ్విని ఐడి క్లినిక్, హైదరాబాద్




వసూల్ రాజా 'దూకుడు!

రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) విజయవాడ జోన్ పరిధిలో అవినీతి వ్యవహారాలు తారాస్థాయికి చేరాయి. సంస్థలో ఎక్కడ అవినీతి జరిగినా పసిగట్టాల్సిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగమే పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది. ఈ విభాగం అధికారి గ్యారేజీల వారీగా సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బలవంతంగా వసూళ్లకు పాల్పడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆర్టీసీ ఉద్యోగుల సొమ్ముతో మందు, విందు, సరదాలలో మునిగితేలుతున్న సదరు అధికారిని ఆదర్శంగా తీసుకుని డిపో స్థాయి అధికారులు సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

ఆర్టీసీలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి నిర్వాకం

ఏజెంట్లను పెట్టుకుని గ్యారేజీల వారీగా కలెక్షన్లు

- సార్ అవినీతిపై స్పందించని మేడమ్
- మేము తక్కువ కాదంటూ రెచ్చిపోతున్న డిపో అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆర్టీసీ డిపోల్లో జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాల్సిన విజయవాడ జోన్ పరిధిలోని విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అధికారి అక్రమ వసూళ్లకు పాల్పడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ గ్యారేజీల వారీగా సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బలవంతంగా ఫోన్‌పేలు చేయించుకోవడం, ఖరీదైన మందు బాటిల్స్ తెప్పించుకోవడం, నాన్‌వెజ్ విందు భోజనాలను సిద్ధం చేయించడం, బస్సులలో అనధికారికంగా వస్తువులను బట్వాడా చేయటం వంటివి ఇక్కడ నిత్యకృత్యం అయ్యాయి. ఈ అధికారి అవినీతి వ్యవహారాలపై ఈయన కన్న పైస్థాయిలో ఉన్న మహిళా అధికారికి లెక్కలేనన్ని ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా ఆమె ఎందుకు పట్టించుకోవటంలేదన్నది ఆర్టీసీలో ఒక మిస్టరీగా మారింది. మేడం ఉదాసీనంగా ఉండటం వెనుక అనేక అనుమానాలు, ఆరోపణలు వినవస్తున్నాయి. విజిలెన్స్ విభాగాన్ని పర్యవేక్షించాల్సిన ఈడీ(ఏ)కు సరైన పట్టు లేకపోవటంతో కిందిస్థాయి విజిలెన్స్ అధికారులు ఏది చెబితే దానికి తలూపుతున్నట్లు సమాచారం. దీంతో వసూళ్ల రాజాపై చర్యలు తీసుకునే పరిస్థితి ఉండటం లేదని తెలిసింది. దాదాపుగా ఉన్నతాధికారులెవరూ విజిలెన్స్ అధికారిపై చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవటంతో.. వసూళ్ల రాజా ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ సారే కలెక్షన్‌కు దిగటంతో మేమేమైనా తక్కువా అంటూ ఆర్టీసీ డిపోల్లోని అధికారులు సైతం మరింత రెచ్చిపోతున్నారు. వెరసి.. ఆర్టీసీలో అవినీతి వ్యవస్థ వేళ్లూనుకుపోతోంది.

ఏ పని కావాలన్నా ముడుపులే!

విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో ఈ అధికారి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆయన ఇచ్చిన అప్పీల్స్, బదిలీలు, ఓడీలు, లీవులను కనుక పరిశీలిస్తే నూటికి ఎనభై శాతంపైగా ముడుపులు తీసుకుని ఇచ్చినవే ఉన్నట్లు సమాచారం. వీటిలో చాలా వరకు ఖరీదైన మందు బాటిల్స్ ముట్టచెప్పినవి కూడా ఉన్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాలో ఇచ్చినన్ని ఔట్ ఆఫ్ డిజిగ్నేషన్స్ (ఓడీ)లు రాష్ట్రంలోనే మరెక్కడా లేవు. దీనిని బట్టి చూస్తే ఎంత విచ్చలవిడిగా ఓడీలు ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఓడీలపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో కొన్నింటిని తొలగించారు. ఇంకా కొన్ని యథావిధిగానే కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బస్ డిపోల్లో కూడా ఈ విధానం అడ్డగోలుగా కొనసాగుతోంది.

దుకాణాల దగ్గర దందా!

ఆసియాలోనే అతిపెద్ద బస్‌స్టేషన్ అయిన పీఎన్‌బీఎస్‌లో విచ్చలవిడిగా అవినీతి వ్యవహారాలు నడుస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా దుకాణాల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారు. బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ వాళ్లతో కూడా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రయాణికులను ఎక్కించటానికి ద్విచక్ర వాహనాలను వేసుకుని వచ్చిన వారు ఖాళీ ప్లేసులో వాహనాలు పెడితే వాటి గాలిని తీయించటం, గొలుసులతో తాళాలు వేయించటం చేస్తున్నారు. లేదంటే సున్నం జల్లిస్తున్నారు. దీంతో పాటు అనధికారికంగా వందలాది రూపాయల జరిమానాలు వేస్తున్నారు. ఇలా సంస్థకు ప్రయాణికులను దూరం చేస్తూ చెడ్డపేరు తీసుకు వస్తున్నారు. బస్టాండ్‌లో చిన్న స్టిక్కర్ అంటించుకున్నా కమర్షియల్ ప్రచారం పేరుతో వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బస్‌స్టేషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓ హోటల్ నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ బోర్డులను ఏర్పాటు చేసినా పట్టించుకోవటం లేదు. గుంటూరు ప్లాట్‌ఫామ్స్‌ను మార్చిన వ్యవహారంలో కూడా అవినీతి జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో.. ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. విజిలెన్స్ అధికారి అవినీతి వల్ల ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో పలువురు డిపో మేనేజర్లు కూడా లంచాలు తీసుకోవడంలో ముందు వరసలో ఉంటున్నట్లు సమాచారం. ఆటోనగర్, జగ్గయ్యపేట, మాచర్ల, సత్తెనపల్లి డిపోల పరిధిలో అవినీతి పతాక స్థాయిలో ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విజిలెన్స్ అధికారి తీరుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రామలింగేశ్వరనగర్ కరకట్టపై ఆగిపోయిన లోడ్‌తో ఉన్న టిప్పర్



కరకట్టకు టిప్పర్ తిప్పలు

రామలింగేశ్వరనగర్‌లో యథేచ్ఛగా ఇసుక లారీల రాకపోకలు

- కట్టపై మరమ్మతులకు గురవుతున్న టిప్పర్లు
- నిలిచిపోతున్న ట్రాఫిక్.. ఇబ్బందుల్లో వాహనదారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): యనమలకుదురు-స్క్రూబ్రిడ్జి-యనమలకుదురు మార్గంలో వెళ్లాలన్నా.. రావాలన్నా రామలింగేశ్వరనగర్ కరకట్ట ఎక్కి తీరాల్సిందే. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, అవనిగడ్డకు రాకపోకలు సాగించే వాహనాల కోసం నిర్మించిన కరకట్టపై ఇసుక టిప్పర్లు దుమారం రేపుతున్నాయి. పరిమితికి మించిన ఇసుక లోడ్‌తో వెళ్లడమే కాకుండా ఇప్పుడు ఏకంగా కట్టపై ట్రాఫిక్‌ను దారి మళ్లించే పరిస్థితిని తీసుకొస్తున్నాయి. లోడ్‌తో యనమలకుదురు వైపు మిగతా 6లో..


అడ్డుకుంటే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు

కృష్ణాజిల్లాలోని పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి 40-50 టన్నుల ఇసుకతో టిప్పర్లు కరకట్ట పైనుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో కొద్దిరోజుల పాటు ఈ రాకపోకలకు బ్రేక్‌లు పడ్డాయి. తర్వాత పరిస్థితి మామూలుగా మారింది. ఈ టిప్పర్ల కారణంగా పడవలరేవు సెంటర్‌లో తాగునీరు పైపులైన్ జాయింట్ల వద్ద నేల కుంగిపోయింది. దీనితో వీఎంసీ అధికారులు ఈ పైపులైన్ వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఇక్కడ పనులు జరుగుతున్నా ఇసుకాసురులకు మాత్రం కళ్ల ముందు డబ్బులే కనిపిస్తున్నాయి. పోలీసులు కొద్దిరోజులపాటు ఈ టిప్పర్లను ఆపడంతో కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే రంగప్రవేశం చేశారు. నేరుగా ఆయనే పోలీసులకు ఫోన్లు చేసి టిప్పర్లను ఆపొద్దని ఆదేశాలు జారీ చేసినట్టు ప్రచారం నడుస్తోంది. పైగా ఈ ఇసుకను రాజధాని నిర్మాణానికి పంపుతున్నట్టు చెబుతున్నారు. దీని ముసుగులో ఇసుక గుంటూరుకు చేరుకుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ టిప్పర్ల వల్ల ఏ క్షణానైనా తమ ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని పెదపులిపాక వద్ద ప్రజలు ఆందోళన చేశారు.

మరో రూ.69 వేల కోట్ల సమీకరణ!

రాజధాని అమరావతి కోసం సీఆర్‌డీఏ ప్రణాళిక

ముందుకొస్తున్న జాతీయ బ్యాంకుల కన్సార్టియం



- సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో బ్యాంకర్లతో చర్చలు
- ఇప్పటికే రూ.31 వేల కోట్ల మేర సంస్థల నుంచి సమీకరణ
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూల నుంచి..
- తాజాగా బ్యాంకుల కన్సార్టియం నుంచి తీసుకోవాలని నిర్ణయం
- భూముల ధరలు పెరగగానే విక్రయించి బ్యాంకులకు చెల్లింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని నిర్మాణానికి మరో రూ.69 వేల కోట్ల మేర నిధులను సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల నుంచి సీఆర్‌డీఏ రూ.31 వేల కోట్లను రుణాలుగా పొందిన సంగతి తెలిసిందే. అమరావతి విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో మరిన్ని ప్రాజెక్టులకు సిద్ధమవుతున్న దశలో నిధుల అవసరం మరింతగా ఏర్పడుతోంది. దీనికోసం మరో రూ.69 వేల కోట్ల నిధులను సమీకరించేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేస్తోంది. విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో పలు జాతీయ, ప్రైవేటు బ్యాంకులతో సీఆర్‌డీఏ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే పలు జాతీయ బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. కొన్ని జాతీయ బ్యాంకులు కన్సార్టియంగా ఏర్పడి రుణం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే అంగీకారం మిగతా 6లో..

చెత్త నుంచి సంపద!

జిల్లావ్యాప్తంగా 286 గ్రామాల్లో 264 కేంద్రాల ఏర్పాటు

45 రోజుల్లో 330 టన్నుల కంపోస్టు ఎరువు తయారీ

- వారం వారం కలెక్టరేట్‌లో విక్రయాలు.. ఆసక్తి చూపుతున్న రైతులు
- గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం రాకతో కొత్త ఉత్సాహంతో ముందుకు

ఆంధ్రజ్యోతి ఫోకస్



తిరువూరు మండలం లక్ష్మీపురంలో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్న కార్మికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /మైలవరం/గొల్లపూడి /విస్సన్నపేట/ వత్సవాయి/ వీరులపాడు/ ఏకొండూరు): చెత్త నుంచి కూడా.. సంపదను సృష్టిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాశనం చేశారు. ఐదేళ్లుగా నిరుపయోగంగా, మందుబాబులకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలిచిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఇప్పుడు మళ్లీ పునఃప్రారంభమయ్యాయి. చెత్త నుంచి సంపదను సృష్టిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవతో ఎన్టీఆర్ జిల్లాలో గ్రామ పంచాయతీ అధికారులు ముమ్మరంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు శ్రీకారం చుట్టారు.

1,100 మంది గ్రీన్ అంబాసిడర్లు

జిల్లాలో మొత్తం 286 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 264 గ్రామ పంచాయితీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చాలా వరకు వీటిని నిర్మించటం జరిగింది. ఇన్నాళ్లూ ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు ఉంటే నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,100 మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూడా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు డీపీవో లావణ్య కుమారి వీటిపై ప్రధానంగా దృష్టి సారించారు. బ్యాలెన్స్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయటంతో 95 శాతం పైగా సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. మరో 22 గ్రామ పంచాయతీల్లో మిగతా 6లో..

కలెక్టరేట్‌కు వర్మీ కంపోస్టు

ఇలా తయారు చేసిన వర్మీ కంపోస్టును ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సందర్భంగా పంచాయతీ అధికారులు విక్రయానికి పెడుతున్నారు. ఇలా ప్రతి వారం దాదాపుగా 300 కేజీల వరకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇక్కడ వచ్చే సందర్శకులు సుమారు 100 కేజీలకు పైగా కొనుగోలు చేస్తున్నారు. ఈ కంపోస్టు కోసం రైతుల నుంచి ఎక్కువగా డిమాండ్ ఉంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా పంచాయతీ అధికారులు కూడా పెద్ద ఎత్తున బెడ్లను విస్తరించాలని భావిస్తున్నారు. రానున్న రోజుల్లో గ్రీన్ అంబాసిడర్లను గణనీయంగా పెంచటంతో పాటుగా పంచాయతీల పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం, రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాగించే అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో బావ, బావమరిది మృతి

గుర్తుతెలియని వాహనం ఢీకొని బావ దుర్మరణం

- బావ మృతదేహం వద్దకెళ్తుండగా బావమరిదికి రోడ్డు ప్రమాదం
- ఒకేరోజు ఇద్దర్ని కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- మాచవరంలో విషాద ఛాయలు



సతీష్ మృతదేహం

విద్యాధరపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో బావ, బావమరిది మృతి చెందిన హృదయ విదారక ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... మాచవరం ఎస్ఆర్ఆర్ కాలేజీ ఎదురుగా కొండపైన పడాల లచ్చయ్య కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇతని పెద్ద కుమార్తె గౌరమ్మ, ఆమె భర్త భాస్కరరావు(45) కూడా లచ్చయ్య వద్దే ఉంటున్నారు. భాస్కరరావు మోటార్ సైకిల్‌పై చీపురులు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భాస్కరరావు తన మోటార్ సైకిల్‌పై చీపురులు అమ్మటానికి నందిగామ బయలుదేరారు. గొల్లపూడి వద్ద అతనికి రోడ్డు మీద అడ్డంగా శునకం రావటంతో దానిని తప్పించబోయి మోటార్ సైకిల్ అదుపు తప్పి కిందపడ్డాడు. అతని వెనుక అతివేగంగా ప్రయాణించిన గుర్తు మిగతా 6లో..

ఘనంగా ద్వాదశ ప్రదక్షిణలు



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ద్వాదశ ప్రదక్షిణలు ఘనంగా నిర్వహించారు. గంగా సమేత దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులతో అర్చకులు, అధికారులు, భక్తులు 12 సార్లు ప్రదక్షిణలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో పవళింపు సేవ కార్యక్రమం జరిగింది.



మైల స్నానం చేద్దామని వెళుతూ.. మృత్యు ఒడికి!

- రోడ్డు ప్రమాదంలో తల్లి దుర్మరణం..
- కుమారుడికి తీవ్ర గాయాలు
- రామవరప్పాడు రింగ్ వద్ద ఘటన

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

6లో



6లో

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆదర్శప్రాయుడు బీఆర్ అంబేడ్కర్

వాడవాడలా 134వ జయంతి ఉత్సవాలు

» మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సంస్కర్త, విద్యావేత్త, న్యాయవేత్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, జాతి గర్వించదగ్గ మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పాలన, పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన విలువలు, సూత్రాలు ముఖ్య కారణమయ్యాయన్నారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే మన రాజ్యాంగం భిన్నమైనదన్నారు. సామాజిక, ఆర్థిక వేత్తగా, న్యాయ నిపుణుడిగా దేశానికి ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. మహిళల హక్కులు, సాధికారిత, విద్యపై ఆయనకు ఉన్న అవగాహన ఎంతో కీలకమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను భావితరాలు గుర్తుంచుకునేలా పంచతీర్థాల పేరుతో ఐదు ప్రత్యేక స్మృతి వనాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బలహీన వర్గాల జనాభాకు అండగా నిలిచేందుకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అన్నారు. అంబేడ్కర్ రచనలను భవిష్యత్తుతరాలకు ఆదర్శంగా నిలిచేలా వాటిని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, దళిత నాయకులు జి.కిషోర్ కుమార్, ఎం.క్రాంతికుమార్, ఎన్.బాలాజీ, బి.దేవదాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం స్ఫూర్తి దాయకం : నెట్టెం రఘురాం

ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ 134వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం నెట్టెం మాట్లాడుతూ, కుల, మత, వర్గ విచక్షణ లేని ఒక సమాజాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సూత్రాల ప్రాతిపదికన రచించిన అంబేడ్కర్ రాజ్యాంగం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. జాతి రత్నాలలో ఒకరు మహాత్మా గాంధీ అయితే, మరొకరు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అకుంఠితమైన దేశభక్తితో అంబేడ్కర్ జాతి ఐక్యతకు దోహదం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు గన్నే ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి

సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద...

కలెక్టరేట్ : విజయవాడ స్వరాజ్య మైదాన్ (అంబేడ్కర్ స్మృతివనం)లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కలెక్టర్ లక్ష్మీశ పూలమాలలు వుంచి ఘనంగా నివాళులర్పించారు. బాబాసాహెబ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనల స్ఫూర్తితో రాష్ట్రం, దేశాభివృద్ధికి సమిష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, కమిషనర్ డి.చంద్రశేఖర్, దళిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్‌లో సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాతంత్రవాదులు ఏకం కావాలి : సీపీఐ రామకృష్ణ

భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు ఇటీవల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు అని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాతంత్ర వాదులు ఐక్యంగా పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు సమర్పించిన ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నేడు పెను ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు ఇటీవల ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లు నిదర్శనమన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేకునేందుకు, లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య వాదులు ప్రతిజ్ఞ చేయాలని, అదే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, బీజేపీకి 400పార్లమెంట్ స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామంటూ చెప్పిన అంశాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ రామకృష్ణ



రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాద దృశ్యం

మైల స్నానం చేద్దామని వెళుతూ.. మృత్యు ఒడికి!

» రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు

గుణదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మైలు స్నానం చేద్దామని ఇంటి నుంచి బయలు దేరిన కొద్ది క్షణాలకే.. రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా.. కుమారుడు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన రామవరప్పాడు రింగ్ వద్ద సోమవారం జరిగింది. కరెన్సీనగర్‌లో నివాసం ఉంటున్న బోదుల భవాని(47) గృహిణి, కుమారుడు సాయి అరవింద్(20) ప్రభుత్వ ఆసుపత్రి పెస్ట్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు బాయ్‌గా పనిచేస్తున్నాడు. సాయి అరవింద్ పెదనాన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో దశదిన కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సాయి అరవింద్ తల్లి భవానీతో కలిసి సోమవారం మైలస్నానం చేసేందుకు కరెన్సీనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై కృష్ణానదికి బయలుదేరారు. రామవరప్పాడు రింగ్ వద్దకు రాగానే ముందు వెళుతున్న వేరొక బైక్ తగలడంతో వీరి వాహనం అదుపుతప్పింది. వెనుక కూర్చున తల్లి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోవడంతో అదే సమయంలో గన్నవరం నుంచి వస్తున్న లారీ చక్రాలు వీరిపై నుంచి వెళ్లాయి. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా.. సాయి అరవింద్ రెండు కాళ్లు పూర్తిగా నుజ్జు అయ్యాయి. తీవ్ర గాయాలతో సాయి అరవింద్ అమ్మా.. అమ్మా.. అని పిలవడం చూపరులకు కంటతడిపెట్టించింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్ సిబ్బందితో కలిసి భవాని మృతదేహాన్ని మార్చురీకి, సాయిఅరవింద్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య!

ఆటోనగర్ : ఇంటర్ ఫస్టియర్‌లో తక్కువ మార్కులు వచ్చాయనే మనస్తాపంతో ఓ విద్యార్థి ఉరేసుకుని మృతిచెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిడమానూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చీరాల మండలం తులసీనగర్‌కు చెందిన మంచాల కృషల్‌రెడ్డి (17) ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రికి ఫోన్‌చేసి తెలిపాడు. ఆదివారం రాత్రి తండ్రికి ఫోన్ చేశాడు. బెటర్‌మెంట్ కట్టి మంచి మార్కులు తెచ్చుకుంటానని వివరించాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫోన్‌చేసి కృషల్‌రెడ్డి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయినట్టు తెలిపారు. తండ్రి వీరా వర్మరెడ్డి ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్‌ది మహోన్నత వ్యక్తిత్వం : మంత్రి సంధ్యారాణి

ఇబ్రహీంపట్నం : ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అందరూ సమానంగా ఉండాలని, అంటరానితనంతో పాటు, రెండు గ్లాసుల పద్ధతి ఉండకూడదని భావించిన మహోన్నత వ్యక్తిత్వం గలిగిన వ్యక్తి భారతరత్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా తొలుత మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆమె ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొండపల్లి గిరిజన సంక్షేమ పాఠశాల, వసతి గృహంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బాగా చదివితే వారికి గౌరవం ఉంటుందన్నారు. తానుకూడా గిరిజన స్కూల్లో, హాస్టల్లో చదివి ఈ స్థాయికి వచ్చినట్టు చెప్పారు. ఏపీలో 42 వసతి గృహాలకు రూ.156 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జి.కొండూరు మండలం వెల్లటూరులో మంచి వసతులతో భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యా వ్యవస్థలో పెను మార్పులకు మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులతో కలిసి మంత్రి ఎమ్మెల్యేలు ధింసా నృత్యం చేశారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి పక్కన ఎమ్మెల్యే వసంత, జంపాల తదితరులు



విజేత శ్రీకాకుళం జట్టుతో నిర్వాహకులు

యూనిటీ కప్ విజేత శ్రీకాకుళం జట్టు

పెనమలూరు : ఆలిండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ 80వ వార్షికోత్సవం సందర్భంగా యనమలకుదురులోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ గ్రౌండ్‌లో కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఏఐబీఓఏ జట్టుపై విజయం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు 12ఓవర్లలో 123పరుగులు చేయగా ఏఐబీఓఏ జట్టు 12 ఓవర్లలో 88పరుగులు మాత్రమే చేసింది. ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ బీఎస్ రాంబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎల్లారావ్, వైఎస్‌రావు, కేడీబీఈసీ సెక్రటరీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అఖిలభారత కిసాన్ జాతీయ మహాసభలకు వెళుతున్న ఏపీ ప్రతినిధులు

అఖిల భారత కిసాన్ మహాసభలకు ఏపీ ప్రతినిధులు

వన్‌టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని నాగపట్నంలో మంగళ, బుధ, గురువారాల్లో జరగనున్న అఖిలభారత కిసాన్ సభ 30వ జాతీయ మహాసభలకు సోమవారం రాష్ట్రం నుంచి 52మంది ప్రతినిధులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘం అధ్యక్షుడు బి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్‌లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించి తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. పంటల సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించాలని, ఇందుకు చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యలు నివారించేందుకు ఒక పర్యాయం రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం, కేంద్ర సహకార చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ భవిష్యత్తు ఉద్యమాలకు ఈ మహాసభల్లో ఒక ప్రణాళికను రూపొందించనున్నట్టు తెలిపారు.



కబడ్డీ అసోసియేషన్ సభ్యులతో శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష

క్రీడల ఖ్యాతిని పెంచేలా కృషిచేయాలి

» శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో క్రీడల ఖ్యాతిని పెంచేందుకు క్రీడాసంఘాలు కృషి చేయాలని, రాష్ట్రంలో అత్యంత ఆదరణ కలిగిన కబడ్డీని బలోపేతం చేసేందుకు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు మరింత చొరవ చూపాలని శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. శాప్ కార్యాలయంలో సోమవారం కబడ్డీ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కబడ్డీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు మరింత సమర్థవంతంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. క్రీడల్లో రాజకీయ ప్రమేయం తగదని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. క్రీడాకారుల భవిష్యత్తుతో చెలగాటమాడితే చర్యలు తప్పవని, దీనికి సంబంధించి త్వరలో ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్టు తెలిపారు. హోదా కోసం కాకుండా క్రీడాకారుల భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. కేవలం అసోసియేషన్ల నిర్లక్ష్యం కారణంగానే ఆర్థికప్రోత్సాహకాల విషయంలో కబడ్డీ వెనుకంజలో ఉందన్నారు.

మరో రూ.69 వేల కోట్ల సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

తెలిపిన మేరకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కోల నుంచి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ విడుదలైంది. ఇవి కాకుండా మరో 40 వేల కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుకునేందుకు సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకులతో ప్రయత్నాలు చేస్తున్నారు.

భూముల విలువ పెరిగిన వెంటనే..

బ్యాంకుల నుంచి అదనంగా తీసుకునే రూ.69 వేల కోట్ల రుణాన్ని రాజధానిలో ప్రభుత్వం కింద ఉన్న భూముల విలువ పెరిగిన వెంటనే వాటిని విక్రయించి బ్యాంకులకు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకోవాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. రాజధాని నగరాన్ని సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అభివృద్ధి చేయాలన్నది సీఆర్‌డీఏ అభిప్రాయంగా ఉంది. రాజధాని అమరావతిని మరింత విస్తరించి సకల సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా కూడా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. రాజధాని పరిసరాల్లో ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. దీని కోసం రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కేవలం ప్రభుత్వ పాలనకే రాజధాని పరిమితం కాకుండా ఆర్థిక ప్రగతి కూడా సాధించే విధంగా ఉండాలని ప్రపంచ బ్యాంకు చేసిన సూచనను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. అందుకే మరో పది వేల ఎకరాలను భూ సమీకరణ కానీ భూ సేకరణ ద్వారా కానీ సేకరించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో ఉన్న 29 గ్రామాల్లో రూ.47 వేల కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లకు సంబంధించి చూస్తే.. అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాల్గవ తరగతి ఉద్యోగుల భవనాలను ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక సదుపాయాల కల్పన ఏడాదిన్నరలో పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు సీఆర్‌డీఏ కాలపరిమితి విధించింది. సచివాలయ టవర్స్, ఇతర భవనాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు వంటి భవనాలు మూడు సంవత్సరాల్లో పూర్తి చేసి తీరాల్సిందేనని దీనికి సంబంధించిన కార్మికులతో పాటు సామగ్రిని త్వరితగతిన సేకరించి వెంటనే రంగంలోకి దిగాలని కాంట్రాక్టు సంస్థలకు మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. రాజధాని అమరావతిలో పరిపాలనా నగర నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితులలో రాబోయే మూడు సంవత్సరాల్లో పూర్తి చేసే విధంగా పటిష్ట ప్రణాళికలను రూపొందించారు. ఈ రాజధాని పరిపాలనా నగర నిర్మాణం వచ్చే నెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఊపందుకోనుందని అధికార యంత్రాంగం చెబుతోంది.

కరకట్టకు టిప్పర్ తిప్పలు

(5వ పేజీ తరువాయి)

వెళ్తున్న టిప్పర్ ఇస్కాన్ ఆలయం దాటిన తర్వాత అడుగు భాగాన ఉండే కమాన్ విరిగిపోవడంతో కట్టపై అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరిగ్గా టిప్పర్ ఆగిపోయిన సమయానికి అవనిగడ్డ బస్సు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తుంది. దీంతో వాహనాలు అటు ఇటు వెళ్లే మార్గం లేకుండా పోయింది. స్క్రూబ్రిడ్జి వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్‌కు ఆమడ దూరంలో టిప్పర్ ఆగిపోవడంతో విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. యనమలకుదురు వైపు వాహనాలు వెళ్లకుండా బారికేడ్లను అడ్డుగా పెట్టారు. అటు వైపు వెళ్లే వాహనాలను బెంజ్‌సర్కిల్ వైపునకు మళ్లించారు. టిప్పర్ ఆగిపోయిన సమాచారాన్ని నాలుగో ట్రాఫిక్ స్టేషన్ అధికారులకు వైర్‌లెస్‌సెట్‌లో తెలియజేశారు. ఆ పోలీసులు పడవలరేవు వంతెనకు చేరుకుని యనమలకుదురు వైపు నుంచి స్క్రూబ్రిడ్జి వైపునకు వచ్చే వాహనాలను పటమటలంకలోకి మళ్లించారు. లోడ్ టిప్పర్ ఆగిపోవడంతో కరకట్టపై మళ్లింపులు తప్పలేదు. అదేవిధంగా ఉదయం కరకట్టపై ఒక టాటా ఏస్ వ్యాన్ ఆగిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

టీడీపీ నేత ఇంటిపై వైసీపీ మూక దాడి!

» అర్ధరాత్రి రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసం.. కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నేత ముఖ్య అనుచరుడు పాయకాపురానికి చెందిన నేత తన అనుచరులతో కలిసి టీడీపీ నేత ఇంటిపై దాడి చేశారు. అసభ్యకరంగా దూషిస్తూ రాళ్లు విసరడంతో ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం ప్రజాశక్తినగర్ కమ్యూనిటీ హాల్ వెనుక కోరాడ రమణ కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఇతను ప్రకాష్ నగర్‌లో వెండి పట్టీల వర్క్‌షాప్ నిర్వహిస్తూ స్థానికంగా టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మీసాల రామకృష్ణ ఇటీవల అతడికి ఫోన్ చేసి స్థానికంగా ఉంటున్న మరో టీడీపీ నేతతో తిరగవద్దని, మాట్లాడవద్దని చెప్పాడు. అవేమీ పట్టించుకోకుండా రమణ పార్టీలో తిరుగుతూ తన పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో రామకృష్ణ పది మంది అనుచరులతో కలిసి రమణ ఇంటికి వెళ్లాడు. రమణ ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. రమణ, కుటుంబసభ్యులు భయాందోళనతో ఇంటి నుంచి బయటకు వచ్చారు. దీంతో రామకృష్ణ అనుచరులు పెద్దగా కేకలు వేస్తూ అసభ్యకరంగా దూషించారు. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించగా మరింత రెచ్చిపోయారు. ఇంటి అద్దాలు పగలకొట్టంతో రమణ భార్య లక్ష్మి 100కు ఫోన్ చేసింది. దీంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. నున్న స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఆమె ఫిర్యాదు చేసింది. కోరాడ లక్ష్మి ఫిర్యాదుపై పోలీసులు తొలుత కేసు కట్టకుండా రాజీ యత్నాలు చేసినట్టు సమాచారం. అయితే రాజీ ప్రసక్తేలేదని అర్ధరాత్రి ఇంటిపైకి దాడికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి అండతో ఏం చేసినా చెల్లుబాటు అయ్యిందనే ధీమాతో రామకృష్ణ కేసు నమోదు చేయకుండా గట్టి ప్రయత్నాలు చేయగా.. అతడికి స్థానికంగా ఉన్న అధికార పార్టీలోని పలువురు నేతలు సహకారం అందించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కేసు నమోదు చేయాల్సిందేనని బాధితులు పట్టుబట్టడంతో ఎట్టకేలకు పోలీసులు రౌతు దుర్గారావు, రామకృష్ణ, మరికొందరిపై కేసు నమోదు చేశారు.



రమణ ఇంటి వద్ద గొడవపడుతున్న రామకృష్ణ, అతడి అనుచరులు

చెత్త నుంచి సంపద!

(5వ పేజీ తరువాయి)

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు స్థలాభావం ఏర్పడింది. గొల్లపూడి, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు వంటి గ్రామాల్లో స్థలం అందుబాటులో లేదు. మిగిలిన గ్రామాల్లో కూడా ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నారు.

జిల్లా అధికారుల ప్రత్యేక ప్రణాళికలు

జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన 264 గ్రామ పంచాయితీల్లో చెత్త నుంచి సంపద సృష్టి దిశగా జిల్లా అధికారులు అడుగులు వేస్తున్నారు. కనీసం రెండు బెడ్లలో అయినా వర్మీ కంపోస్టును తయారు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ ఆలోచన సత్ఫలితాలనిచ్చిందనే చెప్పాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల పరిధిలో డోర్ కలెక్షన్‌పై దృష్టి సారించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొడిచెత్తను విక్రయిస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం పరిధిలో అయితే పొడి చెత్తను గుంటూరు జిల్లాలోని జిందాల్ ప్లాంట్‌కు విక్రయిస్తున్నారు. పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలను కాంట్రాక్టు సంస్థలు, ఆర్అండ్‌బీ శాఖకు విక్రయిస్తున్నారు. తడిచెత్తను మాత్రం పూర్తిగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలోనే వినియోగిస్తున్నారు. తడి చెత్త ద్వారా కంపోస్టును చేయిస్తున్నారు. అలాగే వానపాముల ద్వారా కూడా వర్మీని తయారు చేయిస్తున్నారు. 45 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 330 టన్నుల కంపోస్టు ఎరువును తయారు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో ఇంకా పెద్ద ఎత్తున బెడ్లలో కంపోస్టును తయారు చేయగలిగితే వెయ్యి టన్నుల కంపోస్టును తయారు చేయగలమని పంచాయతీ అధికారులు అంచనా వేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో బావ, బావమరిది మృతి

(5వ పేజీ తరువాయి)

తెలియని వాహనం అతనిని ఢీకొని కొద్దిదూరం లాక్కెళ్లింది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలు కావటంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాచవరంలో ఉంటున్న భాస్కరరావు బావమరిది పడాల సతీష్ (21) తన బైక్‌పై గొల్లపూడి బయలుదేరాడు. భవానీపురం వైపు కనకదుర్గమ్మ బ్రిడ్జి దిగుతుండగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. సతీష్ తండ్రి లచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. మృతుడు సతీష్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఒకే కుటుంబంలో ఒకే రోజు ఇద్దరు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

కేరళలో సత్తాచాటిన నగర స్విమ్మర్లు

విజయవాడ స్పోర్ట్స్: ఇటీవల కేరళ ఆళువ ప్రాంతంలో జరిగిన కొచ్చి స్విమ్‌థాన్ జాతీయ స్థాయి ఈత పోటీల్లో మన రాష్ట్రం నుంచి అవార ఈతశిక్షణ - ప్రాణరక్షణ అకాడమీలో శిక్షితులైన స్విమ్మర్స్ సత్తా చాటారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 700 పైగా ఈత దిగ్గజాలతో పెరియార్ నదిలో పోటీలు నిర్వహించారు. 4 కిలోమీటర్ల పోటీల్లో నగరానికి చెందిన మహిళా ఈత శిక్షకురాలు శకుంతలాదేవి దోణవల్లి 40-59 ఏళ్ల క్యాటగిరిలో ద్వితీయస్థానంలో గెలుపొందారు. 6 కిలోమీటర్ల పోటీల్లో 60 ప్లస్ పురుషుల విభాగంలో ప్రొఫెసర్ అజయ్ కాట్రగడ్డ ప్రథమ స్థానంలో, 2 కిలోమీటర్ల పోటీల్లో ద్వితీయ స్థానంలో గెలుపొందారు.

దార్శనికుడు అంబేడ్కర్

● వాడవాడలా జయంతి వేడుకలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయన నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడని పలువురు వక్తలు కొనియాడారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు దళిత సంఘాల నేతలు నివాళులర్పించారు.



గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన టీడీపీ నేతలు

ఆటోనగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ అంబేడ్కర్ చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, ఊడిగ రాజామణి, చెన్నుపాటి గాంధీ, పరిశపోగు రాజేష్, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం వద్ద అంబేడ్కర్‌కు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ గజిటెడ్ అధికారులు

అంబేడ్కర్ స్మృతివనం వద్ద...

కలెక్టరేట్/పటమట/ప్రభుత్వాసుపత్రి: అంబేడ్కర్ స్మృతివనం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి వాణిజ్య పన్నుల శాఖ గజిటెడ్ అధికారులు నివాళులర్పించారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ గజిటెడ్ అధికారులు, నాన్ గజిటెడ్ అధికారులు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వట్టిపల్లి రామస్వామి, ఎం.వెంకటేశ్వరరావు, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.దయాసాగర్, సుమమాల జనరల్ సెక్రటరీ సాలెం రాజు, రత్నప్రదీప్, డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ సిద్దార్థ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చిత్ర, డాక్టర్ వసుంధర, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ శ్రీనివాస్, నాగరాజు తదితరులు నివాళులర్పించారు.



యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో..

కలెక్టరేట్: యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ లక్ష్మీశ విచ్చేశారు. పీ4 కార్యక్రమం గురించి వివరించారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో నందిగామలో ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేసినట్లు తెలిపారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ సీవీఎస్ భాస్కరరావు, బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎం.ఎస్.రామారావు, ఎన్టీఆర్ జిల్లా రీజనల్ హెడ్ వెంకట తిలక్, డీఆర్ హెడ్ హరీష్ బెధ, రవి రాజ్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

జనసేన జిల్లా కార్యాలయంలో..

భారతీనగర్: గురునానక్ కాలనీ సమీపంలోని జనసేన పార్టీ జిల్లా క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, పీఏసీ సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, కృష్ణపెన్నా రీజియన్ కోఆర్డినేటర్లు రావి సౌజన్య, మల్లెపు విజయలక్ష్మి, సెంట్రల్ ఆంధ్రజోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గాదిరెడ్డి అమ్ములు, కమ్మిలి రంగా తదితరులు పాల్గొన్నారు.



జనసేన తూర్పు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అమ్మిశెట్టి వాసు

జనసేన తూర్పు కార్యాలయంలో..

లబ్బీపేట: జనసేన తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ, పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బండ్రెడ్డి రవి, కామల్ల సోమవాదం, దేమకొండ మేరీ, వివేక్ తదితరులు పాల్గొన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లో గోగుల రమేష్ కార్యాలయం వద్ద, బాలస్వామి సెంటర్ వీధిలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద జయంతి వేడుకల్లో గోగుల గోపి, శాంతి బాబు, ఎస్కే జానీ, అశోక్, కొక్కిరి తిరుపతయ్య, చెన్నయ్య పాల్గొన్నారు. 17వ డివిజన్ శాంపిల్ బిల్డింగ్ లోని అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి నివాళులర్పించారు. రాణిగారితోట ప్రధాన సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 17,18 డివిజన్ల టీడీపీ నాయకులు దుర్గారావు, రంగమ్మ, ముని, కొప్పుల శ్రీనివాస్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మొగల్రాజపురంలో..

మొగల్రాజపురం: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు ఆధ్వర్యంలో 7వ డివిజన్ బందిలదొడ్డి వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించారు. జనశిక్షణా సంస్థాన్ అద్వర్యంలో కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ ఎ.పూర్ణిమ, ప్రోగ్రాం అధికారి డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. సీపీఎం 7వ డివిజన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి స్థానిక దళిత పెద్దలు పరసారాజ భోజి , రాజకీయ విశ్లేషకులు చెవుల కృష్ణాంజనేయులు నివాళులర్పించారు. సీపీఎం తూర్పు నగర కమిటీ సభ్యులు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



7వ డివిజన్‌లో బందిలదొడ్డి వద్ద మాలమహానాడు అధ్వర్యంలో అంబేడ్కర్‌కు నేతల నివాళి



ఏఆర్ గ్రౌండ్స్‌లో శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్న సంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా ముగిసిన నవమి ఉత్సవాలు

గుణదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ గ్రౌండ్స్‌లో ఈనెల 6వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. నవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామరాజ్యం రావాలంటే రాముడు ఆచరించన మార్గంలో నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అడ్మిన్ డీసీపీ సరిత అన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సంతర్పణలో సురక్ష కమిటి కన్వీనర్ కేవీ నరసయ్య, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కోదండ రామాలయంలో అన్నదానం

రాణిగారితోట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించడతో పాటు భారీగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాణిగారితోటలోని కోదండరామాలయంలో సోమవారం నిర్వహించిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. భారీగా భక్తులు పాల్గొని అన ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, శ్రీను, బాలయ్య వేముల దుర్గారావు, కొప్పుల శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, డప్పుకొట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి భజన, పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అయ్యప్ప స్వామి పూజ

కృష్ణలంక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో శరత్ గురుస్వామి, ఎన్.సుబ్బారావు గురుస్వాముల శిష్యబృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. సుబ్బారావు గురుస్వామి శిష్యులు 43వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు దీపారాధన, 9.30 గంటలకు పడిపాట నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు పూజలో, భజనలో పాల్గొని స్వామి గీతాలు ఆలపించారు.



నూతన కార్యవర్గం

లయన్స్ డిస్ట్రిక్ట్ 316డీ నూతన కార్యవర్గం

మొగల్రాజపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా మరింత గుర్తింపు తీసుకురావాలని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. సున్నపుబట్టీల సెంటర్‌లోని అమ్మ కల్యాణ మండపంలో సోమవారం డిస్ట్రిక్ట్ 316 డీ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్‌గా వీవీపీఎస్ ఆంజనేయులు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌వీ ప్రసాద్, రెండో డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు త్వరలో అమెరికాలో జరిగే కార్యక్రమంలో లయన్స్ ఇంటర్‌నేషనల్ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన చెప్పారు. జిల్లా పాస్ట్ గవర్నర్లు మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీశాంతి, క్లబ్ సభ్యులు శంకర గుప్తా, సుంకర కృష్ణ, వివిధ క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దారం నవీన్ తదితరులు

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

రాణిగారితోట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. ఈ పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు మొదటి స్థానం, కృష్ణాజిల్లా ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ఎన్టీఆర్ జిల్లా ప్రథమ, గుంటూరు ద్వితీయ, కాకినాడ తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. వ్యక్తిగత బాలుర విభాగంలో అనంతపురం, ఎన్టీఆర్, నెల్లూరు, బాలికల విభాగంలో ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలు వరుస స్థానాల్లో విజయాలు సాధించాయి. అనంతరం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఛైర్మన్ దారం నవీన్ బహుమతులు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మధురానగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సెక్షన్ జూబ్లీ ఇండోర్ ఉపకేంద్రం 11 కేవీ ఫీడర్, 33 కేవీ ఎంజీ ఇండోర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం గోపాల్‌రెడ్డి రోడ్డు, రెడ్ సర్కిల్, గిరిపురం, మధుగార్డెన్, విగ్నేష్ హాస్పటల్, రామశాస్త్రి వీధి, శిఖామణి సెంటర్, బ్లోసం హాస్పిటల్, బ్లెస్సింగ్ చర్చ్, వాటర్ ట్యాంకు రోడ్డు, నెహ్రూనగర్, కనుమూరి దేవానందం వీధి, జయరాజు వీధి ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగం తెలుసుకోవాలి

మొగల్రాజపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపౌరుడు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పీబీ సిద్ధార్థ కళాశాలలో జనసేవ సొసైటీ అధ్వర్యంలో యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో సుజనా చౌదరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సీనియర్ నాయకులు వామరాజు సత్యమూర్తి, కిలారి దిలీప్ పాల్గొన్నారు.



పీబీ సిద్ధార్థ కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి



మొదలైన డ్రెయినేజీ నిర్మాణం

ఎట్టకేలకు దర్శిపేట డ్రెయినేజీ పనులకు మోక్షం

ఆంధ్రజ్యోతి-పటమట: ఎట్టకేలకు దర్శిపేట అంబేడ్కర్‌నగర్ డ్రెయినేజీ సమస్య తీరబోతోంది. పూజితా అపార్ట్‌మెంట్ నుంచి చేపల మార్కెట్ పుట్ట రోడ్డు వరకు చేపట్టిన ఐదడుగుల డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అడ్డుగా ఉన్న బడ్డీ కొట్లను తొలగిస్తూ నిర్మాణ పనులు ముందుకు సాగిస్తున్నారు. నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్‌శాఖకు లేఖ రాసినట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. బెంజ్ సర్కిల్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, పంట కాలువ రోడ్డు నుంచి వచ్చే డ్రెయినేజీ దర్శిపేట జంక్షన్ నుంచి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వెనుక నుంచి ఎస్ఎస్ఎం స్కూల్ మీదుగా అంబేడ్కర్ నగర్ వాసుల ఇళ్ల మధ్య నుంచి ఓపెన్ డ్రెయినేజీగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ బందరు కాలువలో కలుస్తోంది. ఈప్రాంత ప్రజలు తీవ్ర దుర్గంధంతో చాలా ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో పూడిక పనులు చేపట్టేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చేది. ఈడ్రెయినేజీ నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వంలో బడ్జెట్ కేటాయించినా స్థానిక భవన యజమానులు అభ్యంతరాలతో నిర్మాణంలో తీవ్ర జాప్యమైంది. ఈప్రాంత వాసులు సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన చొరవతో పెరిగిన ధరల ప్రకారం అంచనాలను సవరించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు.

60 శాతం మురుగు ఈ డ్రెయినేజీ ద్వారానే..

ఈ డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే 60 శాతం మురుగు ఈ డ్రెయినేజీ ద్వారానే బయటకు వెళుతుంది. వేసవిలో డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసి పుట్టరోడ్డు డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్‌కు అనుసంధానం చేస్తాం. **- జశ్వంత్, వీఎంసీ, ఇంజనీరింగ్ ఏఈ**

పశుపక్షాదుల దాహార్తిని తీర్చండి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతలకు పక్షులు, జంతువులు దాహార్తితో అల్లాడుతుంటాయని ప్రతి ఇంటి ముందు భాగంలో తొట్టెల్లో, డాబాలపై ప్లేట్లలో, చిన్న తొట్లెల్లో నీళ్లు ఉంచాలని, అది మనందరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయవాడ మినరల్ వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన బొప్పన భవకుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, సురేంద్ర, కుమార్, రాజు, కృష్ణ, హరిబాబు పాల్గొన్నారు.



ఫిష్ మార్కెట్ వద్ద డస్ట్‌బిన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

అపరిశుభ్రంగా..

- చేపల మార్కెట్ పరిసరాలు
- డస్ట్‌బిన్‌లో పేరుకుపోయిన చెత్త
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- డస్ట్‌బిన్లు పెంచాలంటూ వినతి

ఆంధ్రజ్యోతి-బెంజిసర్కిల్: నగరపాలక సంస్థ తొమ్మిదో డివిజన్ పటమటలంకలోని చేపల మార్కెట్ వద్ద డస్ట్‌బిన్‌లో చెత్తచెదారం పేరుకుపోయి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ ఉన్న 3 డస్ట్ బిన్లు చెత్తతో నిండిపోవడంతో వెలుపలకు కూడా చెత్త వచ్చి పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఈచెత్త గాలికి మార్కెట్‌లోకి వెళుతుండడంతో అక్కడ కూడా అపరిశుభ్రత తాండవిస్తోంది. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో మరికొన్ని డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి రోజూ చెత్తను తొలగించేలా చూడాలని, శానిటేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్ర్కిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గాంధీనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నగర సమితి ఆధ్వర్యంలో 'నిరుద్యోగ సమస్య-యువత ముందున్న సవాళ్లు' అనే అంశంపై స్థానిక దాసరిభవన్‌లో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా నేటికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, మెగా డీఎస్సీ పేపర్లకే పరిమితమైందని నెలలు గడుస్తున్నా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాలేదన్నారు. ఈ నేపథ్యంలో మే15 నుంచి 18వరకు తిరుపతిలో సంఘం 17వ జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. సంఘం నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మందగల్ల సాయికుమార్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు



ధర్నాలో పాల్గొన్న నాగేశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమస్యలు పరిష్కారించబడతాయనీ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా యూనియన్ బ్యాంక్‌లో పని చేస్తున్న టెంపరరీ, క్యాజువల్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి స్థానిక ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న టెంపరరీ ఉద్యోగులకు వేతనాలు, సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. టెంపరరీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, యూబీఈఈ యూనియన్ అధ్యక్షప్రధానకార్యదర్శులు ఎం.సాంబశివరావు, ఎన్వీ రమణ పాల్గొన్నారు.

దుర్గగుడిలో పలు పథకాలకు విరాళం



దాత మధుసూదనరావుకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు, అర్చకులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నిర్వహించే పలు పథకాలకు గుంటూరుకు చెందిన వై.మధుసూదనరావు మొత్తంగా రూ.3,15,101 విరాళంగా ఇచ్చారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆయన అధికారులను కలిసి ఈ విరాళాలను అందజేశారు. అన్నప్రసాద వితరణ పథకానికి రూ. లక్ష, బంగారు గోపుర తాపడ పథకానికి రూ.లక్ష, గో సంరక్షణ పథకానికి రూ.లక్ష, మల్లేశ్వరాలయం అభివృద్ధి పనుల నివిత్తం రూ.15,101 విరాళం ఇచ్చారు. దాతకు, కుటుంబ సభ్యులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

రైతులకు నష్టం కలిగితే సహించం

● నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను డీ ట్యాగ్ చేస్తాం ● మంత్రి నాదెండ్ల మనోహర్



నేలపై కూర్చుని రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ

గొల్లపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు కష్టం నష్టం కలిగితే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను డీ ట్యాగ్ చేస్తామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే ఇతర జిల్లాల మిల్లర్ల ద్వారా ధాన్యం సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గొల్లపూడిలోని మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి సోమవారం పరిశీలించారు. రాయనపాడు, పైడూరుపాడులో పర్యటించి ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో కనీవినీ రీతిలో సుమారు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.8,300 కోట్లతో 6 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రబీ ధాన్యం కూడా ప్రతి గింజ గిట్టుబాటు ధరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ధాన్యం డబ్బులు 24 గంటలలోపు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి నేలపై కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. రైస్ మిల్లర్లు తరుగు పేరుతో తమ నుంచి ధాన్యం లేదా సొమ్ము వసూళ్లు చేస్తున్నారని దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వివరించారు. స్పందించిన మంత్రి సోమవారం రాత్రి కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి తడిచిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో కావూరి చైతన్య, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, టీడీపీ నేతలు జంపాల సీతారామయ్య, నర్రా వాసు, నూతులపాటి వెంకటేశ్వరరావు, కాటంనేని పూర్ణచంద్రరావు, వడ్లమూడి చలపతిరావు, రంగినేని నరేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్ క్రీడల నిర్వహణకు స్పోర్ట్స్ సిటీ

● ఇబ్రహీంపట్నం మండలం జూపూడి శివారు చినలంక భూముల పరిశీలన
● రాజధానిలో పనులు వేగవంతం: మంత్రి నారాయణ



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఐలాండ్స్‌గా ఉన్న చిన్నలంక, పెద్దలంక భూముల్లో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించుకునే స్థాయిలో ఒక మంచి స్పోర్ట్ సిటీ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశతో కలిసి చినలంక భూముల్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ నిర్మించే స్పోర్ట్ సిటీ అంతర్జాతీయ క్రీడలు జరిగేలా ఉండేలా స్టాండర్డ్స్ మెయింటెన్ చేయాలని సీఎం చెప్పారన్నారు. ఇందులో భాగంగా ఇరిగేషన్, సీఆర్డీఏ డిపార్ట్‌మెంట్స్‌తో ఒక హై లెవల్ సంయుక్తంగా కమిటీ వేసి 30రోజుల్లో రిపోర్టు తీసుకుంటామన్నారు. ఎంతవరకు ఆ భూములు ఉపయోగపడతాయో స్టడీచేసి సీఎం చంద్రబాబు ఎదుట పెడతామన్నారు. వారి డైరెక్షన్ ప్రకారం ముందుకు వెళతామన్నారు. ఈ పర్యటనలో రైతులను ఆహ్వానించామన్నారు. చినలంక, పెద్దలంక రైతులు తమ భూములు కూడా తీసుకోండి పిల్లల భవిష్యత్ బాగుంటుందని ముందుకొచ్చారన్నారు. స్పోర్ట్ సిటీకి 2వేల ఎకరాల భూమి అవసరమన్నారు. అమరావతిలో పనులు వేగవంతమయ్యాయన్నారు. ప్రస్తుతం 5వేల మందితో 600 నుంచి 700 యంత్రాలు పని చేస్తున్నాయన్నారు. ఈనెలాఖరుకు పనులన్నీ కలిపి సుమారు 15వేల మంది వర్కర్లు పనిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. చినలంక మైలవరంలో, పెద్దలంక గుంటూరు జిల్లాలో ఉన్నాయన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఎలాంటి ప్రాజెక్టులు లేవని నదికి ఇవతల కూడా మంచి ప్రాజెక్టు నెలకొల్పాలని మంత్రి నారాయణను కోరినట్లు రైతులు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి స్పోర్ట్ సిటీ ఎంతగానో దోహదం చేస్తుందని అన్ని సానుకూల రిపోర్టులు వస్తే మంచి స్పోర్ట్ సిటీ నిర్మాణం ఇక్కడే చేపట్టాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజ), చెన్నుబోయిన చిట్టిబాబు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, నాదెళ్ల చెన్నకేశవరావు (కేసుబాబు), చేబ్రోలు రాజు, మైలా సైదులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి

● నాఫ్స్‌కాబ్ డైరెక్టర్ రాఘవేంద్రరావు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఐక్యంగా ఉద్యమిస్తూనే సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కార్మికులు కృషి చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్స్‌కాబ్) డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. ఏపీ సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. రాష్ట్రంలోని వివిధ సహకార బ్యాంకు చైర్మన్లు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ కేంద్ర పాలకుల నిరంకుశ విధానాల వల్ల సహకార బ్యాంకుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. విశ్రాంత ప్రభుత్వ అధికారి డీ చక్రపాణి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సహకార సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. సంఘం జాతీయ అధ్యక్షుడు బీఎస్ రాంబాబు, నేతలు చల్లా శంకర్రావు, యల్లారావు, హృదయరాజ్, ప్రవీణ్‌కుమార్ ప్రసంగించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వెలుగురి రాధాకృష్ణ, జి. రామకృష్ణ, అక్కినేని ఆంజనేయ ప్రసాద్, తోట రామారావు, జనార్ధన్ పాల్గొన్నారు.

ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఫెడరేషన్ ఏర్పాటు

ఫెడరేషన్ చైర్మన్‌గా వీ రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీ రఘురామ్, ఉపాధ్యక్షుడుగా జీ నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్ రవికుమార్, కార్యదర్శులుగా ఇదయతుల్లా, ఖాజా, కోశాధికారిగా జె. రామాంజనేయులు ఎన్నికయ్యారు.

జీవో 35ను తక్షణమే రద్దు చేయాలి

పంచాయతీరాజ్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్తాఫ్

గుణదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖ ప్రక్షాళనలో భాగంగా పదోన్నతులు కల్పించే విషయంలో సమన్యాయం పాటించకుండా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ ఈనెల 7న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసి జీవో నెంబరు 35ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.అల్తాఫ్ హుసేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం నగరంలోని మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన పరిపాలన అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 35 ప్రకారం రెండు వంతులు ఈవోఆర్డీలకు, ఒక వంతు మాత్రమే పరిపాలన అధికారులకు కేటాయించటం అన్యాయంగా పరిగణిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన అధికారుల సంఖ్యాబలం, ఈవోఆర్డీల సంఖ్యాబలం గణాంకాలను పరిగణనలోకి తీసుకుని ఏవోలకు 48 శాతం, ఈవోఆర్డీలకు 47శాతం ఇయర్ మార్క్ 2శాతంగా చేస్తూ ఏవోలను డిప్యూటీ ఎంపీడీవో (అడ్మినిస్ట్రేటివ్)గా పేరుమార్చుతూ నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎస్.కె.బాబూరావ్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, అసోసియేట్ అధ్యక్షుడు ఎం .విజయ్‌కుమార్, ట్రెజరర్ ఎస్.వి.రవికుమార్, విజయవాడ మండలపరిషత్ అధికారి పాతూరి మురళీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

కామధేను యూనిట్‌లో ఘనంగా ప్రతిష్ఠా హోమాలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ వీరవల్లి కామధేను యూనిట్‌లో ఈనెల 16న నిర్వహించనున్న దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం సాయంత్రం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం అగ్ని ప్రతిష్ఠ, చాయాధివాసం, పంచగవ్యస్నపనం, పూర్ణాహుతి, వాస్తు పూజ, వాస్తుశాంతి, జలాధివాసం, అధివాసం హోమాలను వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ధనలక్ష్మీ దంపతులు పాల్గొన్నారు. 16న దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు త్రిదండి చిన జీయర్ స్వామి మంగళవారం సాయంత్రానికి ఫ్యాక్టరీకి చేరుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను విజయ డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డీజీఎం లక్ష్మణరావు, కామధేను యూనిట్ మేనేజర్ సరిత పర్యవేక్షిస్తున్నారు.

పూజల్లో పాల్గొన్న ఎంపీ బాలశౌరి

కామధేను యూనిట్‌ను సోమవారం రాత్రి ఎంపీ వల్లభనేని బాలశౌరి సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చైర్మన్ చలసాని ఆంజనేయులతో పాటు ఎంపీ పాల్గొన్నారు. యూనియన్ డైరెక్టర్ పాలడుగు వెంకట రామ వరప్రసాద్, గొంది నరేంద్ర, కూటమి నేతలు చలమలశెట్టి రమేశ్‌బాబు, జీ ఉమావరప్రసాద్, వడ్డి శివనాగేశ్వరరావు, అహమ్మద్ ఉన్నారు.



కామధేను యూనిట్‌లో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్న చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎంపీ వల్లభనేని బాలశౌరి

'ఆటో' సుంకాల తాత్కాలిక నిలిపివేత!

(మొదటి పేజీ తరువాయి)



సుంకం విధిస్తున్నట్టు ట్రంప్ మార్చి 27న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆరోజు ఆయన.. దాన్ని శాశ్వత సుంకంగా పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు వాటి విషయంలో పునరాలోచిస్తుండడం గమనార్హం. కాగా.. ప్రతీకార సుంకాల విధింపు విషయంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. మరీ ముఖ్యంగా చైనాను అస్సలు మినహాయించబోమని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అమెరికాతో అసమతౌల్య వాణిజ్య బంధాలను నడిపే దేశాలు, ఆర్థికేతర అడ్డంకులు సృష్టించే దేశాలు ప్రతీకార సుంకాల బారి నుంచి తప్పించుకోలేవని తేల్చిచెప్పారు. ఒక్క చైనా మినహా మిగతా అన్ని దేశాలపైనా తాము విధించిన ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నామని.. అప్పటి దాకా ఆయా దేశాల ఉత్పత్తులపై 10 శాతం సుంకాలే ఉంటాయని ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. చైనాపై సుంకాల విధింపు కొనసాగితే యాపిల్ ఫోన్ల ధరలు పెరిగిపోతాయని అమెరికా ప్రజలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో.. ఆ 10 శాతం సుంకాల నుంచి కూడా స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను మినహాయిస్తున్నట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం కిందటి శుక్రవారం ఒక ప్రకటన చేసింది. ఈ ఉత్పత్తులు చైనా నుంచి వచ్చినా సరే, సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే.. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలకు సంబంధించి కిందటి శుక్రవారం తాము ప్రకటించింది పూర్తి మినహాయింపు కాదని ట్రంప్ స్పష్టం చేశారు. 145 శాతం సుంకాలకు బదులుగా.. చైనాపై విధించిన 20% ఫెంటనిల్ సుంకాలు అమలవుతాయని, ఆయా ఉత్పత్తులు ఇప్పుడు ప్రత్యేక సుంకాల జాబితాలోకి మాత్రమే మారాయని వివరణ ఇస్తూ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్టు పెట్టారు. అమెరికాలో సెమీకండక్టర్ రంగం, ఎలక్ట్రానిక్స్ సప్లై చైన్‌పై జాతీయస్థాయిలో దర్యాప్తు (నేషనల్ సెక్యూరిటీ ట్రేడ్ ఇన్వెస్టిగేషన్) ప్రారంభిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. యూఎస్ తన ఉత్పత్తులను తానే తయారుచేసుకోవాలని వ్యాఖ్యానించిన ఆయన.. ఇతర దేశాలకు.. ముఖ్యంగా వాణిజ్యపరంగా ప్రతికూలమైన చైనా వంటి దేశాలకు అమెరికా ఎప్పటికీ బందీగా ఉండబోదని తేల్చిచెప్పారు. అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ కూడా ఈ అంశంపై మాట్లాడారు. చైనా నుంచి అమెరికాకు వచ్చే క్రిటికల్ టెక్నాలజీ ఉత్పత్తులపైన, సెమీకండక్టర్లపైన వచ్చే రెండు నెలల్లో మరిన్ని సుంకాలు విధించనున్నట్టు ఆయన వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై 1-2 నెలల్లో ట్రంప్ కొత్త సుంకాలు విధిస్తారని ఆయన తెలిపారు.

ఇప్పుడేం చేద్దాం?

యూరోపియన్ యూనియన్‌పై విధించిన సుంకాలను ఎత్తేయాలంటే.. తమ వద్ద 350 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30 లక్షల కోట్లు) ఇంధనం కొనుగోలు చేయాలంటూ ట్రంప్ ఏప్రిల్ 8న తేల్చిచెప్పడంతో ఈయూ సందిగ్ధంలో పడింది. ఉక్రెయిన్‌పై దాడికి దిగిన రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించేసిన యూరప్ దేశాలు.. 2022-23 నుంచి అమెరికా ఇంధనంపై ఆధారపడ్డాయి. ఇప్పుడు ట్రంప్ దాన్ని వాణిజ్య బేరసారాలకు వాడుకునే ప్రయత్నం చేస్తుండడంతో ఆ దేశాలన్నీ మళ్లీ రష్యావైపు చూస్తున్నట్టు సమాచారం. ఉక్రెయిన్‌లో కొంతమేర శాంతి వాతావరణం నెలకొంటే తాము మళ్లీ రష్యా నుంచి ఏటా 60 నుంచి 70 బిలియన్ క్యూబిక్ మీటర్ల ఇంధనం కొనుగోలు చేయొచ్చని ఫ్రాన్స్‌కు చెందిన బహుళజాతి సంస్థ 'ఇంజీ' ఉపాధ్యక్షుడు డిడియెర్ హోలా అభిప్రాయపడ్డారు. యుద్ధానికి ముందు.. రష్యా నుంచి యూరప్ దేశాలు ఏటా 150 బిలియన్ క్యూబిక్ మీటర్ల ఇంధనాన్ని కొనుగోలు చేసేవి.

కొత్త జంటలకు వీసా.. అగ్ని పరీక్ష!



అమెరికాకు వెళ్లడం అంత ఈజీకాదు

- అగ్రరాజ్యం వ్యక్తిని పెళ్లాడినా అక్కడకు చేరేందుకు సంవత్సరాలు పట్టే అవకాశం
- ముగిసిన బైడెన్ పాలన వెసులుబాట్లు
- ట్రంప్ నేతృత్వంలో వీసాలకు కఠిన పరీక్ష

వాషింగ్టన్, ఏప్రిల్ 14: "మా అమ్మాయికి అమెరికా సంబంధం ఖాయం చేసుకున్నాం." అని మురిసిపోయే రోజులు పోయాయ్!. పెళ్లయిన వెంటనే కొత్త దంపతులను సంతోషంగా అగ్రరాజ్యానికి పంపించి ఆనందించే పరిస్థితి కూడా కనుమరుగైంది. కొత్త జంటకు గత అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో కొనసాగిన స్వల్ప పరిశీలనలు, తేలిగ్గా ఉండే ఇంటర్వ్యూలు, వెనువెంటనే ఇచ్చే అనుమతులకు కాలం చెల్లింది. ఇప్పుడంతా ట్రంప్ హయాం. వలసలపై ఉక్కుపాదం మోపుతున్న కొత్త అధ్యక్షుడు నూతన జంటల విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. దీంతో అమెరికా పౌరుడు లేదా పౌరురాలిని వివాహం చేసుకున్న వారు.. అక్కడకు చేరుకోవాలంటే.. నెలలు కాదు, ఏకంగా ఏళ్లు పట్టే పరిస్థితి ఏర్పడింది. అది కూడా.. అనేక శల్య పరీక్షలు, ఇంటర్వ్యూలూ దాటుకుని విజయం దక్కించుకుంటేనే అంటున్నారు అధికారులు.

ఏం జరిగింది?

అమెరికాలో అక్రమ వలసలు పెరిగిపోయాయని చెబుతున్న ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్.. అలాంటివారిని బలవంతంగా ఇంటికి పంపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'పెళ్లి' పేరుతో కూడా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయా? అని ఆరా తీశారు. అదేసమయంలో పెళ్లి చేసుకుని అగ్రరాజ్యానికి వస్తామన్న వారిని అన్ని కోణాల్లోనూ పరిశీలించాలని, ఇంటర్వ్యూలను కఠినతరం చేయాలని ఆదేశించారు. వాస్తవానికి ఈ విషయంలో గత అధ్యక్షుడు బైడెన్ సులభతర విధానం ప్రవేశ పెట్టినప్పటికీ ఆ గడువు ముగిసిపోయింది. దీంతో ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. అమెరికా పౌరుడు, లేదా పౌరురాలిని వివాహం చేసుకున్న వారు.. ఇంటర్వ్యూను సమర్థంగా ఎదుర్కొనేందుకు కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. వాటిని ఆధారంగా సమర్పిస్తే అధికారులు సాధ్యమైనంత వేగంగా అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో 1) పెళ్లికి సంబంధించిన డాక్యుమెంట్ 2) వివాహ ఖర్చుల రికార్డు 3) అదేవిధంగా ఇరుపక్షాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలకు సంబంధించిన కాల్ లాగ్స్ 4) జీవిత భాగస్వామి పేర తీసుకున్న బీమా వంటివి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

మీ బాత్రూంలో కిటికీలెన్ని?

కొత్త జంటల ఇంటర్వ్యూలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడిగే అవకాశం ఉన్న ప్రశ్నలను నిపుణులు ఉదహరించారు. బెడ్‌పై మీరు ఏవైపు నిద్రిస్తారు?. ముందుగా ఎవరు నిద్రలేస్తారు?. మీ బాత్‌రూంలో ఎన్ని కిటికీలు ఉన్నాయి?. మీ జీవిత భాగస్వామికి ఫుడ్ అలెర్జీ ఉందా? వంటి ప్రశ్నలు కూడా ఎదరవుతాయని ఇమ్మిగ్రేషన్ అటార్నీ శర్మ తెలిపారు.

ఎవరెవరికి ఎంతెంత సమయం?

- అమెరికా పౌరులు తమ జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసాల కోసం 'ఫాం ఐ-130' అనుమతి పొందడానికి 14 నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత 3-4 నెలలకు ఇంటర్వ్యూలు జరుగుతాయి.
- గ్రీన్ కార్డు దారులు జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసా.. 'ఎఫ్2ఏ'కు చాలా జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం 2022లో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఏం జరుగుతుంది?

- అమెరికా పౌరులను వివాహం చేసుకున్న వ్యక్తులను తొలిదశలో ఇంటర్వ్యూ చేయనున్నారు. ఇది గతంలో మాదిరిగా ఉండదు. కఠినంగా ఉంటుంది.
- వివాహిత భారత పౌరురాలు అయితే.. ఆమెను అమెరికా కాన్సులేట్ అధికారులే ఇంటర్వ్యూ చేస్తారు.
- జీవిత భాగస్వామి హెచ్-1బీ వర్క్ వీసాపై అమెరికాలో ఉంటే.. అప్పుడు మాత్రమే గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.
- గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారిని అమెరికా సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సేవల అధికారులు ఇంటర్వ్యూ చేస్తారు.
- ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు.. అన్ని పత్రాలను ముందుగానే ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. అధికారులు అడిగే ప్రశ్నలకు గతంలో మాదిరి 'తెలీదు, మరిచిపోయా'.. వంటి సమాధానాలు చెబితే వెంటనే బయటకు పంపుతారు. బ్లాక్ లిస్టులో పెడతారు.
- నకిలీ వివాహాలను పసిగట్టే విషయంలో మరింత లోతుగా పరిశీలిస్తారు. దీనికి సంబంధించి అధికారిక విధానాన్ని త్వరలోనే ప్రకటించనున్నారు.
- గ్రీన్ కార్డు ఉన్నవారు.. తమ జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసాలకు 3-4 సంవత్సరాల సమయం పడుతోంది.
- కొన్ని కొన్ని సందర్భాల్లో జీవిత భాగస్వాములను వేర్వేరుగా ఇంటర్వ్యూ చేసి.. విషయాలను సరిపోల్చుకుంటారు. తేడా వస్తే 'బ్లాకే'.

లోకం తీరు



ట్రంప్‌ను చంపేందుకు డబ్బులివ్వలేదని తల్లిదండ్రుల కాల్చివేత

- అమెరికాలో 17 ఏళ్ల బాలుడి ఘాతుకం

మాల్వౌకి, ఏప్రిల్ 14: అమెరికాలోని విస్కాన్సిన్‌లో మిల్వాకి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు నికిటా కాసప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తన తల్లి టటియానా కాసప్, సవతి తండ్రి డొనాల్డ్ మేయర్‌ను తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం కొన్ని వారాలపాటు మృతదేహాల పక్కన నివసించాడు. ఆ తర్వాత 14 వేల యూఎస్ డాలర్లు, పాస్‌పోర్టు, తన పెంపుడు కుక్కను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. టటియానా కాసప్, డొనాల్డ్ మేయర్ కొన్ని రోజులుగా కనబడడం లేదని అందిన ఫిర్యాదుతో పోలీసులు వారింటికి చేరుకొని చూడగా అక్కడ వారి మృతదేహాలు కుళ్లిన స్థితిలో కనిపించాయి. ఈ హత్యలపై విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్‌ను ఆరాధించే నికిటా.. అధ్యక్షుడు ట్రంప్ హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో గుర్తించారు. దీని కోసం తల్లిదండ్రులను నిందితుడు డబ్బు అడగ్గా దానికి వారు నిరాకరించడంతో వారిని హత్య చేశాడని తెలుసుకున్నారు.

కర్ణాటకలో కులగణన రచ్చ

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికలోని వివరాలు బయటికి రావడంతో కర్ణాటకలోని ఆధిపత్య కులాలు రగిలిపోతున్నాయి. నివేదికలోని సిఫారసుల మేరకు ప్రస్తుతం 4 శాతంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లు 8 శాతానికి పెరిగే అవకాశం ఉంది. అలాగే, బీసీలకు ప్రస్తుతం ఉన్న 32శాతం రిజర్వేషన్లు 52 శాతానికి పెరగనున్నట్టు తెలుస్తోంది. 2015లో అప్పట్లో సీఎంగా ఉన్న సిద్దరామయ్య కులగణన సర్వే చేయించారు. కులగణన నివేదికను మంత్రివర్గం శుక్రవారం స్వీకరించింది. ఈ నెల 17లోగా మంత్రులు సమగ్ర అధ్యయనం చేసి, నివేదికపై తీర్మానం చేయాల్సి ఉంది.

అమెరికాకు చైనా భారీ ఝలక్

- అరుదైన లోహాల ఎగుమతులు నిలిపివేత



వాషింగ్టన్, ఏప్రిల్ 14: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం పతాకస్థాయికి చేరింది. భూమిలో అరుదుగా లభించే అనేక మూలకాలు, లోహాలతోపాటు అయస్కాంతాల ఎగుమతులను చైనా నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లోని ఆయుధ, ఎలక్ట్రానిక్, విమాన తయారీ, సెమీకండక్టర్ కంపెనీలకు కీలకమైన విడిభాగాల కొరత ఏర్పడనుంది. చైనా ప్రభుత్వం ఎగుమతులకు సంబంధించిన నూతన నిబంధనలను రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో కార్ల నుంచి క్షిపణుల వరకు అన్ని రకాల తయారీ పరిశ్రమలకు సంబంధించిన అయస్కాంతాలు, ఇతర కీలకమైన విడిభాగాల ఎగుమతులను చైనాలోని అనేక పోర్టుల వద్ద నిలిపివేసినట్టు ది న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. నూతన నియంత్రణ వ్యవస్థ అమల్లోకి వచ్చాక అమెరికా మిలిటరీ కాంట్రాక్టర్లు సహా అనేక కంపెనీలకు సరఫరాలు శాశ్వతంగా నిలిచిపోనున్నట్టు ఆ కథనం పేర్కొంది. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో వినియోగించే 17 రకాల అరుదైన మూలకాలు, లోహాల్లో 90% వరకు చైనాయే సరఫరా చేస్తోంది. ఎలక్ట్రిక్ కార్లు, డ్రోన్లు, రోబోలు, క్షిపణులు, విమానాలు తదితరాల తయారీలో వినియోగించే అనేక రకాల ఎలక్ట్రిక్ మోటార్లలో వీటిని వినియోగిస్తారు. యుద్ధ విమానాల ఇంజన్లు, లేజర్లు, కార్ల హెడ్‌లైట్లు, కొన్ని రకాల స్పార్క్ ప్లగ్‌లు, కెపాసిటర్లు, కంప్యూటర్ చిప్‌లు, స్మార్ట్‌ఫోన్లలో వినియోగించే ఎలక్ట్రికల్ విడిభాగాల తయారీలోనూ ఈ లోహాలు అవసరం. దశాబ్దాలుగా ఈ కీలకమైన ఖనిజాల కోసం చైనాపైనే ఆధారపడుతున్న అమెరికా తయారీ పరిశ్రమలకు గడ్డు కాలం ఏర్పడనుందని విశ్లేషకులు అంటున్నారు. చైనా తాజా చర్యలు అమెరికాతోపాటు అన్ని దేశాలకూ అరుదైన లోహాల ఎగుమతులను ప్రభావితం చేయనున్నాయి. అరుదైన ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్‌పై తన ఆధిపత్యాన్ని ఒక ఆయుధంగా మలచుకునే చైనా సామర్థ్యానికి తాజా చర్యలు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.



కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నెల్లూరులో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ జరిగింది. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఒక నల్లచట్టం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిల్లును వెంటనే రద్దు చేయాలంటూ నినదించారు.

'వక్ఫ్'పై సుప్రీంలో పిటిషన్ వేశాం: వైసీపీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొత్త వక్ఫ్ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసినట్టు వైసీపీ తన 'ఎక్స్' ఖాతాలో తెలిపింది. "వక్ఫ్ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 14, 25,26లను ఉల్లంఘిస్తోంది. ప్రాథమిక హక్కులు, సమానత్వం, మత స్వేచ్ఛలకు ఆ బిల్లు వ్యతిరేకం. ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చటం వక్ఫ్ బోర్డు అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవటమే అవుతుంది" అని తమ పిటిషన్‌లో పేర్కొన్నట్టు వివరించింది.

వక్ఫ్‌బోర్డుపై వైసీపీ అసహ్యకరమైన నాటకం: విష్ణువర్ధన్ రెడ్డి

'అధికారంలో ఉండగా ఆంధ్ర అంతటా వక్ఫ్ భూములు లూటీ అయితే కళ్లు మూసుకున్న వైసీపీ ఇప్పుడు ముస్లింలకు రక్షకుడిలా నటిస్తోంది' అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీకి మైనారిటీలంటే ప్రేమ లేదు. వారిని ఓటు బ్యాంకుగానే చూస్తోంది. ఇప్పుడేమో కోర్టులను కూడా వాడుకుని తమ పాపాల్ని తొలగించుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. ఇది అసహ్యకరమైన రాజకీయ నాటకం' అని విష్ణువర్ధన్‌రెడ్డి మండిపడ్డారు.

'వక్ఫ్'కు వ్యతిరేకంగా బెంగాల్‌లో మళ్లీ హింస

కోల్‌కతా, ఏప్రిల్ 14: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింస మరో జిల్లాకూ విస్తరించింది. సోమవారం దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ కార్యకర్తలు రెచ్చిపోయారు. పోలీసులపై దాడికి దిగి ఒక బస్సును, ఇతర పోలీసు వాహనాలను తగులబెట్టారు. వాస్తవానికి వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఐఎస్ఎఫ్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ కోల్‌కతాలోని రాంలీలా మైదానంలో సోమవారం సభ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో ఐఎస్ఎఫ్ కార్యకర్తలు హింసకు దిగారు. మరోవైపు, నూతన వక్ఫ్ చట్టానికి రాజ్యాంగబద్ధత లేదంటూ సీపీఐ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కొత్త వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టులో ఇప్పటికే డజనుకుపైగా పిటిషన్లు దాఖలయ్యాయి.

బూట్లు ఇచ్చి 14 ఏళ్ల శపథాన్ని విరమింపజేసిన మోదీ

యమునానగర్, ఏప్రిల్ 14: హరియాణాలోని కైథాల్‌కు చెందిన రాంపాల్ కాశ్యప్ 14 ఏళ్ల క్రితం చేసిన ప్రతిజ్ఞను ప్రధాని నరేంద్ర మోదీ విరమింపజేశారు. ఆయనకు బూట్లు బహూకరించి ప్రతిజ్ఞను ఉపసంహరింపజేశారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యే వరకు, తాను ఆయనను కలిసే వరకు చెప్పులు వేసుకోనని రాంపాల్ శపథం చేశారు. యమునానగర్‌లో సోమవారం జరిగిన బహిరంగ సభలో ప్రధానిని కలిసే అవకాశం రాంపాల్‌కు వచ్చింది. ఆయనకు బూట్లు బహూకరించిన ప్రధాని వాటిని ధరించాలని కోరారు. మరోసారి ఇలాంటి శపథాలు చేయకూడదని హితవు చెప్పారు. రాంపాల్ అభిమానానికి వినమ్రుడయ్యానని మోదీ అన్నారు. ప్రేమ చూపించండిగానీ ఇలాంటి ప్రతిజ్ఞలు చేసి కష్టపెట్టుకోకూడదని చెప్పారు. సామాజిక సేవ, జాతి నిర్మాణానికి శక్తిని వినియోగించాలన్నారు.



నిప్పుతో చెలగాటమాడితే.. దహించి వేస్తుంది

- యూనస్‌కు షేక్ హసీనా హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: "మీరు నిప్పుతో చెలగాటమాడితే.. ఆ నిప్పే మిమ్మల్ని దహించి వేస్తుంది" అని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు యూనస్‌ను హెచ్చరించారు. తన అధికార దాహాన్ని తీర్చుకోవడం కోసం మహమ్మద్ యూనస్ విదేశీ శక్తులతో చేతులు కలిపారని, బంగ్లాదేశ్ పతనానికి కుట్ర చేశారని ఆరోపించారు. యూనస్‌ను ఆమె 'అత్యంత దురాశాపరుడైన వడ్డీవ్యాపారి'గా అభివర్ణించారు. సోమవారం హసీనా తన పార్టీ(అవామీ లీగ్) కార్యకర్తలను ఉద్దేశించి 8నిమిషాల పాటు వర్చువల్‌గా ప్రసంగించారు. యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం చరిత్రను చెరిపేస్తోందని హసీనా అన్నారు. "స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు. యూనస్ దీన్ని ఎలా సమర్థించుకుంటారు" అని ప్రశ్నించారు.

గుజరాత్ తీరంలో రూ.1,800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

అహ్మదాబాద్, ఏప్రిల్ 14: గుజరాత్ సముద్ర తీరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,800 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేశారు. అరేబియా సముద్రంలో ఈనెల 12-13 తేదీల మధ్య అర్ధరాత్రి భారత తీర రక్షక దళం(ఐసీజీ), గుజరాత్ తీవ్రవాద నిరోధక దళం సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే ఓ బోటు కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో ఐసీజీ నౌక దాన్ని వెంబడించింది. దీంతో, ఆ బోటులోని స్మగ్లర్లు డ్రగ్స్ సంచులను సముద్రంలోనే పడేసి పారిపోయారు. అధికారులు ఆ సంచులను వెలికి తీసి చూడగా అందులో 300 కిలోల మెథంఫెటమిన్ డ్రగ్స్ ఉన్నట్లు తేలింది.

బెల్జియంలో ఛోక్సీ అరెస్టు

- స్విట్జర్లాండ్‌కు పారిపోయే క్రమంలో అరెస్టు
- తమకు అప్పగించాలని భారత్ అభ్యర్థన



2021లో డొమినికాలో అరెస్టు అయినప్పుడు ఛోక్సీని కోర్టు నుంచి తీసుకువెళ్తున్న పోలీసులు (ఫైల్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు రూ.14 వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కేసులో సహ-నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ బెల్జియంలో అరెస్టయ్యారు. అతను బెల్జియంలో తలదాచుకుంటున్నాడంటూ భారత దర్యాప్తు సంస్థలు ఏడాది క్రితమే అక్కడి ప్రభుత్వానికి సమాచారం అందించాయి. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన క్రమంలో ఛోక్సీని అరెస్టు చేసినట్లు బెల్జియం పోలీసులు వెల్లడించారు. 2014-17 మధ్యకాలంలో తప్పుడు లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌వోయూ), ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్(ఎఫ్ఎల్‌సీ)లతో విడతల వారీగా పీఎన్‌బీ నుంచి రుణాలు తీసుకున్న ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ, అతని మేనమామ మెహుల్ ఛోక్సీ. 2018లో తమపై ఆరోపణలు వెల్లువెత్తగానే దేశాన్ని వీడారు. నీరవ్ మోదీ లండన్‌కు, ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు పారిపోయారు. నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో ఉండగా.. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడా పౌరసత్వం తీసుకున్నారు. వీరిద్దరినీ వెనక్కి రప్పించేందుకు భారత్ 2018 నుంచే తీవ్రంగా ప్రయత్నిస్తోంది. 2023 నవంబరులో ఛోక్సీ బెల్జియం పౌరురాలైన తన సతీమణి ప్రీతి సాయంతో.. 'ఎఫ్ రెసిడెన్సీ కార్డ్'ను పొందినట్లు భారత దర్యాప్తు సంస్థలు నిర్ధారించి, ఆ దేశానికి సమాచారం అందించాయి. అతన్ని అప్పగించాలని బెల్జియంపై ఒత్తిడి పెంచాయి. ఈ నేపథ్యంలో ఛోక్సీ.. స్విట్జర్లాండ్ పారిపోయేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే బెల్జియం పోలీసులు అతణ్ని అరెస్టు చేశారు. ఈనెల 12న ఛోక్సీని అరెస్టు చేసిన విషయాన్ని బెల్జియం పోలీసులు ధ్రువీకరించారు.

అనారోగ్య కారణాలు..

ఛోక్సీ పలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. బ్లడ్ క్యాన్సర్‌కు బెల్జియంలో చికిత్స పొందుతున్నారని సమాచారం. ఆయన ఆస్పత్రిలో ఉండగానే.. బెల్జియం పోలీసులు అరెస్టు చేశారు. అయితే.. అనారోగ్య కారణాలను ప్రస్తావిస్తూ.. ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో ఛోక్సీని తమకు అప్పగించాలని సీబీఐ, ఈడీ అధికారులు బెల్జియంను అభ్యర్థించాయి.

అప్పగింత ఎలా!

బెల్జియం-భారత్ మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం బ్రిటిష్ కాలం(1901)లోనే మొదలైంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక-1958లో దాన్ని పునరుద్ధరించారు. 2020లో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఈ ఒప్పందాన్ని కొనసాగిస్తూ.. సంతకాలు చేసింది. ఈ ఒప్పందంలోని కీలక అంశాలను బట్టి.. బెల్జియం ప్రభుత్వం ఛోక్సీని అప్పగించాల్సి ఉంటుంది. ఇరుదేశాల్లో నేరంగా పరిగణించే అంశాలు, ఆర్థిక నేరాలు, పన్ను ఎగవేత, ఆదాయానికి సంబంధించిన కేసుల్లో నిందితులను అప్పగించాలి. అదే సమయంలో.. రాజకీయ కారణాలతో అరెస్టులు ఉన్నా.. విలిటరీ సంబంధిత నేరాలైనా.. ఖైదీల అప్పగింత కుదరదు. ఈ నేపథ్యంలో ఛోక్సీ న్యాయవాదులు మానవహక్కులు, రాజకీయ వేధింపుల అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. ఛోక్సీ అప్పగింతపై భారత్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని బెల్జియం ప్రభుత్వం కూడా సోమవారం అధికారికంగా ప్రకటించడం గమనార్హం.! కాగా, ఛోక్సీని వెనక్కి రప్పిస్తామని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టంచేశారు. ఛోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేయడాన్ని భారత్ విజయంగా పేర్కొన్నారు.

2021లో డొమినికాలో అరెస్టు!

ఛోక్సీని డొమినికా పోలీసులు 2021లోనే అరెస్టు చేశారు. అప్పట్లో ఆయన ఆంటిగ్వా-బార్బుడా నుంచి క్యూబా వెళ్లే ప్రయత్నంలో అక్రమంగా డొమినికాలో ప్రవేశించడంతో అరెస్టయ్యాడు. అయితే.. అతణ్ని కిడ్నాప్ చేశారని ఛోక్సీ న్యాయవాదులు ఆరోపించారు. దీని వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందన్నారు. డొమినికా పోలీసులు అరెస్టు చేసిన సమయంలోనే.. భారత దర్యాప్తు సంస్థలు ఛోక్సీని రప్పించే ప్రయత్నం చేసినా.. అది సఫలమవ్వలేదు.

అందరూ మహిళలతో అంతరిక్ష యాత్ర

- వారిలో బెజోస్ ప్రియురాలు లౌరెన్



వాషింగ్టన్, ఏప్రిల్ 14: అంతరిక్ష పర్యాటక యాత్రలను నిర్వహించే బ్లూ ఆరిజన్ సంస్థ సోమవారం అందరూ మహిళలతో కూడిన రాకెట్‌ను రోదసీలోకి పంపించింది. అమెజాన్ సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఆధ్వర్యంలోని ఈ కంపెనీ 11వ యాత్రలో భాగంగా 'న్యూ షెపర్డ్ రాకెట్'లో ఆరుగురు మహిళలను పంపించింది. వీరిలో బెజోస్ ప్రియురాలు లౌరెన్ సాంచెజ్, పాప్ స్టార్ కేటీ పెర్రీ ఉన్నారు. రాకెట్ సిబ్బంది కూడా అందరూ మహిళలే కావడం విశేషం. పశ్చిమ టెక్సాస్‌లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8.30 గంటలకు ఈ రాకెట్ బయలుదేరింది. నిటారుగా 100 కి.మీ. (60 మైళ్లు) ప్రయాణించి భూవాతావరణం, అంతరిక్షం సరిహద్దు అయిన 'కర్మన్ రేఖ'ను దాటింది. అక్కడ గురుత్వాకర్షణ లేని శూన్య వాతావరణంలో వారంతా తేలియాడారు. తర్వాత, రాకెట్ తిరిగి భూమికి చేరుకుంది. ఈ యాత్ర మొత్తం పది నిమిషాల్లో ముగిసింది.

'గోల్కొండ బ్లూ' వజ్రం.. 430 కోట్లు!



జెనీవా, ఏప్రిల్ 14: ఒకనాటి గోల్కొండ రాజ్యంలోని వజ్రాల గనుల్లో దొరికిన అరుదైన 'గోల్కొండ బ్లూ' వజ్రం వేలానికి రానుంది. ప్రఖ్యాత క్రిస్టీస్ సంస్థ స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మే 14వ తేదీన ఈ వజ్రాన్ని విక్రయించనుంది. రాచ వారసత్వం, విభిన్నమైన నీలి రంగులో, 23.24 కేరట్ల పరిమాణంతో ఉండటంతో 'గోల్కొండ బ్లూ'కు మంచి ధర పలుకుతుందని క్రిస్టీస్ సంస్థ ప్రతినిధి రాహుల్ కడాకియా తెలిపారు. ప్రస్తుతం ఒక ఉంగరానికి అమర్చి ఉన్న ఈ వజ్రానికి రూ.300 కోట్ల నుంచి రూ.430 కోట్ల వరకు పలుకుతుందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. 'గోల్కొండ బ్లూ' వజ్రం గురించి తెలిసిన చరిత్ర ప్రకారం.. మొదట్లో అది ఇండోర్ రాజు మహారాజా యశ్వంత్‌రావు హోల్కర్-2 వద్ద ఉండేది. 1923 సమయంలో చేతికి ధరించే బ్రాస్‌లెట్‌లో ఈ వజ్రాన్ని పొదిగారు. తర్వాత ఇండోర్ పియర్స్‌గా పిలిచే మరో రెండు వజ్రాలతో కలిపి 'గోల్కొండ బ్లూ'ను మహారాణి ధరించే నెక్లెస్‌లో అమర్చారు. ఆ కాలంలో ఇండోర్‌కు వచ్చిన ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ గీసిన చిత్రంలో మహారాణి ఈ నెక్లెస్‌ను ధరించి ఉండటం గమనార్హం. 1947లో నాటి ప్రఖ్యాత ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్‌స్టన్ చేతికి 'గోల్కొండ బ్లూ' వజ్రం చేరింది. తర్వాత బరోడా మహారాజు దాన్ని కొనుగోలు చేశారు. కొంతకాలం అనంతరం మళ్లీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. తాజాగా జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్‌లో వేలం వేయనున్నారు. సాధారణంగా స్వచ్ఛమైన నీలం రంగులో ఉండే వజ్రాలకు డిమాండ్ ఎక్కువ. ఇంతకు ముందు 14.62 కేరట్ల 'ఓపెన్‌హైమర్ బ్లూ' వజ్రం ఏకంగా రూ.495 కోట్లకు అమ్ముడవడం గమనార్హం.



50ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం

ఇది 1974 టెన్త్ బ్యాచ్. కృష్ణా జిల్లా పెనమలూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వీరంతా. ఆ రోజు పది పరీక్షల తర్వాత నుంచి నేటి వరకూ దాదాపు 50 ఏళ్ల పాటు ఎక్కడెక్కడో గడిపిన వీరంతా ఇప్పుడు మళ్లీ తమ బడిలో కలుసుకున్నారు. 1974లో ఈ బడి నుంచి 90 మంది పది పరీక్షలు రాస్తే వారిలో 57 మంది ఈ ఆదివారం నాడు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సందడి చేశారు. జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. - పెనమలూరు, (ఆంధ్రజ్యోతి)

బగ్ పెట్టి బురిడీ..!



(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే.. బెట్టింగ్ ఆడేవాళ్లు, ఫ్లంటర్లు, సబ్‌బుకీలు పోలీసులకు చిక్కుతున్నప్పటికీ ప్రధాన బుకీలు మాత్రం తప్పించుకుంటున్నారు. వారికోసం పోలీసులు ఎంతగా గాలించినా ఫలితం ఉండడం లేదు. కొంతమంది బుకీలు ఇతర రాష్ట్రాలకు పారిపోతుంటే.. మరికొంత మంది దేశ సరిహద్దులు దాటేస్తున్నారు. ఇటీవల ఒక కేసులో జరిగిన పరిణామాలతో పోలీసు అధికారుల్లో 'బగ్' అనుమానం వ్యక్తమైంది. బెట్టింగ్ యాప్ సాఫ్ట్‌వేర్‌లోనే బుకీలు బగ్‌లు అమర్చుతున్నట్టు భావిస్తున్నారు. ఇలా చేయడానికి అవకాశాలున్నాయని సైబర్ నిపుణులు కూడా చెబుతున్నారు.

సమాచారం పక్కా.. అయినా ప్రధాన బుకీ మిస్..

బెట్టింగ్‌లకు సంబంధించి విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొద్దిరోజుల క్రితం ఒక ఆపరేషన్ నిర్వహించారు. విజయవాడ నుంచి పెడన వరకు ఈ బెట్టింగ్ ముఠాకు లింక్‌లు ఉన్నాయని గుర్తించారు. అవనిగడ్డకు చెందిన వైసీపీ నాయకుడి కుమారుడు పటమటలోని దర్శిపేటలో ఓ ఇంటి నుంచి బెట్టింగ్ నిర్వహిస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకున్నాక పెనమలూరులో మరో ఇద్దరు ఉన్నారని గుర్తించి వారిని కూడా అరెస్టు చేశారు. ఇలా.. వారందరినీ జీపులోకి ఎక్కించగానే వారివద్ద నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిచ్చిన సమాచారంతో అవనిగడ్డలో ఉన్న వారిని కూడా అదుపులోకి తీసుకోవడానికి వెళ్లారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత ప్రధాన బుకీ పెడనలో ఉంటాడని తేలింది. అతడు ఇంట్లోనే ఉన్నాడని నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే పెడన బయల్దేరి వెళ్లారు. మరో ఐదు నిమిషాల్లో పోలీసులు ఇంటికి చేరుకుంటారనగా ఆ ప్రధాన బుకీ అక్కడి నుంచి పరారయ్యాడు. ఎంత పకడ్బందీగా ఆపరేషన్ నిర్వహించినప్పటికీ ప్రధాన బుకీ తప్పించుకోవడంతో పోలీసులకు 'బగ్'పై అనుమానం వచ్చింది. గతంలో బుకీలు ప్లేస్టోర్‌లో ఉన్న బెట్టింగ్ యాప్‌ల ద్వారా పందేలు నిర్వహించేవారు. ఈ యాప్‌ల గుట్టు మొత్తం పోలీసులకు ఇట్టే తెలిసిపోతుండడంతో వారు రూటు మార్చారు. బెట్టింగ్ నిర్వహణ కోసం సొంతంగా యాప్‌లు తయారు చేయించుకుంటున్నారు. ఒక్కో బెట్టింగ్ బ్యాచ్ దొరికినప్పుడల్లా ఒక్కో కొత్త యాప్ పేరు వెలుగులోకి వస్తోంది. విజయవాడ పోలీసులు కొద్దిరోజుల క్రితం రెండు బెట్టింగ్ బ్యాచ్‌లకు సంకెళ్లు వేశారు. అవనిగడ్డ బ్యాచ్‌ను అరెస్టు చేసినప్పుడు వారు 'పార్కర్ ఎక్స్ఛేంజ్' యాప్ ద్వారా బెట్టింగ్ నిర్వహించినట్టు నిర్ధారణ అయింది. ఇటీవలే గన్నవరం బ్యాచ్‌ను పట్టుకున్నప్పుడు 'రాధే ఎక్స్ఛేంజ్' యాప్ పేరు వెలుగులోకి వచ్చింది.

జియో ఫెన్సింగ్ తరహాలో.. పరిధి దాటితే అలర్ట్..

విజయవాడ పోలీసులు రాత్రిపూట నిర్వహించే గస్తీకి సంబంధించి ఈ బీట్ విధానం అమలు చేస్తున్నారు. గస్తీ నిర్వహించే ప్రాంతానికి జియో ఫెన్సింగ్ చేశారు. గస్తీ పోలీసులు ఈ ప్రాంతం పరిధి దాటినా, ఆ పరిధిలోకి వెళ్లకపోయినా అధికారులకు వెంటనే అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. సిబ్బందిపై నిఘాకు అధికారులు ఈ జియో ఫెన్సింగ్‌ను ఉపయోగిస్తుంటే... బుకీలు మాత్రం పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు యాప్‌ల్లో ఈ తరహా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక ప్రధాన బుకీ యాప్‌ను రూపొందించి.. తన దిగువన ఉండే సబ్ బుకీలకు లాగిన్, పాస్‌వర్డ్ ఇస్తాడు. ఆ సబ్‌బుకీలు తమ కింద ఉండేవారికి ఇస్తారు. ఈ వ్యవస్థ ఎన్ని దశల్లో అయినా ఉంటుంది. ఇప్పటి వరకు బెట్టింగ్‌లు ఆడేవారు, వారి నుంచి డబ్బులు వసూలు చేసే ఫ్లంటర్లు, సబ్ బుకీలు మాత్రమే పోలీసులకు చిక్కారు. ప్రధాన బుకీలు చిక్కకపోవడానికి జియో ఫెన్సింగ్ వంటి నెట్‌వర్క్ కారణమని భావిస్తున్నారు. ప్రధాన బుకీకి యాప్‌లో ఎంత మంది ఆడుతున్నారు, ఎంతెంత బెట్టింగ్ పెట్టారు, ఎంతమంది సబ్‌బుకీలు ఉన్నారన్న సమాచారం ఎప్పటికప్పుడు తెలిసిపోతుంటుంది. ఎవరెవరు ఏ ప్రాంతాల్లో ఉన్నారన్న సమాచారం కూడా వారు తెలుసుకుంటున్నారు. ఈ కారణంగానే వారు పోలీసులకు చిక్కడం లేదని తెలుస్తోంది.

అకాల.. కలవరం

అనూహ్యంగా మారిపోతున్న వాతావరణం

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

చైత్రమాసం ప్రారంభానికి ముందు నుంచే మాడు పగిలే ఎండలు కాస్తున్నాయి. ఇదే సమయంలో నిమిషాల వ్యవధిలో కారుమబ్బులు కమ్ముకుని ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములు పిడుగులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఆరుబయట ప్రధానంగా పొలాల్లో పనిచేసే కూలీలు, రైతులు, పశువులు, కాపరులు పిడుగులకు మృత్యువాత పడుతున్నారు. అనూహ్యంగా మారిపోతున్న వాతావరణంతో పంట నష్టంతో పాటు ప్రాణ నష్టం వాటిల్లుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. అసాధారణ వాతావరణ మార్పులపై అందుబాటులోకి వచ్చిన 'నౌకాస్టు' విధానంలో హెచ్చరికలు జారీచేస్తున్నా ఉపశమనం లభించడం లేదు. సాధారణంగా మే నెలలో ఎండ తీవ్రతకు వాతావరణ అనిశ్చితి నెలకొని ఈదురుగాలులు వీస్తుంటాయి. పిడుగులతో వడగళ్ల వానలు కురుస్తుంటాయి. అటువంటిది గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో మార్చి, ఏప్రిల్ నెలల్లోనే అసాధారణంగా ఎండలు పెరిగి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత నెలలో దేశంలో అనేక చోట్ల 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే తీవ్రత రోజుల తరబడి కొనసాగుతూనే ఉంది. వచ్చే నెలలో కొన్నిచోట్ల 50 డిగ్రీల మార్కుకు ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వచ్చే నెలలో కురిసే అకాల వర్షాలు మరింత కలవరపెడతాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ హెచ్చరించారు. రైతులకు మరింత మెరుగైన టెక్నాలజీతో సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు.

క్యుములోనింబస్ మేఘాలు, పిడుగులు

వేసవి తీవ్రత పెరిగేకొద్దీ పొడిగాలి ఒత్తిడితో తడిగాలి పైకి లేచి క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. భూఉపరితలం నుంచి మేఘాలు పైకి వెళ్లే కొద్దీ దాంట్లో ఉష్ణోగ్రతలు తగ్గి.. ఆరు కిలోమీటర్లు దాటిన తరువాత మైనస్ డిగ్రీలు ఉంటుంది. దీంతో మేఘాల్లో మంచు గడ్డలు ఏర్పడతాయి. అలా 12 నుంచి 13 కిలోమీటర్లు ఎత్తు వరకు మేఘాల్లో మైనస్ 80 డిగ్రీలు ఉంటుంది. ఆరు కిలోమీటర్లు దాటిన తరువాత మంచు గడ్డల వల్ల మేఘాల బరువు పెరిగి, 12 నుంచి 13 కి.మీ.కు వెళ్లేసరికి బరువు భరించలేక ఆ మేఘాలు విచ్ఛిన్నమవుతాయి. దీనినే క్లౌడ్ బరస్ట్ అంటారు. ఆ క్షణాల్లో ప్రచండ వేగంతో గాలులు వీస్తాయి. అప్పుడే కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు, ఉరుములు సంభవిస్తాయి. పిడుగులు పడతాయి. ఇదంతా ఐదు నిమిషాలకు అటుఇటుగా ముగిసి భారీ వర్షం ప్రారంభమవుతుంది పైనున్న మంచుగడ్డలు కింద పడేటప్పుడు కొన్ని కరిగిపోగా మిగిలినవి వడగళ్లుగా భూమిపై పడతాయి. అంత వేగంగా జరిగే ప్రక్రియలో ప్రతిదీ అత్యంత వేగంగానూ, ప్రమాదకరంగా ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. ప్రస్తుతం ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా మేఘాల తీవ్రతను గుర్తిస్తున్నారు. క్యుములోనింబస్ మేఘాలు ఉధృతంగా ఉన్నప్పుడు ప్రజలు ఆరుబయట సంచరించవద్దని హెచ్చరికలు చేస్తున్నారు. దీనికి సంబంధించి భారత వాతావరణ శాఖ నౌకాస్టు విధానం కొంతకాలం క్రితమే అందుబాటులోకి తెచ్చింది. దేశంలో ఏఏ ప్రాంతాల్లో ప్రతిరోజు పిడుగులు, ఈదురుగాలులు, వడగళ్లవానలు పడతాయన్నది ఉపగ్రహ ఛాయాచిత్రం ద్వారా తెలుసుకుని వెంటనే రాష్ట్రాలవిపత్తుల నిర్వహణ సంస్థకు పంపిస్తారు. సమాచారం అందుకున్న కొద్ది నిమిషాల్లో ప్రజల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వెళుతున్నాయి.

ఎండ, వాన తీవ్రత పెరుగుతుంది

» ఆచార్య భానుకుమార్, ఏయూ వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు

గత నెల నుంచే పలుచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. వచ్చే నెలలో కొన్ని చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత 50 డిగ్రీల మార్కు దాటుతుంది. గాలిలో కార్బన్ డయాక్సైడ్, మిథేన్, తేమ శాతం పెరగడంతో వాతావరణంలో అసాధారణ మార్పులు వచ్చాయి. దీంతో ఎండలు పెరగడం, మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకుని వానలు భారీ విధ్వంసం సృష్టించడం జరుగుతోంది. భవిష్యత్తులో అకాల వర్షాలు, పెనుగాలుల విధ్వంసం పెరిగే అవకాశం ఉన్నందున రైతులకు మరింత మెరుగైన టెక్నాలజీతో సమాచారం అందించేందుకు ప్రభుత్వం రూ. 2 వేల కోట్లతో రాడార్లు ఏర్పాటు చేస్తోంది.

5రోజులు ఈదురుగాలులతో వర్షాలు

» కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత

విశాఖపట్నం, అమరావతి, ఏలూరు/కైకలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్, విదర్భ, కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. దీంతో వాతావరణ అనిశ్చితి నెలకొని సోమవారం రాయలసీమ, కోస్తాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతున్నాయి. రానున్న ఐదు రోజుల వరకు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులు, గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతుందని పేర్కొంది.

ఇంటర్‌లో 'ప్రభుత్వ' టాపర్లకు నేడు సన్మానం

» నేడు సన్మానించనున్న మంత్రి లోకేశ్

» 52 మందికి లోకేశ్ చేతుల మీదుగా మెడల్స్, ల్యాప్‌ట్యాప్‌లు

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీల్లో రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రభుత్వం సన్మానించనుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో వారికి ల్యాప్‌ట్యాప్‌లు, మెడల్స్, సన్మాన పత్రాలు అందజేయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 29 మంది, కేజీబీవీల్లో ఏడుగురు, ఏపీఆర్‌జేసీల్లో ఏడుగురు, మోడల్ స్కూల్స్‌లో ఆరుగురు, హైస్కూల్ ప్లస్‌లలో ముగ్గురు విద్యార్థులు చొప్పున మొత్తం 52 మందికి సన్మానం చేయనున్నారు. వీరిలో ఆరుగురు విభిన్న ప్రతిభావంతులున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మంత్రి లోకేశ్ మాట్లాడనున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కాలేజీల్లోనూ ఉత్తమ ఫలితాలు వచ్చాయి.

ఉన్నత విద్యామండలిలో మరింత పారదర్శకత

» 'ఫైల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' ప్రారంభం

» కార్యాలయానికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్థితి తెలుసుకొనే అవకాశం

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో పారదర్శకత, సమర్థత పెంచే ఉద్దేశంతో ఉన్నత విద్యామండలి ఫైల్ ఇన్ఫర్మేషన్ స్టేటస్ సిస్టమ్‌ను ప్రారంభించింది. మండలి చైర్మన్ కె.మధుమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ డి.చక్రపాణి సోమవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో దీన్ని ప్రారంభించారు. దీనివల్ల విద్యాసంస్థలు, విద్యార్థులు ఉన్నత విద్యామండలికి పెట్టుకున్న దరఖాస్తుల స్థితిని ఆన్‌లైన్‌లోనే చూసుకోవచ్చని, ఇందుకోసం కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. తమ దరఖాస్తుల స్థితిని తెలుసుకొనేందుకు ప్రస్తుతం దూరప్రాంతాల నుంచి కూడా అనేక మంది ఇక్కడకు వస్తున్నారని, దానివల్ల వ్యయప్రయాస పెరుగుతోందన్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలు ఐబీఎం, టీసీఎస్, గూగుల్ లాంటి సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరుచుకుని క్వాంటమ్ టెక్నాలజీలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని చైర్మన్ కోరారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఉన్నత విద్యామండలి అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో మండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం అవసరం

» నియామకాల్లో పారదర్శకత కూడా ముఖ్యం

» ఇందుకోసం సమగ్ర చట్టం రూపొందించాలి

» ఏబీఏపీ కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుతూనే ఉన్నత న్యాయవ్యవస్థలో నాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయమూర్తుల నడవడిక పర్యవేక్షణకు సమగ్రంగా ఓ చట్టాన్ని తీసుకురావాలని అఖిల భారతీయ అధివక్త పరిషత్(ఏబీఏపీ) డిమాండ్ చేసింది. కొత్త చట్టం అమల్లోకి వచ్చేంతవరకు ప్రస్తుతం అనుసరిస్తున్న కొలీజియం విధానంలోనే మరింత పారదర్శకంగా ఉన్నత న్యాయవ్యవస్థలో నియామకాలు జరపాలని సుప్రీం కోర్టును కోరింది. ఈమేరకు గుంటూరు జిల్లా, చిన్నకాకానిలో ఈ నెల 12, 13వ తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు చేసినట్లు ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి సోమవారం తెలిపారు. అండమాన్ నికోబార్‌తో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 175మంది ప్రతినిధులు, ఏపీకి చెందిన పలువురు న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తీర్మానాల్లో ముఖ్యమైనవి... ప్రస్తుతం పనిచేస్తున్న న్యాయమూర్తుల విషయంలో జవాబుదారీతనం, కోర్టుల నిర్వహణను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, ప్రఖ్యాత వ్యక్తులతో శాశ్వత కమిటీ వేయాలి. ఈ ఏడాది జూన్ 2025 నాటికి కమిటీ ఏర్పాటు చేయడం సాధ్యంకాకపోతే కొత్తం చట్టం అమల్లోకి వచ్చేవరకు ఫిర్యాదుల స్వీకరించడంతో పాటు విచారణ జరిపేందుకు లోక్‌పాల్‌కు అధికారం కల్పించాలి. హైకోర్టు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు హైకోర్టు, ఆయా రాష్ట్రాల్లోని సబార్డినేట్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తుంటే సంబంధిత జడ్జీలను అక్కడ నుంచి బదిలీ చేయాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ చేసేంతవరకు వారి కుటుంబ సభ్యులు అక్కడ ప్రాక్టీస్ చేయకూడదు. పదవీ విరమణ తర్వాత వివిధ నియమకాలు, ఆర్బిట్రేటర్‌గా నియమితులయ్యేందుకు కనీసం మూడేళ్ల సమయం ఉండాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు ఒకేలా ఉండాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను ఏటా సంబంధిత కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. హైకోర్టులో ప్రతి ముగ్గురు న్యాయమూర్తుల్లో ఒకరు ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉండాలి. జస్టిస్ వెంకటాచలయ్య హయాంలో ప్రవేశపెట్టిన విధానాన్ని ప్రస్తుతం అమలు చేయాలి.

వాదన వినకుండా డీలర్‌షిప్ రద్దు సరికాదు

» స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణం డీలర్‌షిప్(ఫెయిర్ షాప్) రద్దుకు ముందు సంబంధిత డీలర్ వాదన వినాలని, కనీస విచారణ జరపాల్సిన అవసరం ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి విచారణ జరపకుండా సహజన్యాయసూత్రాలకు విరుద్ధంగా ఓ మహిళకు చెందిన చౌక ధరల దుకాణం డీలర్ షిప్‌ను రద్దు చేస్తూ చిత్తూరుజిల్లా అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పిచ్చింది. మదనపల్లి చౌక ధరల దుకాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలతో తహశీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఫెయిర్ షాప్ యజమాని ఎం.అరుణ డీలర్‌షిప్‌ను రద్దుచేస్తూ 2009లో ఆర్డీవో ఉత్తర్వులు ఇచ్చారు. జేసీ, కలెక్టర్ వద్ద అప్పీల్ వేసినప్పటికీ ఉపశమనం లభించకపోవడంతో 2013లో అరుణ హైకోర్టును ఆశ్రయించారు. ఆర్డీవో స్వతంత్రంగా వ్యవహరించకుండా తహశీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలర్‌షిప్ రద్దు చేశారని ఆమె తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇది చట్టనిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. చట్టనిబంధనల ప్రకారం డీలర్ షిప్ రద్దుకు ముందు కనీస విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయడింది. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అన్ని వివరాలు పరిగణనలోకి తీసుకొని తాజాగా నిర్ణయం తీసుకోవాలని మదనపల్లి ఆర్డీవోను ఆదేశించింది.

జైళ్ల శాఖ డీజీగా అంజనీ కుమార్

» రోడ్ సేఫ్టీ చైర్మన్‌గా అభిలాష బిస్త్

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో చేరిన సీనియర్ ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్‌కు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్స్ ఇచ్చింది. రాష్ట్ర విభజన నాటి నుంచి తెలంగాణలో వివిధ హోదాల్లో పనిచేసిన అంజనీ కుమార్ కేంద్ర హోంశాఖ ఆదేశాలతో గత నెలలో ఏపీలో రిపోర్టు చేశారు. పొరుగు రాష్ట్రంలో డీజీపీగా పనిచేసిన 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్‌కు ఏపీ ప్రభుత్వం జైళ్ల శాఖ డీజీగా పోస్టింగ్స్ ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో 1994 బ్యాచ్‌కు చెందిన అభిలాష బిస్త్‌కు రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా పోస్టింగ్ ఇచ్చింది.

ఓఎస్డీల ఓవరాక్షన్!

పదిమంది మంత్రుల ఓఎస్డీలపై ముఖ్యమంత్రికి ఫిర్యాదుల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర మంత్రుల వద్ద పనిచేస్తున్న కొంతమంది ఓఎస్డీలు అదుపు తప్పి వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. సీఎం చంద్రబాబు కేబినెట్‌లో మొత్తం 25 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో సుమారు 10 మంత్రుల వద్ద పనిచేస్తున్న ఓఎస్డీలు తమ ఓవరాక్షన్‌తో, అవినీతి, అక్రమాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారంటూ ముఖ్యమంత్రికి పలు నివేదికలు అందినట్టు సమాచారం. ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర వద్ద పనిచేస్తున్న ఓఎస్డీని తప్పించిన విషయం తెలిసిందే. అలాగే, ఒక సీనియర్ మంత్రి వద్ద, మరో కీలక మంత్రి వద్ద పనిచేస్తున్న ఓఎస్డీలు కూడా బరితెగించి వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఓఎస్డీల్లో కొందరు హాస్టళ్లలో పిల్లల బువ్వను కూడా వదిలిపెట్టడం లేదని, దేవాలయ ఆస్తులను విఎంగేస్తున్నారని, అన్నదాతలకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలపై కన్నేసి గడ్డి కరుస్తున్నారని సమాచారం. ఇంకొందరికి అక్రమాలే ఇంధనంగా మారాయని, అవినీతి రోడ్డుపై హైస్పీడ్‌తో దూసుకుపోతున్నారని, ఖజానాకు చేరాల్సిన నిధులకు మధ్యలోనే గండికొట్టి దోచేస్తున్నారని తెలుస్తోంది. అయితే, వీరిని మంత్రులూ అదుపు చేసే పరిస్థితి కనిపించడం లేదని రాష్ట్ర సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చివరకు జూనియర్ మంత్రుల వద్ద పనిచేస్తున్నవారు కూడా అందినకాడికి దండుకొనే ప్రయత్నాల్లో మునిగిపోయారని చెబుతున్నారు. నికరంగా పదిమంది మంత్రుల ఓఎస్డీలపై ఈ విమర్శలు రావడంతో ప్రభుత్వం కూడా అప్రమత్తం అయినట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు మంత్రుల ఓఎస్డీలకు సంబంధించి ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదికలు అందాయి. ఇవి కాకుండా, పార్టీ వర్గాల నుంచి కూడా ప్రభుత్వానికి ఉప్పందింది. సదరు ఓఎస్డీలను ఇలాగే కొనసాగిస్తే మంత్రులకే కాకుండా ప్రభుత్వానికి కూడా అప్రతిష్ఠ తెచ్చిపెడతారని సీఎం వద్ద ఆ పార్టీ నేతలు మొర పెట్టుకున్నట్టు తెలిసింది.

మంత్రులూ.. కాస్త పట్టించుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. దీంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ కష్టాలు తీరుతాయని పనులు చేసిన వారు ఆశించారు. సీఎం చంద్రబాబు బిల్లుల చెల్లింపు బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులు (టీడీపీ), బీజేపీకి చెందిన ఇన్‌చార్జి మంత్రి, జనసేన వారైతే జిల్లా మంత్రికి అప్పగించారు. కానీ వారెవరూ బకాయిల వివరాల సేకరణపైనే దృష్టి పెట్టలేదు. ఏ గ్రామంలో ఎంతమందికి ఎంత మొత్తం ఇవ్వాలన్న వివరాలను తెప్పించుకోవడంపై జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ఎవరూ దృష్టి సారించడం లేదు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్వామా అధికారులను కూర్చోబెట్టి ఉపాధి బకాయిల వివరాలు సేకరించడం పెద్ద పని కాదు. కానీ ఆ దిశగా 26 జిల్లాల్లో ఏ మంత్రి కూడా బాధ్యత తీసుకోవడం లేదు.

చంద్రబాబు, లోకేశ్ చెప్పినా..

'ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల పర్యటనలు తప్పనిసరిగా చేయాలి. జిల్లాలకు వెళ్లినప్పుడు పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలి. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారంపై దృష్టి సారించాలి. 2014-19లో టీడీపీ మద్దతుదారులు చేసిన పనులకు సంబంధించిన బకాయిల వివరాలు సేకరించి, వీలైనంత త్వరగా చెల్లింపులు జరిపేలా చూడండి'.. అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీఎల్పీ సమావేశంలోనూ, టెలీకాన్ఫరెన్సుల్లోనూ పదే పదే చెబుతున్నారు. '2014-19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పనులు కానీ స్టేట్ డెవలప్‌మెంట్ నిధులు, ఇతరత్రా నిధులతో పనులు చేసి బిల్లులు రాని వారందరికీ చెల్లింపులు చేస్తాం. దీనికోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ బకాయిలు చెల్లించేలా చూస్తాం' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ పార్టీ నేతలకు హామీ ఇచ్చారు. ఈ మాటలను మంత్రులు ఎవరూ పెద్దగా పట్టించుకున్న దాఖలా కనిపించడం లేదు. ఇన్‌చార్జి మంత్రులు మొక్కుబడిగా జిల్లా సమీక్షా సమావేశాలకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ముఖ్యంగా టీడీపీకి చెందిన మంత్రులు ఎవరూ పార్టీ కార్యాలయాలకు వెళ్లి కార్యకర్తలతో సమావేశం కావడం కానీ.. 2014-19 మధ్య చేసిన ఉపాధి పనులు, ఇతరత్రా పనుల వివరాలు సేకరించడం కానీ చేయడం లేదు. అప్పట్లో ఈ పనులు చేసిన టీడీపీ మద్దతుదారులు మంత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు.

'ఉపాధి' బకాయిల వివరాలిలా..

2014-19 ఉపాధి బకాయిల్లో.. రూ.180 కోట్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు చెల్లించకుండానే మొత్తం చెల్లింపులు జరిపినట్లు చూపి అప్పట్లో వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక ఇచ్చింది. దీంతో ఈ ఖాతాలను కేంద్రం క్లోజ్ చేసింది. ఈ మొత్తం రావాలంటే కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆ ఖాతాలను తెరవాల్సి ఉంటుంది. ఇవి కాకుండా మరో రూ.150 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. హైకోర్టుకు వెళ్లి బిల్లులు చెల్లించాలని ఆదేశాలు తెచ్చుకున్నా అప్పటి జగన్ సర్కార్ ఈ రూ.150 కోట్లు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచింది. ఈ రెండు మొత్తాలు కాకుండా సుమారు రూ.600 కోట్ల వరకు నరేగా, కన్వెర్జెన్స్ నిధులు అతీగతీ లేకుండా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వివరాలనే సేకరించాలని మంత్రులకు సీఎం ఆదేశించారు. మొత్తం మీద సుమారు రూ.1000 కోట్ల వరకు ఉపాధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

'ఎన్టీఆర్' బకాయిలూ పెండింగ్..

టీడీపీ హయాంలో 2014-19 నడుమ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.960 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్టీఆర్ హౌసింగ్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు చెల్లింపులు చివరి ఏడాదిలో నిలిచిపోయాయి. అప్పట్లో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వానికి దూరం పెరగడంతో ఇళ్ల నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆ బిల్లుల చెల్లింపును నిలిపివేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటుతున్నా ఆ బిల్లుల ఊసెత్తడం లేదు.

58 మంది ఆత్మహత్య

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పులు తీసుకొచ్చి ఉపాధి హామీ పనులు చేసిన వారు.. అప్పులు, వాటిపై వడ్డీలు పెరిగి దిక్కుతోచని స్థితిలో 58 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. చాలా మంది హైకోర్టును ఆశ్రయించారు. బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

జగనన్న ఇళ్లకు మాత్రం క్లియర్

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన జగనన్న ఇళ్లకు అదనంగా చెల్లిస్తానన్న మొత్తం మాత్రం ఇటీవల విడుదల చేశారు. ఈ ఏడాది మార్చి 31న రూ.229 కోట్లు చెల్లింపులు చేశారు. 2014-19లో ఎన్టీఆర్ హౌసింగ్ బకాయిలు రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల మంది లబ్ధిదారులకు సుమారు రూ.960 కోట్ల వరకు ఉండగా, వాటిని పట్టించుకోకుండా జగనన్న ఇళ్లకు చెల్లింపులు చేయడం ఏమిటని పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈ మొత్తాన్ని విడుదల చేస్తున్నట్లు ఎక్కడా కనీస ప్రచారం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు పంపడం విమర్శలకు తావిస్తోంది.



విశాఖలో ఆమ్ల వర్షాలు

» పీహెచ్ విలువ సగటున 5.5గా నమోదు

» ఐఐటీఎం అధ్యయనంలో వెల్లడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'వర్షంలో తడిస్తే ఒళ్లంతా జిడ్డుబారింది. ఏదో తెలియని వాసన కూడా వచ్చింది. ఇది యాసిడ్ రెయిన్ అంట'.. ఇదీ విశాఖ నగర శివారు ప్రాంతవాసుల నుంచి తరచూ వినిపించే మాట. ఈ క్రమంలోనే ఏటా వేసవిలో యాసిడ్ (ఆమ్లత్వం)తో కూడిన వర్షంపడుతోందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెట్రాలజీ (ఐఐటీఎం) తాజా అధ్యయనంలో వెల్లడించడంతో విశాఖ వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాలుష్య కాసారంగా మారిన విశాఖలో 1987 నుంచి 2021 వరకూ కురిసిన వర్షంలో ఆమ్లత్వపు లక్షణాలున్నాయని తేల్చింది. విశాఖలో కురిసిన వర్షంలో ఆమ్లత్వం పీహెచ్ విలువ సగటున 5.5గా ఉన్నట్టు తెలిపింది.

కాలుష్యమే ప్రధాన కారణం

నగరంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, లక్షల కొద్దీ వాహనాల నుంచి ప్రతిరోజూ కాలుష్యం వెలువడుతోంది. వాయు కాలుష్యం భూ ఉపరితలంపై పది నుంచి 12 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరిస్తుంది. వేసవిలో క్యుములో నింబస్ మేఘాలతో కురిసే వర్షంలో పీహెచ్ విలువ సగటున 5.5గా నమోదు కావడం ఆమ్ల స్వభావాన్ని చూపుతోంది. వేసవి కాలంలో కురిసే వర్షంలో నైట్రిక్ యాసిడ్ 18 శాతం, సోడియం క్లోరైడ్ 16 శాతం, క్లోరిన్ 17 శాతం, వర్షాకాలం వర్షంలో నైట్రిక్ యాసిడ్ 16 శాతం, సోడియం క్లోరైడ్ 19 శాతం, క్లోరిన్ 17 శాతంగా నమోదైంది. నైట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉండడానికి పారిశ్రామిక సంస్థలు విడిచిపెట్టే ఉద్గారాలే కారణమని తేలింది. ఏడాది పొడవునా (కురిసిన ప్రతిసారీ) వర్షం నీటిని పరీక్షిస్తే దీర్ఘకాలిక సగటు విలువల్లో ఆమ్ల స్వభావం కనిపించింది. ఇందుకు చమురు శుద్ధి, ఎరువుల కర్మాగారాలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, షిప్‌యార్డుల నుంచి వెలువడే వాయు కాలుష్యంతో పాటు కొంతవరకు సముద్రం కారణమని ఐఐటీఎం అంచనా వేసింది. ఆమ్ల వర్షం వల్ల అనేక దుష్ఫలితాలు ఎదురవుతాయి. భూమి సారాన్ని కోల్పోతుంది. దాంతో పంటల దిగుబడి తగ్గుతుంది. మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. భవనాల జీవితకాలం కూడా తగ్గుతుంది. మనిషి జీవితంపైనా ప్రభావం చూపుతుంది. అయితే, సాధారణంగా వర్షం నీటిలో పీహెచ్ విలువ 7 (తటస్థం)గా నమోదవుతుందని, ఇది సురక్షిత నీరని అంతకంటే తక్కువ పీహెచ్ విలువ నమోదైతే దాంట్లో ఆమ్లత్వం ఉందని చెప్పవచ్చని ఏయూ రసాయన శాస్త్రం ఆచార్యుడు సిద్ధయ్య తెలిపారు. విశాఖలో ఆమ్ల వర్షాలకు పరిశ్రమలు, వాహనాలు, నగరీకరణ వంటి అంశాలు కారణమని, దీనివల్ల ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు వస్తాయని పేర్కొన్నారు.



గుంటూరు జిల్లా పొన్నెకల్లులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం చంద్రబాబు



విజయవాడలో నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు



అరకు కాఫీతో అంబేడ్కర్ చిత్రం... ఊహే వినూత్నంగా ఉంది కదూ. రాజ్యాంగ నిర్మాత జయంతిని పురస్కరించుకొని శ్రీసత్యసాయి జిల్లా పేరూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల డ్రాయింగ్ టీచర్ శ్రీరాములు ఈ వినూత్న చిత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు.

- రామగిరి, ఆంధ్రజ్యోతి



పీ-4 మార్గదర్శకులను ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం



పొన్నెకల్లులో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరైన జనం

ప్రతి పౌరుడికీ సమాన హక్కులు

» అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం: పవన్

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోకెల్లా భారతదేశ రాజ్యాంగం అత్యుత్తమమైనదని.. కుల, మత, జాతి, లింగ వివక్షకు తావు లేకుండా ప్రతి పౌరుడికీ సమాన హక్కులు కల్పించేలా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఈ రాజ్యాంగాన్ని రచించారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయునికి అంజలి ఘటించారు. ఆర్థికాంశాల కంటే సామాజికపరమైన అంశాలే వెనకబాటుతనానికి కారణమని గ్రహించిన అంబేడ్కర్.. తన జీవితానుభవాలు, ఉన్నత విద్య అందించిన విజ్ఞానం, సమసమాజ స్థాపన చేయాలనే తపనతో రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంబేడ్కర్ స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమంతో పాటు వారి రక్షణకు ప్రాధాన్యమిస్తున్నారని గుర్తుచేశారు. కూటమి పాలనలో అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి

ప్రాంతాలకు, కులాలకు, మతాలకు అతీతంగా దేశ ప్రజలంతా ఒకే తాటిపై నడిచేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

తాడేపల్లిలో అంబేడ్కర్ జయంతికి జగన్ డుమ్మా

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి హాజరుకాలేదు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, నందిగం సురేశ్, మేరుగ నాగార్జున, టీజేఆర్ సుధాకరబాబు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో చెవిరెడ్డి భాస్కర రెడ్డి సమావేశమయ్యారు. త్వరలోనే పార్టీ రాష్ట్ర కమిటీలను నియమించాల్సి ఉందని వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉధృత పోరాటాలు చేయాల్సి ఉందని పార్టీ నేతలకు చెవిరెడ్డి పిలుపునిచ్చారు.

వేసవిలోనూ రోజంతా విద్యుత్ సరఫరాకు కృషి

» విద్యుత్ సంస్థలను బలోపేతం చేస్తున్నాం: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కరెంటు వాడకం కూడా అదేస్థాయిలో పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారులకు డిమాండ్‌కు తగ్గ కరెంటును అందించేందుకు సమర్థవంతమైన కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. విద్యుత్ సౌధలో సోమవారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాబాసాహెబ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ రోజంతా కరెంటు సరఫరా చేసేలా కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందిస్తామన్నారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. పది ఎకరాల్లోపు ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును రూపాయిన్నరకే ఇస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు ఇస్తున్నామని చెప్పారు.

నేడు కేబినెట్ భేటీ

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో మంగళవారం మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. సీఆర్డీయే 46 అథారిటీ సమావేశంలో ఆమోదించిన అంశాలకు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. అమరావతి నిర్మాణం కోసం అవసరమైన నిధులు సమీకరించుకునేందుకు సీఆర్డీయే కమిషనర్‌కు అనుమతి ఇస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రజల దృష్టిని మరల్చడానికే అసత్యప్రచారం: మంత్రి

నూజివీడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు బయటపడకుండా ప్రజల దృష్టిని మరల్చడానికి వైసీపీ నాయకులు చివరకు తిరుమల వెంకన్నను కూడా వాడుకోవడం దారుణం. తిరుమలలోని గోశాలలో గోవులు చనిపోయాయంటూ అసత్య ప్రచారానికి దిగారు' అంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విజయవాడలో మాట్లాడుతూ.. కోట్ల మంది భక్తుల ఇష్ట దైవాన్ని పలుచన చేసేలా పదేపదే ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం ప్రజల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు.

జగన్‌రెడ్డిది క్షుద్ర రాజకీయం: వర్ల రామయ్య

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'తప్పుడు మాటలు, క్షుద్ర రాజకీయమే జగన్‌రెడ్డి జీవితం' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. 'జగన్‌రెడ్డి అంబేడ్కర్‌పై ప్రేమతో విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో విగ్రహం పెట్టలేదు. ఓ వర్గంపై కక్షతో పెట్టారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడం కోసమే పూర్తిగా నిర్మాణం కాని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితుల మనోభావాల్ని దెబ్బతీశారు' అని వర్ల మండిపడ్డారు.

సీఎం చంద్రబాబుకు అమరావతి పిచ్చి: తులసిరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పేరుతో ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం నెల్లూరు జిల్లా దుత్తలూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబుకు అమరావతి పిచ్చి పట్టింది. ఇప్పటికే తాత్కాలికం పేరుతో రూ.వందల కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించారు. తిరిగి మరోసారి రైతుల వద్ద భూములు తీసుకుంటామని చెబుతున్నారు. అసలు అమరావతిలో అంతర్జాతీయ రాజధాని ఏమైనా కడతారా? హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వాటి అమలుకు, సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది' అన్నారు.

రేపటి నుంచి పోలవరంలో కేంద్ర బృందం

పోలవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్న గ్యాప్-1, గ్యాప్-2, డయాఫ్రంవాల్ ప్రాంతాల్లో వినియోగించనున్న మట్టి నాణ్యతా ప్రమాణాలను కేంద్ర నిపుణుల బృందం మూడ్రోజుల పాటు పరిశీలించనుంది. ఏలూరు జిల్లా పోలవరంలో ప్రాజెక్టు ఈఈ బాలకృష్ణ సోమవారం మాట్లాడుతూ కేంద్ర బృందం మంగళవారం సాయంత్రం పోలవరం చేరుకుంటుందని తెలిపారు. ఈ బృందంలో కేంద్ర మెటీరియల్ అండ్ సాయిల్ రిసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్థ్ హెడావో, సైంటిస్టు, ఏఆర్వో విపుల్ కుమార్ గుప్తాలు ఉన్నట్లు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించేందుకు అల్లూరి జిల్లా దండంగి గ్రామం వద్ద, స్పిల్‌వే సమీపంలో ఉంచిన మట్టి నిల్వల వద్ద ఈ బృందం శాంపిల్స్ సేకరించనున్నట్టు తెలిపారు.

మళ్లీ అంబేడ్కర్ విదేశీ విద్య

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ప్రకటించారు. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.102 కోట్లు విలువచేసే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 369 బంగారు కుటుంబాలను (నిరుపేద కుటుంబాలను) ఆయన మార్గదర్శులుగా ముందుకు వచ్చిన ప్రముఖులకు దత్తత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొలుత ఆయన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం ద్వారా విదేశాల్లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందిన అనిల్, కొరివి రత్నలతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వీరిలో రత్నలత ఆస్ట్రేలియాలో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా, అనిల్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. "గతంలో జన్మభూమి కార్యక్రమానికి నేను పిలుపునిచ్చిన సమయంలో విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎందరో రాష్ట్రంలో స్కూళ్లు కట్టించారు. ఆ విద్యావకాశాలను అందుకుని అనిల్, రత్నలత వంటి అనేక మంది జీవితాలు మార్చుకున్నారు. మనం ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల చొప్పున వారి చదువులకు సహాయం చేశాం. వారు ఇప్పుడు ఏడాదికి రూ.60 లక్షలు చొప్పున సంపాదిస్తున్నారు. ఒకటి, రెండు కుటుంబాలను వారు కూడా దత్తత తీసుకోవడం బాగుంటుంది" అని చంద్రబాబు సూచించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

అర్థం చేసుకుంటే బంగారు భవిష్యత్తు

"పేదరికం లేని సమాజానికి శ్రీకారం చుట్టా. ఆ సంకల్పాన్ని సాధించి తీరుతా. అర్థం చేసుకుంటే అందరికీ బంగారు భవిష్యత్తే.. 2004, 2019లాగా ఆలోచిస్తే.. నాకు వైకుంఠపాళే. మళ్లీ మొదటికి వస్తుంది. తిరిగి పునర్నిర్మించుకోవాలి. 2019-24 మధ్య కాలాన్ని చూశారు. అంతటి అరాచకాన్ని ఎప్పుడూ చూసి ఉండరు. ఇప్పుడు తిరిగి రాజధానిని ప్రపంచం మొత్తం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి, రాజ్యాంగ నిర్మాత, హక్కుల ప్రదాత అయిన అంబేడ్కర్ జయంతి రోజున పీ-4 కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉంది. అణగారిన, పేద కుటుంబంలో పుట్టిన అంబేడ్కర్ చదువుకోవడానికి బరోడా మహారాజు సహాయం చేశారు. ఆ విధంగా సహాయం చేయబట్టే బరోడా మహారాజు చరిత్రలో నిలిచిపోయారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను బ్రాహ్మణ కుటుంబం ఆదుకోబట్టే ఆయన అంతటి ఉన్నత స్థానానికి చేరుకున్నారు. పేదరికం లేని సమాజ సమాజ సాధన కోసం నేను సంకల్పం తీసుకున్నాను. అదే పీ-4 కార్యక్రమం."



పొన్నెకల్లులో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్న బుర్రా చిన్నమ్మాయితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆద్యంతం ఉత్సాహభరితం!

సీఎం సరదా ప్రసంగం

గుంటూరుజిల్లా పొన్నెకల్లులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. మూడున్నర గంటలపాటు సాగిన సభలో సభికులకు విసుగురాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపన్యాసం సాగింది. సభికుల్లో ఉత్సాహాన్ని నింపుతూ మొదలైన ఉపన్యాసం ఎన్నేర కాల భావోద్వేగాలకు వేదికైంది. చంద్రబాబు యువతలో జోష్ నింపుతూనే, వారికి బాధ్యత గుర్తుచేశారు. తమ తప్పులను సైతం నవ్వుతూనే అంగీకరిస్తూ, వైసీపీ అబద్ధపు ప్రచారాలతో అందరం మోసపోయామని వ్యాఖ్యానించారు.

ఎస్సీల పిల్లలకు మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు

"గత ప్రభుత్వంలో పాలకులు అమరావతిని చంపేశారు. కులం, మతం, ప్రాంతాల వారీగా వైషమ్యాలు రగిల్చిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం. అమరావతికి దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలు రాబోతున్నాయి. ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్ కొలువుదీరాయి. అన్ని కాలేజీలను తీసుకొచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం. భవిష్యత్‌లో ఎస్సీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం."



పొన్నెకల్లులోని చిన్నారికి అల్పాహారం తినిపిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే కూటమి కట్టాం

"రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ లభించింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లు మాట్లాడాలంటేనే ప్రజలు భయపడ్డారు. నాలాంటి వారు కూడా బయటకురాలేని పరిస్థితి. ఇప్పుడు మన పాలనలో స్వర్ణయుగం రానుంది. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే కాకుండా నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే ఉద్దేశంతోనే జనసేన, బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్లాం. సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచాం. ఆవిర్భావం నుంచీ కుల వివక్షపై టీడీపీ యుద్ధం చేసింది. జీవో నం.694 ప్రకారం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. కుల వివక్ష చూపే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ఆదేశాలు ఇచ్చాం. ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులు పెట్టాం. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అంబేడ్కర్‌కు భారతరత్న వచ్చింది. నేను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నప్పుడే ఎస్సీ వర్గానికి చెందిన కే.ఎల్.నారాయణన్‌ను రాష్ట్రపతిని చేశాం."

మా ఉన్నతికి చంద్రబాబే కారణం





"మాది గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామం. దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను 2014లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేశాను. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం గురించి తెలుసుకుని దరఖాస్తు పెడితే నా విదేశీ చదువుల కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందింది. నాడు సీఎం చంద్రబాబు ఆర్థిక సాయం చేయబట్టే నేను ఈ స్థాయిలో ఉన్నా"నని ఆస్ట్రేలియాలో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రత్నలత తెలిపారు. చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని రత్నలత తండ్రి చెప్పారు. కెనడాలో ఏడాదికి రూ. 60 లక్షలు సంపాదిస్తున్నానని అనిల్ తెలిపారు. "మాది గుంటూరు జిల్లా తెనాలి. మా అమ్మమ్మ రోడ్లు ఊడ్చి నన్ను చదివించింది. తెలుగుమీడియంలో చదివాను. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా కెనడాలో మాస్టర్స్ చదివే అవకాశం నాటి సీఎం చంద్రబాబు కల్పించారు." అని కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న అనిల్ తెలిపారు. వారితో చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు.

- రత్నలత, అనిల్

దేవుళ్లపై దాడులుచేసిన వారికి ఇంత భక్తి ఎక్కడిది?

"దేవుళ్లపై దాడులు చేసిన వారికి వెంకటేశ్వరస్వామిపై ఇంత భక్తి ఎక్కడి నుంచి వచ్చింది.? తిరుమల గోశాలలో ఆవులు చనిపోయాయని అబద్ధాలు చెబుతున్నారు. తిరుమలకు వెళ్లినప్పుడు సంప్రదాయాలు పాటించని వారు కూడా దేవుళ్ల గురించి మాట్లాడటమా? గతంలోనూ అంతే... అసలు పింక్ డైమండ్ లేకపోయినా మా ఇంట్లో ఉందని చెప్పి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. నేను రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేస్తే అధికారంలోకి వచ్చాక అసలు పింక్ డైమండ్ లేదని కోర్టులో కేసు వెనక్కి తీసుకున్నారు. వివేకా హత్యలో సాక్ష్యాలు తారుమారు చేయడంతోపాటు సాక్షులను కూడా చంపేస్తున్నారు. ఇప్పటికే ఆరుగురు సాక్షులు చనిపోయారు. నేను కూడా గొడ్డలిపోటును గుండెపోటుగా నమ్మి ఒకసారి మోసపోయా. మాటలు చెప్పడం సులభం. మంచి పనులకు నలుగురిని ఒప్పించడం, పేదలకు దారి చూపడం సులువు కాదు" అని చంద్రబాబు అన్నారు.

ఓర్వకల్లు సిగలో కాంతి పుంజం..!

» పాలకొలనులో ప్రతిష్ఠాత్మక డీఆర్‌డీవో కేంద్రం
» 2019లో విజయవంతంగా క్షిపణి ప్రయోగం
» తాజాగా 'లేజర్ అస్త్రం' పరీక్ష గ్రాండ్ సక్సెస్
» కర్నూలు జిల్లా పాలకొలను గ్రామస్థుల హర్షం

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)



ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేసిన డీఆర్‌డీవో కేంద్రం

కర్నూలుకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలోని డీఆర్‌డీవో కేంద్రం నుంచి 30 కిలోవాట్ల లేజర్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) ఎంకే-2(ఏ)ను ఈ నెల 13న దిగ్విజయంగా పరీక్షించడంతో అందరి దృష్టి కర్నూలుపై పడింది. 2019 సెప్టెంబరు 11న దేశీయంగా అభివృద్ధి చేసిన తక్కువ బరువు కలిగిన యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (క్షిపణి)ని ఇక్కడి నుంచి విజయవంతంగా ప్రయోగించారు. కర్నూలు గడ్డపై డీఆర్‌డీవో ఐదున్నర ఏళ్లలో చేపట్టిన రెండు పరీక్షలు ఘన విజయం సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా లేజర్ అస్త్రం పరీక్ష సక్సెస్ కావడంతో లక్షలాది మంది కర్నూలు డీఆర్‌డీవో కేంద్రం గురించి గూగుల్‌లో వెతుకుతున్నారు.

పాలకొలను సమీపంలో ఏర్పాటు

కర్నూలు నగరానికి 35 కి.మీ. దూరంలో ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామం వద్ద డీఆర్‌డీవో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని 2015లో అప్పటి డీఆర్‌డీవో డైరెక్టర్లు సీవీ బాలాజీ, డీవీఎస్ ఆర్ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ శంకర్‌రావు పరిశీలించారు. ఓర్వకల్లు మండల పరిధిలో పాలకొలను, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కాల్వ గ్రామాలు, వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామాల పరిధిలో డీఆర్‌డీవో ఏర్పాటుకు అనువుగా ఉంటుందని కేంద్ర రక్షణ శాఖకు నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక మేరకు.. అప్పటి సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం డీఆర్‌డీవో ఏర్పాటుకు 2,781 ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గంలో తీర్మానించింది. ఎకరా రూ.2 లక్షలు చొప్పున రూ.54 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తే.. చంద్రబాబు ప్రభుత్వం పట్టాభూమి రైతులకు ఎకరా రూ.5 లక్షలు, అసైన్డ్ పట్టా భూమికి ఎకరాకు రూ.4.30 లక్షలు చొప్పున భూ పరిహారం చెల్లించి సదరు భూమిని డీఆర్‌డీవోకు స్వాధీనం చేశారు. రూ.570 కోట్లతో అభివృద్ధి చేసే ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అప్పటి పాలకులు పేర్కొన్నారు. ఫేజ్-1 కింద దాదాపు రూ.120 కోట్లు ఖర్చు చేసి దృఢమైన ప్రహరీ, టెక్నికల్ బిల్డింగ్స్, అడ్మినిస్ట్రేషన్ భవనాలు, ఎంఐ (మెడికల్) భవనాలు, డీఎస్ఈ, సెక్యూరిటీ భవనాల నిర్మాణాలు.. వంటి పనులను దాదాపు పూర్తి చేశారు. చుట్టూ 24 గంటలు నిఘా ఉండేలా రెండు కిలోమీటర్లకు ఒకటి చొప్పున 14 వాచ్ టవర్లను నిర్మించారు.



2019 సెప్టెంబరు 11న పరీక్షించిన తేలికపాటి క్షిపణి (ఫైల్)

నాడు క్షిపణి.. నేడు లేజర్ అస్త్రం ప్రయోగం

కర్నూలు డీఆర్‌డీవో కేంద్రం నిర్మాణ దశలో ఉండగానే 2019 సెప్టెంబరు 11న తేలికపాటి యాంటీ ట్యాంక్ గైడెన్స్ మిస్సైల్ (క్షిపణి) విజయవంతంగా పరీక్షించారు. సైనికుడు భుజంపై మోసుకెళ్లేందుకు వీలుగా ఉండేలా డీఆర్‌డీవో ఈ క్షిపణిని దేశీయంగా తయారు చేసింది. ఐదున్నరేళ్ల తర్వాత.. అధునాతన ఫ్యూచరిస్టిక్ 'స్టార్ వార్స్'గా పేర్కొంటున్న లేజర్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ ఎంకే-2 (ఏ)ను ఈ కేంద్రం నుంచి తొలిసారిగా పరీక్షించారు. ఇది శత్రువుల డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేయగల లేజర్ అస్త్రం. కర్నూలులో ఉన్న నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్‌లో ఎంకే-2(ఏ)ను వినియోగించి కాంతి పుంజాలతో డ్రోన్ల సమూహాలను, ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీలను ధ్వంసం చేశారు.

ప్రధాన పట్టణాల్లో ఒకటిగా ఓర్వకల్లు: ఎమ్మెల్యే గౌరు చరిత

'డ్రోన్ సిటీ సహా.. పలు భారీ పరిశ్రమలు సైతం ఓర్వకల్లుకు రాబోతున్నాయి. భవిష్యత్తులో దేశంలోని ప్రధాన పట్టణాల్లో ఒకటిగా ఓర్వకల్లు మారబోతుంది' అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఇక్కడ చేపట్టిన రెండు పరీక్షలు విజయవంతం కావడంతో భూములిచ్చిన పాలకొలను గ్రామ రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకొలను గ్రామానికి చెందిన చదువులు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశ రక్షణలో మేము సైతం భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. కోర్టులో ఉండడంతో డీ-పట్టా కలిగిన వంద మంది రైతులకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వారికి న్యాయం చేయాలి' అన్నారు.

అనుమతి లేకుంటే చర్యలు

» బాణసంచా తయారీ కేంద్రాలకు మంత్రి అనిత హెచ్చరిక
» మరణించిన వారి కుటుంబాలకు 17 లక్షలు, గాయపడిన వారికి 1.5 లక్షలు నష్టపరిహారం



అనకాపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రవ్యాప్తంగా అనధికార బాణసంచా తయారీ కేంద్రాలను గుర్తించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులున్నా భద్రతా చర్యలు పాటించకుంటే సహించేది లేదు' అని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. సోమవారం అనకాపల్లిలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'అనకాపల్లి జిల్లాలో లైసెన్స్‌లు ఉన్నవి, లేనివి... కలిపి మొత్తం 40 వరకు బాణసంచా కేంద్రాలు నడుస్తున్నాయి. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ప్రమాదం చోటుచేసుకోవడం దురదృష్టకరం. ఈ సంఘటనపై ఇప్పటికే విచారణ మొదలైంది. లక్ష్మీ గణేశ్ ఫైర్‌వర్క్స్ నిర్వాహకులు ఇద్దరిపై (ఏ1, ఏ2) కేసు నమోదు చేశాం. వారిలో ఒకరు ఇప్పటికే చనిపోగా, జానకిరామ్ అనే వ్యక్తి 50 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కైలాసపట్నం పేలుడు ఘటనలో మృతి చెందిన ఎనిమిది మంది కుటుంబాలకు ప్రభుత్వం రూ.15 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రధాన మంత్రి కూడా మరో రూ.2 లక్షలు వంతున బాధిత కుటుంబాలకు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు ఎనిమిది మందికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష చొప్పున, ప్రధాన మంత్రి నుంచి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా అందుతుంది. క్షతగాత్రుల పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. త్వరలోనే చెక్కులు అందజేస్తాం' అని మంత్రి అనిత పేర్కొన్నారు.

రాజధాని భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» 34 వేల ఎకరాల్లో అభివృద్ధికి దిక్కులేదు
» పునరుజ్జీవం పేరుతో మరో 44,000 ఎకరాలా?: షర్మిల

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'అమరావతి రాజధాని కోసం మొదటి దశలో సేకరించిన 34,000 ఎకరాల భూమి వినియోగంపై తక్షణమే శ్వేత పత్రాన్ని విడుదల చేయాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. సోమవారం ఆమె ఎక్స్ వేదికగా రాజధాని అమరావతి నిర్మాణం, రెండో విడత భూ సేకరణపై సవివరంగా స్పందించారు. 'ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం... అన్నట్లుగా సీఎం చంద్రబాబు తీరు ఉంది. అమరావతి పేరుతో మొదటి దశలో సేకరించిన 34,000 ఎకరాలలో అభివృద్ధికి దిక్కు లేదు. కాని పునరుజ్జీవం పేరుతో ఇప్పుడు మరో 44,000 ఎకరాలు అర్జెంట్‌గా అవసరం వచ్చిందట. అందులో చంద్రబాబు అద్భుత ప్రపంచాన్ని కడతాడట. అరచేతిలో వైకుంఠం చూపించడం, ఏఐ పేరుతో గ్రాఫిక్ మాయ చేయడం, లేనిది ఉన్నట్లుగా నమ్మించడం ఒక్క బాబుగారికే తెలిసిన విద్య. రాజధాని విస్తరణ పేరుతో విలువైన రైతుల భూములను కాజేసి తన అనుయాయులకు కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న కుట్ర తప్ప మరొకటి కాదు. రాజధాని విస్తరణకు భూములు సేకరించడానికి మేమేమీ మోకాలడ్డడం లేదు. కానీ సేకరించిన 34,000 ఎకరాలలో అసలు రాజధాని ఎక్కడ? ముందు రాజధానిని నిలబెట్టకుండా, చిత్రాలతో విచిత్రాలు చేస్తూ ఇప్పుడే 44,000 ఎకరాలు అదనంగా గుంజుకోవడం అంటే మరో నాలుగు మండలాల రైతులను మోసం చేయడం కాదా..! రాజధాని కోసం సేకరించిన 34 వేల ఎకరాల భూములపై తక్షణమే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.



చెట్టుకు పూసిన పక్షులు!



ఇవి చెట్టుకు పూసిన పక్షులు! చెట్టు నిండుగా తెల్లటి పూలు ఉన్నట్టుంది కదా!! కానే కాదు. ఈ ఫొటోలో అరవిరిసిన పుష్పాలుగా గోచరించేవన్నీ పక్షులే. విశాఖపట్నం సింహగిరి ఘాట్‌రోడ్డు టోల్‌గేటు సమీపంలో ఉన్న రావిచెట్టు వందలాది పక్షులకు ఆవాసంగా మారింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా ఈ చెట్టు మీద కొంగలు, పావురాలు, కాకులు కలిసి మెలిసి జీవిస్తున్నాయి. వందల సంఖ్యలో ఈ పక్షులన్నీ సూర్యోదయాన ఒక్కసారిగా ఆహారాన్వేషణకు బయలుదేరడం, తిరిగి సాయంత్రం చెట్టుమీదకు చేరడాన్ని వీక్షించే వారంతా మధురానుభూతి చెందుతున్నారు.



ముగిసిన టైగర్ ట్రయంఫ్-2025

అమెరికా, భారత నౌకాదళాలు సంయుక్తంగా చేపట్టిన టైగర్ ట్రయంఫ్-2025 విన్యాసాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీన హార్బర్ ఫేజ్‌తో మొదలైన ఈ కార్యక్రమం సీ ఫేజ్ విన్యాసాలతో సోమవారం ముగిసింది. అమెరికా నుంచి వచ్చిన యుద్ధనౌకలు, విమానాలు తిరుగు ప్రయాణమయ్యాయి. మన యుద్ధ నౌకలు కాకినాడ నుంచి విశాఖపట్నం చేరుకుంటున్నాయి. - విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి)



4 కోట్ల నోట్లు... కోటి విలువైన నగలు..!

నాలుగు కోట్ల రూపాయల కరెన్సీ నోట్లు... కోటి రూపాయల విలువైన బంగారు నగలతో అలంకరించిన ముత్తమారియమ్మన్ విగ్రహం ఇది. తమిళ సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం కోయంబత్తూరు జిల్లా కాట్టూర్‌లోని అమ్మవారికి ఈ ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ ప్రత్యేక అలంకరణను వీక్షించేందుకు వేలాది మంది భక్తులు భారీగా తరలివస్తున్నారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

భార్యనూ.. కడుపులోని

ఆమె బిడ్డనూ చిదిమేశాడు!

⏩ భార్య గొంతుకు చున్నీ బిగించి చంపిన ఉన్మాది

మహారాణి పేట(విశాఖపట్నం), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మరికొద్ది గంటల్లో ప్రసవం కానున్న భార్యను గొంతు నులిపి చంపేశాడో ఉన్మాది. ప్రేమించి పెళ్లి చేసుకుని.. రహస్యంగా కాపురం పెట్టిన అతడు.. ఆ విషయం తన తల్లిదండ్రులకు ఎక్కడ తెలిసిపోతుందోనని ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. ఈ ఉన్మాదిని విశాఖ పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు ప్రాంతానికి చెందిన కేదారశెట్టి అనూష(27) హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. విశాఖ జిల్లా కూర్మన్నపాలేనికి చెందిన గెడ్డాడ జ్ఞానేశ్వర్(29) సాగర్‌నగర్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. మరోవైపు హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. అనూష స్నేహితురాలి ద్వారా ఆమెకు పరిచయమయ్యాడు. ఇద్దరూ ప్రేమించుకుని 2022 డిసెంబరు 10న కొంతమంది స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. పీఎం పాలెం వుడా కాలనీలో కాపురం పెట్టారు. జ్ఞానేశ్వర్ వివాహం చేసుకున్నట్టు ఇంతవరకూ తన తల్లిదండ్రులకు తెలపలేదు. వారికి విషయం చెప్పాలని అనూష ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా.. పిల్లలు పుట్టాక చెబుదామని కాలయాపన చేశాడు. ఈ క్రమంలో అనూష గర్భం దాల్చింది. నెలలు నిండాయి. ఏప్రిల్ 14న ప్రసవమవుతుందని, ఒకరోజు ముందు ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. అయితే.. 'ఆదివారం ఎందుకు? సోమవారం ఉదయం వెళదామ'ని జ్ఞానేశ్వర్ అనూషకు నచ్చజెప్పాడు. ఆదివారం రాత్రి అనూష తన స్నేహితులతో ఫోన్‌లో ఎంతో సంతోషంగా మాట్లాడింది. కానీ.. ఉదయం 7.30 గంటల సమయంలో ఆమె సన్నిహితులు, స్నేహితులకు జ్ఞానేశ్వర్ ఫోన్ చేసి అనూష ఎలాంటి చలనం లేకుండా పడి ఉందని తెలిపాడు. వారు వచ్చిన తర్వాత ముందుగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు గుర్తించి కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడి వైద్యులు ఆమె మృతిని నిర్ధారించారు. అనూష మెడపై కమిలిన గుర్తులు ఉండడంతో స్నేహితులు అనుమానం వ్యక్తం చేశారు. జ్ఞానేశ్వర్ చేతులు, ముఖంపై గోళ్ల గీతలు, రక్తపు చారలు ఉండడంతో పాటు మృతదేహాన్ని తీసుకువెళ్లిపోయేందుకు హడావుడి పడుతుండడంతో కేజీహెచ్ ఔట్‌పోస్టు పోలీసులకు అనుమానం వచ్చింది. వారు తమదైన శైలిలో గదమాయించగా.. అనూషను చున్నీతో పీక నులిమి చంపినట్టు నేరాన్ని అంగీకరించాడు.



కొద్దిరోజుల క్రితం గర్భిణిగా ఉన్న అనూషతో జ్ఞానేశ్వర్

మైనింగ్ డాన్!

(మొదటి పేజీ తరువాయి)

అజయ్ భారీ సెటిల్‌మెంట్ చేశారు. ఆ తర్వాత దాన్ని హస్తగతం చేసుకున్నారు. ఇక.. అక్కడనుంచి మరింత రెచ్చిపోయి మరో కంపెనీపై కన్నేశారు. అయితే, ఇక్కడ కథ అనూహ్యంగా రివర్స్ అయింది. అజయ్ వ్యవహారం ముఖ్యమంత్రిదాకా వెళ్లింది. సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో రూటు మార్చారు. ఈ సారి మైనింగ్ కంపెనీల మీదున్న విజిలెన్స్ కేసుల రివిజన్‌పై పడ్డారు.

వచ్చే బుధవారం ఒకేసారి 64 కంపెనీల కేసుల విచారణను సింగిల్ టేక్ లో సెటిల్ చేసేందుకు రెడీ అయ్యారు. గనుల శాఖను దున్నిపడేస్తూ, మైనింగ్ డాన్‌గా వెలుగొందుతున్నారు. గనుల శాఖలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. అజయ్‌ది ఉమ్మడి కృష్ణాజిల్లా. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ కేంద్రంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టి, అమెరికా, యూరప్ దేశాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పి కోట్లాది రూపాయలు వసూలు చేశారు. ఆనక బోర్డు తిప్పేశారు. దీంతో ఆయనపై సైబర్‌క్రైమ్ కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసు నుంచి తాత్కాలికంగా బయటపడి అమరావతికి వచ్చారు. బందరుకు చెందిన ఓ కీలక టీడీపీ నేత ఆరాధించే ఆధ్యాత్మిక గురువు సిఫారసుతో గనులశాఖలో అడుగుపెట్టారు. గతంలో జగన్ ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర గనుల్లో అక్రమాలు చేసిన అనుభవం ఆయనకు ఉందని చెబుతున్నారు. దానినే తన అర్హతగా గనుల శాఖలో చెప్పుకొని తిరుగుతున్నారని సమాచారం. తెరవెనక సెటిల్‌మెంట్లు, దందాలు బాగా చేయగలనంటూ గనులశాఖలోని కీలక వ్యక్తుల మద్దతు పొందినట్టు తెలిసింది. దీంతో అజయ్‌కు వారు అన్నివిధాల ప్రోద్బలం అందిస్తున్నారని చెబుతున్నారు.

అనామకంగా వచ్చి కంపెనీ హస్తగతం

గత ఏడాది ఆగస్టులో గనుల శాఖ పెద్దల వద్దకు కర్ణాటకకు చెందిన ఓ గ్రానైట్ వ్యాపారి కేసు వచ్చింది. జగన్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి చిత్తూరు, విశాఖ జిల్లాల పరిధిలో ఆ వ్యాపారికి మూడు గ్రానైట్ మైన్స్ లీజులు, పరిశ్రమలు ఉన్నాయి, ఉమ్మడి విశాఖలో అత్యంత ఖరీదైన మూన్‌లైట్ గ్రానైట్ దొరుకుతుంది. విదేశీ ఎగుమతుల్లో అది టాప్‌లో ఉంటుంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఆ వ్యాపారి కంపెనీపై విజిలెన్స్ దాడులు చేసి 50 కోట్లపైనే పెనాల్టీ విధించారు. తనకు కేటాయించిన దానికంటే ఎక్కువగా మైనింగ్ చేశారన్నది ఆ కంపెనీపై మోపిన అభియోగం. దీన్ని అడ్డంపెట్టుకొని, జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలోని ఓ కీలక పెద్ద ఆ మైనింగ్ వ్యాపారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకోవాలని ప్రయత్నించగా, అందుకు యజమాని అంగీకరించలేదు. దీంతో నాటి గనుల మంత్రి వద్ద కనీసం అప్పీల్ రివిజన్‌కు దాఖలు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వ్యాపారి అప్పీల్ చేశారు. వెంటనే ఊరట దొరికింది. ఎలాంటి పెనాల్టీ కట్టే అవసరం లేదని తేల్చారు. ఈలోగా ఆ కంపెనీ వద్ద ఉన్న గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేసుకున్నారు. సరిగ్గా ఇదేసమయంలో అజయ్ తెరమీదకు వచ్చారు. గనులశాఖలోని కీలక వ్యక్తి పేరిట ఆయన మంత్రాంగం నడిపారు. అంతే...ఉమ్మడి విశాఖ జిల్లాలోని రెండు మైనింగ్ లీజులను దక్కించుకున్నారు. అంటే, ఆ వ్యాపారం పూర్తిగా అజయ్‌కు ఇచ్చేసేలా లిఖితపూర్వక ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని మరి కొన్ని గ్రానైట్ లీజులను సెటిల్‌మెంట్ రూపంలో దక్కించుకొన్నారని చెబుతున్నారు.

మళ్లీ రివిజన్స్ పేరిట ముందుకు...

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 143 విజిలెన్స్ పెనాల్టీ కేసులను పలు దఫాలుగా రివిజన్ చేశారు. అందులో అనేక కేసుల్లో కీలక కంపెనీలను అజయ్ చేజిక్కించుకున్నారు. కొన్నింటిలో వాటాలు పుచ్చుకున్నారు. ఇటీవల నర్సీపట్నం కేసు సీఎం దాకావెళ్లడంతో విషయం తిరగబడింది. డాన్ కథ కంచికే అనుకున్నారు. కానీ రివిజన్‌ల రూపంలో మరోసారి ఆయన ముందుకొచ్చారు. ఈనెల 16వ తేదీన 63 విజిలెన్స్ కేసుల రివిజన్ ఉంటుందని గనులశాఖ తేదీ ఖరారు చేసింది. అందులోనూ ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర కంపెనీలే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఒకేసారి 63 కేసుల రివిజన్ వెనక అజయ్ హస్తం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సీన్ రివర్స్

ఉత్తరాంధ్రలోని నర్సీపట్నం ఏరియాలో రూ.వందల కోట్ల విలువైన మూన్‌లైట్ గ్రానైట్ మైనింగ్ పరిశ్రమను అజయ్ దక్కించుకున్నారు. దాని పక్కనే మరో బడా గ్రానైట్ కంపెనీ ఉంది. దాని పరిధిలో భూములు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆ భూములను తనకిస్తే తన పరిశ్రమకు పవర్ లైన్స్ ఏర్పాటు చేసుకుంటానని ఆయన అడిగారు. ఇందుకు ఆ కంపెనీ యజమాని ఒప్పుకోలేదు. అంతే...తొలుత గనులశాఖలో ఓ కీలక వ్యక్తినుంచి ఫోన్ వెళ్లింది. అజయ్ చెప్పినట్లు చేయాలని ఆదేశించారు. ఆయన ప్రభుత్వ పెద్దల ఆత్మీయ బంధువంటూ ఏవో కొన్ని ఫొటోలు కూడా పంపించి దారికితెచ్చుకొనే ప్రయత్నం చేశారు. ఆయినా మాట వినకపోయేసరికి ఉత్తరాంధ్ర గనుల విజిలెన్స్ అధికారి.. అశోక్ అనే అధికారి నేతృత్వంలో టీమ్‌ను పంపించారు. పెద్దలు చెప్పారు కదా అని అశోక్ టీమ్ దాడులు చేసి హడావుడి చేసింది. 30 కోట్ల పెనాల్టీ వేయబోతున్నట్లుగా సంకేతాలు పంపినట్టు తెలిసింది. ఈ విషయం నర్సీపట్నం నుంచి ఏకంగా ఢిల్లీ పెద్దలదాకా వెళ్లింది. ఆ సమాచారం అంతే వేగంగా ఏపీ ప్రభుత్వ పెద్దలకు చేరింది. అసలేం జరిగిందని ఆరాతీసి ప్రభుత్వ పెద్దలు విస్మయానికి గురయ్యారు. "ఎవరీ అజయ్? మైనింగ్ కంపెనీలపై ఆయన పెత్తనం ఏంటి? ఆయన కోసం గనులశాఖ కీలక వ్యక్తులు పనిచేయడం ఏంటి? అసలు రివిజన్ పేరిట ఏం జరుగుతోంది?" అని ముఖ్యమంత్రి ఆరాతీశారు. ప్రభుత్వంతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి గనులశాఖపై పెత్తనం చేస్తున్నారని సీఎంకు స్పష్టంగా అర్థమయింది. దీంతో సంబంధిత వ్యక్తులను పిలిచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇవన్నీ ఆపేయాలని మందలించారు. ఇంతటితో అజయ్ కథ కంచికి చేరినట్లేనని గనులశాఖ అధికారవర్గాలు, మైనింగ్ పరిశ్రమల, కంపెనీల ఓనర్లు భావించారు. అయితే, సీఎం ఆగ్రహావేశాలు తాత్కాలికమేనని మరోసారి తేలిపోయింది.

టీటీడీని రాజకీయ లబ్ధికి వాడొద్దు: నారాయణ

తిరుపతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దేశంలో గవర్నర్ల వ్యవస్థను రద్దుచేసి చట్టసభలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండు చేశారు. తిరుపతిలో సోమవారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. 'అంబేడ్కర్ స్ఫూర్తికి కేంద్ర ప్రభుత్వం గండి కొడుతోంది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి పోరాటాలు చేస్తాం. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులను బీజేపీ ఖాతరు చేయడం లేదు. చట్టసభలపైన కోర్టుల జోక్యం పెరిగిందని గవర్నర్లు వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. మావోయిస్టుల ఏరివేత పేరుతో అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించడానికి కేంద్రం కుట్ర పన్నుతోంది. ఇటీవల టీటీడీపై దుష్ప్రచారం చేసే కుట్రలు జరుగుతున్నాయి. ఈ కారణంగా భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంది. టీటీడీని రాజకీయ లబ్ధి కోసం వాడుకోరాదు' అని నారాయణ హితవు పలికారు.



భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న అన్నా లెజినోవా

తిరుమలలో అన్నా లెజినోవా అన్నదానం

⏩ కుమారుడి పేరిట అన్నప్రసాద పథకానికి రూ. 17 లక్షల విరాళం

తిరుమల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తమ కుమారుడు మార్క్ శంకర్ పేరిట తిరుమలలో సోమవారం అన్నప్రసాద వితరణ పథకానికి రూ.17 లక్షల విరాళం అందజేశారు. స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. తర్వాత భక్తులందరితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు సుప్రభాత సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడిన నేపథ్యంలో మొక్కులు చెల్లించేందుకు ఆదివారం తిరుమలకు చేరుకున్న ఆమె డిక్లరేషన్‌పై సంతకం చేసి వరాహస్వామిని దర్శించుకుని తలనీలాలు సమర్పించిన విషయం తెలిసిందే. రాత్రికి తిరుమలలోనే బస చేసిన ఆమె సోమవారం వేకువజామున వైకుంఠం క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనం తర్వాత హుండీలో కానుకలు సమర్పించి ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అన్నా లెజినోవాను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నా!

⏩ హైదరాబాద్‌లోని అక్కకు తమ్ముడి ఫోన్.. ఆపై భవనంపైకి ఎక్కిన వైనం

⏩ ఆమె ఫోన్‌తో పది నిమిషాల్లోనే కాపాడిన తిరుమల పోలీసులు



పోలీసుల అదుపులో మునిసాత్విక్

తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తన తమ్ముడు ఆత్మహత్య చేసుకోబోతున్నాడంటూ ఓ యువతి రోదిస్తూ హైదరాబాద్ నుంచి తిరుమల పోలీసులకు సమాచారమిచ్చింది. ఎలాగైనా కాపాడాలంటూ ప్రాధేయపడింది. సకాలంలో పోలీసులు కూడా స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. తిరుమలలో సోమవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నానికి చెందిన మునిసాత్విక్(25) తన దగ్గరి బంధువు నరేష్‌తో కలిసి నాలుగురోజుల క్రితం తిరుమలకు వచ్చాడు. తర్వాత మునిసాత్విక్ కనిపించకుండా పోయాడు. సోమవారం వేకువజామున 4 గంటల సమయంలో మునిసాత్విక్ హైదరాబాద్‌లోని తన అక్క స్వర్ణరేఖకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు సమాచారమిచ్చి ఫోన్ పెట్టేశాడు. దీంతో స్వర్ణరేఖ తిరుమల టూటౌన్ పోలీసులకు ఫోన్ చేసి విషయాన్ని వివరించింది. వారు స్పందించి సెల్‌ఫోన్ లోకేషన్ ద్వారా తిరుమలలోని కల్యాణి సత్రాలపై మునిసాత్విక్ ఉన్నట్టు గుర్తించి, దూకేందుకు సిద్ధంగా ఉన్న మునిసాత్విక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక స్థితి సక్రమంగా లేదని గుర్తించి తిరుపతిలోకి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

రామగిరి ఎస్సైని దూషించిన వారిపై కేసు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులను సోషల్ మీడియా వేదికగా దూషించిన వారిపై కేసు నమోదైంది. ఈ నెల 13న ఎస్ఐ సుధాకర్ చేసిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది.

ఐదేళ్లూ అక్రమాలే!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించారు. 2021-24 మధ్య కాలంలో గోశాలను ఆర్థిక వనరుగా మార్చుకున్నారని, మూగజీవాలైన గోవులకు పెట్టే దాణాలోనూ సొమ్ములు నొక్కేశారని, పురుగులు పట్టిన దాణాను పెట్టారని తెలిపారు. భారీ సంఖ్యలో గోవులు చనిపోయినా.. ఆనాడు వివరాలు వెల్లడించకుండా, మూడో కంటికి తెలియకుండా దాచేశారని చెప్పారు. కనీసం విజిలెన్స్ అధికారులను కూడా గోశాలలోకి రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. 'లడ్డూ నెయ్యి నుంచి పాల వరకు అన్నీ కల్తీ చేశారు." అని వ్యాఖ్యానించారు. కాగా, నేడు అవాస్తవాలను ప్రచారం చేస్తూ.. వాస్తవాలను వక్రీకరిస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. గోవుల మరణాలకు సంబంధించి భూమన చేసిన ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. గోవుల సహజ మరణాలను రాజకీయాలకు వాడుకోవడం సరైంది కాదన్నారు. 2021-24 మధ్య ఒక్క గోశాలలోనే కాకుండా.. టీటీడీలోని అనేక విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని, అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. సోమవారం తిరుపతిలో శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. గత 10 నెలల్లో సాధారణ భక్తుల ఇబ్బందులు తగ్గించే ప్రయత్నం చేశామన్నారు.

గోశాలను సొంతమనుకున్నారు!

టీటీడీ గోశాలను 2021-24 మధ్య కొందరు తమ సొంతమనుకున్నారని, అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారని ఈవో శ్యామలరావు వ్యాఖ్యానించారు. ఆ నాలుగేళ్లలో విజిలెన్స్ నివేదికలు, వీడియోలు, ఫొటోలు టీటీడీ రికార్డుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరణించిన గోవుల వివరాలు దాచిపెట్టడమే కాకుండా.. గోశాల నిర్వహణను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. దీంతో గోశాల నిర్వహణ దారుణంగా ఉండేదన్నారు. పురుగులు పట్టిన దాణా పెట్టడమే కాకుండా, లేబుల్ కూడా లేని మందుల కొనుగోళ్లు, కాలం చెల్లిన మందుల వాడకం, దాణా కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "గత ప్రభుత్వంలో విజిలెన్స్ అధికారులను కూడా గోశాలలోకి అనుమతించలేదు. వారు ఫొటోలు, వీడియోలు తీయకుండా అడ్డుకున్నారు. విజిలెన్స్ నివేదికల్లో ఇవన్నీ ఉన్నాయి." అని శ్యామలరావు తెలిపారు. అగ్నిప్రమాదాలు, పైపులైన్లు కాలిపోవడం వంటి ఘటనల్లో కూడా నష్టాన్ని అధికంగా చూపించారన్నారు. ఆవులు లేని కమలయ్యగారిపల్లె గోశాలకు తిరుపతి గోశాలతో కలిపి దాణా సరఫరాకు టెండర్లు పిలిచి అక్రమాలకు పాల్పడ్డారని.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విజిలెన్స్ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేదని, తాము వచ్చిన తర్వాత వాటిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



వైసీపీ హయాంలో గోశాలలో మృతి చెందిన గోవులు



గతంలో పురుగులు పట్టిన దాణాను పారేసిన దృశ్యం

మనోభావాలు దెబ్బతీయకండి

హిందువుల మనోభావాలను, టీటీడీ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా భూమన కరుణాకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఈవో శ్యామలరావు అన్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. 2024 మార్చిలో వైష్ణవి డెయిరీకి 14 లక్షల లీటర్ల పాలను సరఫరా చేయడానికి గత పాలకమండలి అనుమతి ఇచ్చిందని, అయితే తాము ఆ పాలలో నాణ్యత లేదని గుర్తించి రద్దు చేశామన్నారు. కరుణాకర్‌రెడ్డికి గోశాల మీద అంత ప్రేమ ఉంటే అలా ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లో 43 గోవులు మాత్రమే మృతి చెందాయని వెల్లడించారు. ఎక్కడో మృతి చెందిన గోవులను టీటీడీ గోశాలలో మృతిచెందినట్లు చెప్పడం భావ్యం కాదన్నారు. గోశాలలో 2022 నుంచి భర్తీ చేయని 135 పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

తిరుమలలో శ్రీవారి దర్శనానికి టికెట్లు, వసతి వంటివి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలన్నా పలువురు భక్తులు దళారీలను ఆశ్రయించే పరిస్థితి గతంలో ఉండేదని ఈవో శ్యామలరావు చెప్పారు. సాధారణ ఇంజనీరింగ్ అధికారి 30 ఏళ్లపైన పనిచేస్తే చీఫ్ ఇంజినీరు అవుతారని, ఐటీ విభాగం జీఎం పోస్టుకు అలాంటి అర్హత కలిగిన అధికారి ఉండాల్సి ఉందన్నారు. గతంలో ఐటీ జీఎం పోస్టు కోసం నోటిఫికేషన్ ఇస్తే 69 దరఖాస్తులు వచ్చాయని, అందులో ఇద్దరిని ఎంపిక చేస్తే ఒకరు ఇంటర్వ్యూకి రానందున మిగిలిన వ్యక్తిని జీఎంగా నియమించారన్నారు. అధికారులు వద్దన్నా కూడా బోర్డు నిర్ణయం పేరిట అర్హత లేని వ్యక్తిని జీఎంగా నియమించారన్నారు. దీంతో ఒక దళారీ 50 సార్లు సేవా టికెట్లను బుక్ చేసుకున్నారని, ఇంకొక దళారీ 200 వసతి సేవలు పొందారన్నారు. మరొకరు 500 ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్లు పొందారని.. ఈ విధంగా టీటీడీ ఐటీ వ్యవస్థ మొత్తం దళారీల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. తాజాగా సుమారు 30 వేల మంది దళారీలను బ్లాక్ చేయడంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పుడా అధికారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

'సేంద్రీయం'గా దోచేశారు!

శ్రీవారి అన్నప్రసాదాల విషయంలో నాణ్యత లేని బియ్యం, తక్కువ పరిమాణంలో పంపిణీ వంటివి గుర్తించామని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. 2021-24 మధ్య కేజీ రూ.600 ఉండే నెయ్యికి రూ.2000 చొప్పున, రూ.50 బియ్యానికి రూ.90, రూ.60 ఉండే బెల్లం కోసం రూ.120.. ఇలా ఇష్టానుసారం ధరలు నిర్ణయించి దోచేశారని ఆరోపించారు. కేవలం రూ.3 కోట్ల విలువైన విరాళాలు తీసుకుని రూ.25 కోట్ల విలువైన దాతల పాస్ పుస్తకాలను విడుదల చేశారని వివరించారు. వాటన్నింటినీ గుర్తించి రద్దు చేశామన్నారు.

ఆవు నెయ్యిలో యానిమల్ ఫ్యాట్, వెజిటెబుల్ ఫ్యాట్ కలిసిందని ఎన్‌డీడీబీ నుంచి నాలుగు రిపోర్టులు రావడంతో ఏఆర్ డెయిరీని బ్లాక్ లిస్టులో పెట్టామని ఈవో శ్యామలరావు వెల్లడించారు. ఏఆర్ డెయిరీ స్వయంగా నెయ్యి సరఫరా చేయలేక వైష్ణవి డెయిరీని ఆశ్రయిస్తే ఆ డెయిరీ బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరించిందన్నారు. దీనిపై సిట్ విచారణ కొనసాగుతోందని, ఇద్దరు టీటీడీ అధికారులను విచారించాల్సి ఉందని, సిట్ అనుమతి కోరిందన్నారు. దీనికి త్వరలో అనుమతి ఇస్తామన్నారు. రూ.320కి స్వచ్ఛమైన లీటరు ఆవు నెయ్యి ఎలా వస్తుందని ఈవో ప్రశ్నించారు. కనీసం బయటకు పంపి అయిన పరీక్షలు చేయకుండా రివర్స్ టెండర్ విధానంలో రూ.320 ధరతో కాంట్రాక్టు కేటాయించడం వల్లే కల్తీ జరిగిందన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు తాము స్వచ్ఛమైన నందిని నెయ్యిని వినియోగిస్తున్నామన్నారు.

కసిరెడ్డి కోసం వేట

(మొదటి పేజీ తరువాయి)

వెలికితీసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణకు హాజరుకాకుండా ఆయన తప్పించుకుంటున్నారు. సిట్ అధికారులు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సోమవారం హైదరాబాద్‌లోని రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఆయన ఇళ్లు, కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. అదేవిధంగా కసిరెడ్డి బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లలోనూ మొత్తం 15 చోట్ల సోదాలు చేసినట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఏక్తా హైట్స్‌లో సోదాలు నిర్వహించారు. కసిరెడ్డి భార్య డైరెక్టర్‌గా ఉన్న రాయదుర్గంలోని అరేటి ఆస్పత్రిలో, అలాగే ఆయన అత్త ఇంట్లో సోదాలు చేసినట్టు సమాచారం. కసిరెడ్డి సన్నిహితుడు అవినాశ్ రెడ్డి ఇల్లు, శంకర్‌పల్లి మహారాజ్‌పేటలో అవినాశ్‌రెడ్డి అత్త ఇల్లు, రంగారెడ్డి జిల్లా శ్రీశ్రీ అపార్ట్‌మెంట్స్, మంచిరేవులలో కసిరెడ్డి సన్నిహితుడు ఉపేంద్ర రెడ్డి ఇంట్లో కూడా సోదాలు చేసినట్టు తెలిసింది. మంగళవారం కూడా సిట్ అధికారులు సోదాలు కొనసాగించనున్నారు.

నోటీసులు ఇచ్చినా..

వాస్తవానికి కసిరెడ్డిని మార్చి చివరి వారం, ఏప్రిల్ మొదటి వారంలో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే, ఆయన డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశించాక మరోమారు ఈ నెల 9న విచారణకు రావాలని 5వ తేదీనే నోటీసు ఇచ్చారు. అయితే, తొలి రెండు నోటీసులకు.. కారణం చెబితేనే వస్తానని కసిరెడ్డి భీష్మించారు. అంతేకాదు, ఆ వెంటనే కోర్టును ఆశ్రయించారు. సిట్ చట్టబద్ధతను ప్రశ్నించారు. దీనిపై జరిగిన విచారణ అనంతరం.. సిట్‌కు చట్టబద్ధత ఉందని, విచారణకు సహకరించాలని కోర్టు తేల్చి చెప్పింది. దీంతో పోలీసులు ఈ నెల 5న మరోసారి నోటీసు ఇచ్చారు. 9న విచారణకు రావాలని కోరారు. అయితే, హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేసిన కసిరెడ్డి.. విచారణకు డుమ్మా కొట్టారు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు.

కర్త-కర్మ-క్రియ!

రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్‌కు కర్త, కర్మ, క్రియ అయిన రాజ్ కసిరెడ్డి పాత్రపై కీలక సమాచారాన్ని సేకరించిన సిట్ ఆయన్ను ప్రశ్నిస్తే కేసు కొలిక్కి వస్తుందని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు పదవిలో ఉంటూనే తెరవెనుక మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించారని అంచనా వేశారు. మద్యం తయారీదారుల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్లకు తగ్గకుండా వసూలు చేసి సుమారు రూ.3 వేల కోట్ల వరకు తాడేపల్లి ప్యాలెస్ పెద్దలకు చేర్చినట్లు ఆరోపణలున్నాయి. లంచాల నెట్‌వర్క్‌ను రూపొందించి వైసీపీ ప్రభుత్వంలో పెద్దరెడ్డి గా పేరున్న నాయకుడితో కలిసి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని దందా నిర్వహించినట్టు ఆధారాలు లభించాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవహారం తాడేపల్లి వరకు వెళ్తుందని భావించి కొందరు పెద్దలు కసిరెడ్డిని తప్పించినట్టు సిట్ వర్గాలు అనుమానిస్తున్నాయి.

నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా: భూమన

తిరుపతి(రవాణా), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో గోవులు చనిపోయాయని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చనిపోయిన ఆవుల సంఖ్యపై టీటీడీ చైర్మన్, ఈవో తదితరులు భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారన్నారు. చనిపోయిన గోవులకు సంబంధించిన తాను చూపిన ఫొటోలను మార్ఫింగ్ అని టీటీడీ ప్రకటన చేసిందని, టీడీపీ వాళ్లు సోషల్ మీడియాలో వైరల్ చేశారని చెప్పారు. అయితే ఆ ఫొటోలు మార్ఫింగ్ కాదని, అవి టీటీడీ గోశాలలో తీసినవేనని, భగవంతుడిపై ప్రమాణం చేస్తున్నానని, ఈ విషయంలో ఏ విచారణకైనా సిద్ధమన్నారు. గోశాలకు సాధువులు, స్వామీజీలతో కలిసి వెళ్లి.. ఎన్ని గోవులు చనిపోయాయో చూద్దామని, రావడానికి తానూ సిద్ధమన్నారు. టీటీడీని ప్రక్షాళన చేశానని చెప్పుకుంటున్నారని, ఎక్కడ ప్రక్షాళన చేశారో అర్థం కావడం లేదన్నారు. టీటీడీ ఉద్యోగుల్లో 2 వేల మంది తమ నిఘా నేత్రాలేనని, వారు టీటీడీలో జరుగుతున్న విషయాలపై తమకు సమాచారం ఇస్తుంటారని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.